




www.navabhoomi.in | epaper.navabhoomi.in RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ 27 ఆదివారం ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 223
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# విపక్షాల అణిచివేత

- మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేసి..వేధిస్తున్నారు
- భారత్ జోడో యాత్రలో సరిగ్గా వినడం నేర్చుకున్నట్లు రాహుల్ వెల్లడి
- ప్రజల సమస్యలను లోతుగా ఆలకించడం చాలా ముఖ్యమని గ్రహింపు
- రాజకీయాల్లో 'ప్రేమ', 'ఆప్యాయత' వ్యక్తం చేయడం ప్రారంభించినట్లు వెల్లడి
- ఈ మార్పు ప్రజలతో తన అనుబంధాన్ని సులభతరం చేసింది
- భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మోదీ జమానాలో ప్రతిపక్షాలను అణచివేశారు..మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయి. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు' అంటూ మండిపడ్డారు. ఉగ్రదాడి మృతులకు రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు.
తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భారత్ సమ్మిట్ 2025 నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం అయిన ఈ కార్యక్రమంలో 100 దేశాలకు చెందిన 450 మంది ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్ చివరి రోజున ఈ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు వ్యక్తం చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. ' ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయి. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనైపోయింది. మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు' అంటూ మండిపడ్డారు.
కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల తాను చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా నేర్చుకున్న కీలక పాఠాలను పంచుకున్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల మాటలు వినడం కంటే మాట్లాడటానికే ప్రాధాన్యత ఇచ్చానని, కానీ యాత్ర సమయంలో అసలైన 'వినడం' అంటే ఏమిటో నేర్చుకున్నానని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యాత్రలో ప్రజలతో మమేకమైనప్పుడు, వారి సమస్యలను, భావాలను లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేశానని తెలిపారు.
యాత్ర ప్రారంభంలో తన మనసులో

# రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

- వాటికన్ సిటీలో ట్రంప్- జెలెన్ స్కీ కీలక భేటీ!
- యుద్ధం ముగింపుపై చర్చ..సానుకూల వాతావరణం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మాస్కోలో పర్యటన..పుతిన్‌తో భేటీ
- అమెరికాతో ఒప్పందం చేసుకోవడానికి మాస్కో సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ ప్రకటన

2



**వాషింగ్టన్ డిసి-నవభూమిబ్యూరో**

రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధానికి ముగింపు దగ్గరపడింది. ఆ దిశాగా అమెరికా పెదన్న పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మాస్కోలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. అటు అమెరికాతో ఒప్పందం చేసుకోవడానికి మాస్కో సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు సరైన మార్గంలో ఆలోచించడం వల్లే ప్రస్తుతం శాంతి చర్చలు సవ్యదిశగా సాగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ భేటీ అయ్యారు. ఈ భేటీ వాటికిన్ సిటీ వేదిక అయింది. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంతిమయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రంపంచ దేశాల అధినేతలు, ప్రతినిధులు దాదాపు 164 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అమెరికా, ఫ్రాన్స్, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, మెక్రాన్, జెలెన్ స్కీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ - జెలెన్ స్కీ భేటీ సమావేశమైయ్యారు. యుద్ధం ముగింపు, ఖనిజాల ఒప్పందం వంటి అంశాలపై వీరు చర్చించినినట్లు .. వారి మధ్య చర్చలు సానుకూలంగా సాగాయని అధ్యక్ష కార్యాలయాలు వెల్లడించాయి. అమెరికాలోని ఓవల్ కార్యాలయంలో గతంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగిన తర్వాత, ఇప్పుడు మళ్ళీ కలుసుకోవడం ఇదే మొదటి సారి. పైగా, ఉక్రెయిన్ యుద్ధంపై వారంలోపే ఓ ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో, ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, పోప్ అంత్యక్రియల కార్యక్రమంలో వీరిద్దరూ వేర్వేరు చోట్ల కూర్చోవడం, వారి మధ్య ఇంకా మనస్పర్థలు ఉన్నాయన్న ఊహాగానాలకు తావిచ్చింది. వీటిపై వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చియుంగ్ స్పందిస్తూ, కార్యక్రమానికి హాజరైన దేశాల ప్రతినిధులకు

# కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- హరిరామ్ నివాసంతో పాటు మొత్తం 14 చోట్ల రెయిడ్స్
- హరిరామ్ పేరిట భారీగా ఆస్తుల ఉన్నట్లుగా ఏసీబీ అధికారులు గుర్తింపు
- గజ్వేల్‌లో 30 ఎకరాల భూమి పత్రాలను స్వాధీనం
- అదేవిధంగా 3 బ్యాంక్ లాకర్లు ఉన్నట్లుగా తేల్చిన అధికారులు
- కొత్తగూడెంకు కాళేశ్వరం కాక...హరిరాం బంధువుల ఇళ్లల్లో సోదాలు

2




(కాళేశ్వరంలో ఈఎన్సీ)

**ఎంఏ వాహాబ్ / కొత్తగూడెం ఏప్రిల్ 26 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు కీలక అధికారి ఇంటిపై, ఆయన బంధువుల ఇళ్లపై పై శనివారం ఏసీబీ దాడి జరిగింది. కొత్తగూడెంకు కాళేశ్వరం కాక తగిలింది. ఈఎన్సీ హరీరామ్ స్వంత ఊరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ లో హరిరామ్ బంధువుల ఇంట్లో కూడా సోదా నిర్వహించింది. ఎదురుగడ్డలో ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ భూక్య హరీరామ్ బంధువుల ఇళ్లలో శనివారం ఉదయం 5:30 నుండి ఖమ్మం రేంజ్ ఏసీబీ డిఎస్పి వై.రమేష్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. కాగా భూక్య హరీరామ్ కు కొత్తగూడెం ఎదురుగడ్డ లో ఆయనకు నివాసం ఉంది. హైదరాబాద్ షేక్ పేట లోని హరీరామ్ నివాసంలో ఈ తెల్లవారుజాము నుంచి ఏసీబీ

# సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్

- ఏపీ మద్యం స్కాంలో అనూహ్య పరిణామం
- ఇప్పటికే కసిరెడ్డి రాజ్,చాణక్య అరెస్టు
- సజ్జల శ్రీధర్ రెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్
- జిల్లా జైలుకు తరలించిన సిట్ అధికారులు



**విజయవాడ-నవభూమిబ్యూరో**

ఏపీ మద్యం కుంభకోణం దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ6గా ఉన్న సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. ఆయనను విజయవాడలోని అవినీతి నిరోధక విభాగం ప్రత్యేక న్యాయస్థానం సమక్షానికి ప్రవేశపెట్టగా మే 6వ తేది వరకు అంటే 14 రోజుల పాటు రిమాండ్ పడింది. ఈ కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి ఏ1గా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ఇదివరకే అరెస్ట్ అయ్యారు. అలాగే ఏ8గా ఉన్న రాజ్ కసిరెడ్డి తోడల్లుడు చాణక్య కూడా అరెస్ట్ అయ్యారు. ఇదే కేసులో తాజాగా ఏ6 గా ఉన్న సజ్జల శ్రీధ ర్‌రెడ్డిని ప్ర త్యేక దర్యాప్తు బృందం అధికారులు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. విజయవాడకు తీసుకొచ్చారు. ప్రొసీజర్ ప్రకారం ఆయనకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. వాదోపవాదాలను విన్న తరువాత న్యాయమూర్తి సిట్ అరెస్ట్‌ను సమర్థించారు. సజ్జల శ్రీధర్ రెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీనితో సిట్ అధికారులు ఆయనను జిల్లా జైలుకు తరలించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సంభవించినట్లుగా అనుమానిస్తోన్న మద్యం అమ్మకం, కొనుగోళ్లల్లో 3,200 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సిట్ అధికారులు నిర్ధారించిన విషయం తెలిసిందే. ఇటీవలే తెలుగుదేశం పార్టీ ఎంపీ లావు శ్రీ కృష్ణదేవ రాయలు ఈ అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తారు. మద్యం కుంభకోణంపై కేంద్ర ఏజెన్సీలతో దర్యాప్తు చేయించాలంటూ విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సమర్పించారు. దీని తరువాత సీఐడీ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. నిందితుల అరెస్టుపై దృష్టి సారించింది. ఈ కేసులో వైఎస్ఆర్సీపీకి చెందిన రాజంపేట లోక్‌సభ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజ్యసభ మాజీ

# పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

- రాష్ట్రపతి ముర్ము,ట్రంప్ ప్రపంచ నాయకుల హాజరు
- సెయింట్ పీటర్స్ బాసిలికాలో పోప్‌కు నివాళులు
- రాష్ట్రపతి వెంట మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, సహాయ మంత్రి జార్జ్ కురియన్, గోవా అసెంబ్లీ ఉపాధ్యక్షుడు జోషువా డి'సౌజా

2



**వాటికన్ సిటీ-నవభూమిబ్యూరో:** క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వాటికన్ సిటీకి చేరుకున్నారు.
క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వాటికన్ సిటీకి చేరుకున్నారు. అక్కడ ఆమె సెయింట్ పీటర్స్ బాసిలికాలో పోప్‌కు నివాళులర్పించారు. రాష్ట్రపతి వెంట మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, సహాయ మంత్రి జార్జ్ కురియన్, గోవా అసెంబ్లీ ఉపాధ్యక్షుడు జోషువా డి'సౌజా కూడా

# భారీ అగ్ని ప్రమాదం

- ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు..400 గుడిసెలు దగ్ధం
- గుడిసెల్లో పేలుతున్న గ్యాస్ సిలిండర్లు..జనం పరుగులు
- 4 ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపులోకి..

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హయత్‌నగర్ కుంట్లూరులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రావి నారాయణ రెడ్డి నగర్‌లో పేదల గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి.

2




మంటలు భారీగా ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయంతో తమ తమ గుడిసెల్లోంచి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. 4 ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. సిలిండర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.
ప్రమాదంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ కేశవులు మాట్లాడారు. తమకు గంట క్రితం ఫైర్ స్టేషన్‌కి కాల్ వచ్చిందని.. కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో గుడిసెలు తగలబడిపోతున్నాయని సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎల్బీనగర్, హయత్‌నగర్‌లోని తమ

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- మీ సమస్యలను తెలుసుకునేందుకు నేరుగా వచ్చా..
- 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం
- కూటమి ప్రభుత్వం వచ్చాకే జాలర్ల దశదిశ మారింది
- వేట విరామ సమయంలో జాలర్లకు ఆర్థిక సాయం
- మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున సాయం
- 1,29,178 కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి

2



**శ్రీకాకుళం-నవభూమిబ్యూరో:** జిల్లా పర్యటనలో భాగంగా 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అని అన్నారు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశానని.. కొందరు జాలర్ల ఆదాయం కూడా కాజేస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులున్నా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గత ఎన్నికల్లో వెనకబడిన వర్గాలన్నీ కూటమికి అండగా నిలిచాయని.. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు తీసుకొస్తామని సీఎం వెల్లడించారు.
గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని.. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన రుణాలు ఏం చేశారో కూడా లెక్కలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే జాలర్ల దశదిశ మారిందన్నారు. వేట విరామ సమయంలో జాలర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. పథకం కింద 1,29,178 కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 'గత నాయకుల మాదిరిగా మేము కూడా బటన్ నొక్కొచ్చు కానీ.. నేరుగా మీ దగ్గరికే వచ్చాం.. మీ సమస్యలు తెలుసుకున్నాం. మీ కష్టాలు తెలుసుకుని నేరుగా పథకాలు అందిస్తున్నాం' అని తెలిపారు. అన్ని మత్స్యకార గ్రామాలను బాగుచేస్తామని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని.. ప్రజల ఆదాయం పెంచాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరిచాలన్నారు. గతంలో నేతలు వస్తే చెట్టు నరికేయడం.. పరదాలు కట్టడం జరిగేవని విమర్శించారు.

# వైసీపీ మాజీ ఎంపీకి బిగ్‌షాక్!

- ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రేణుక, ఆమె భర్త నీలకంఠం రూ.310 కోట్లు అప్పు
- అప్పు తిరిగి చెల్లించకపోవడంతో వారి ఆస్తుల వేలానికి ఎల్ఐసీ సన్నద్ధం
- ఇప్పటికీ రేణుక ఆస్తులు రెండుసార్లు వేలం..ఇప్పుడు 3వసారి సిద్ధం
- ఆస్తులు విక్రయించి రుణం రీ షెడ్యూల్ చేయాలని కోరినా అంగీకరించని ఎల్ఐసీ

2



**కర్నూలు-నవభూమిబ్యూరో**

వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుకకు బిగ్ షాక్ తగిలింది. ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి అనుబంధ విభాగమైన ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రేణుక, ఆమె భర్త నీలకంఠం రూ.310 కోట్లు అప్పు తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ లోన్ తిరిగి చెల్లించకపోవడంతో వారి ఆస్తులను వేలం వేసేందుకు ఎల్ఐసీ సిద్ధమైంది. ఇప్పటికే రెండుసార్లు వేలం వేయగా.. ఇప్పుడు మూడోసారి కూడా వేలం వేయబోతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధి అయ్యి ఉండి ఈ తరహా ఘటనలో ఆమె పేరు వినిపిస్తుండడం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. లోన్ వివరాలు.. 2018లో 15 ఏళ్ల కాలానికి గాను.. మాజీ ఎంపీ రేణుక, ఆమె భర్త నీలకంఠం కలిసి రూ.310 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణాన్ని బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ కార్యకలాపాలకు వినియోగించారు. ఐదేళ్ల క్రితం వరకు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించారు. మొత్తం రూ. 40 కోట్ల వరకు తిరిగి చెల్లించారు. అయితే, ఆ తర్వాతి నుంచి చెల్లింపులు నిలిపివేశారు. అసలు, వడ్డీ కలిపి ఇంకా దాదాపు రూ. 340 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే, వడ్డీ భారం ఎక్కువగా ఉండటంతో కొన్ని ఆస్తులు విక్రయించి రుణం రీ షెడ్యూల్ చేయాలని వారు కోరారు. ' అయితే ఈ ప్రతిపాదన నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో హెచ్ఎఫ్ఎల్ దీనిని అంగీకరించలేదు. అంతే కాకుండా రుణం తీసుకున్న మొత్తానికి నెలసరి వాయిదా రూపంలో రూ. 3.4 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ మొత్తం భారంగా మారడంతో తొలుత తక్కువ మొత్తం తీసుకుని.. చెల్లింపు మొత్తాన్ని క్రమేణా

# ఇరాన్‌లో అత్యంత భారీ పేలుడు

- కిలోమీటర్ వరకు ప్రభావం
- 400 మంది దాకా గాయపడినట్లు సమాచారం
- పోర్టులోని కొన్ని కంటైనర్లు పేలటం వల్ల ఆ ప్రమాదం

2

**షాహిద్ రాజాయి పోర్టు-నవభూమిబ్యూరో**

ఇరాన్‌లోని షాహిద్ రాజాయి పోర్టులో అత్యంత భారీ పేలుడు సంభవించింది. పోర్టులోని కొన్ని కంటైనర్లు పేలటం వల్ల ఆ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు కొన్ని సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.
ఇరాన్‌లో అత్యంత భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు కారణంగా ఏకంగా 400 మంది దాకా గాయపడినట్లు సమాచారం. శనివారం సాయంత్రం షాహిద్ రాజాయి పోర్టులో ఈ పేలుడు చోటుచేసుకుంది. దాదాపు ఒక కిలోమీటర్ మేర పేలుడు ప్రభావం కనిపించింది. పోర్టులోని కొన్ని కంటైనర్లు పేలటం వల్ల ఆ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు కొన్ని సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో పేలుడు

# ఏపీకి భారీగా నిధుల విడుదల..!

- ఏపీ సర్కార్‌కు కేంద్రం గుడ్ న్యూస్..
- పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- రూ.1121.20 కోట్ల నిధులు ఏపీకి విడుదల

2


**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఏపీలో కూటమి ప్రభుత్వానికి కేంద్రం ఇవాళ శుభవార్త చెప్పింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్ని ఇవాళ విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ నిధుల బకాయిల్ని కేంద్రం ఆంధ్రప్రదేశ్ ఖజానాకు జమచేసింది. దీంతో అమరావతి రాజధాని పనుల తిరిగి ప్రారంభానికి ప్రధాని మోడీ రాక వేళ కేంద్రం నుంచి అందిన సాయం చర్చనీయాంశమవుతోంది. 15వ ఆర్థిక సంఘం ఆంధ్రప్రదేశ్ కు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇవ్వాల్సిన రూ.1121.20 కోట్ల నిధుల్ని ఇవాళ కేంద్రం విడుదల చేసింది. రాష్ట్రంలోని జిల్లా, మండల పరిషత్తులకు, పంచాయతీలకు ఈ నిధులు కేటాయించారు. 2024-25 సంవత్సరానికి రెండో విడతగా



## ప్రయాణికుడికి అస్వస్థత.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**హైదరాబాద్-నవభూమి:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. వారణాసి నుంచి బెంగళూరు వెళు_న్న ఇండిగో విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీగా ల్యాండ్ అయ్యింది. వారణాసి నుంచి విమానం బయలుదేరిన కొద్దిసేపటికి అందులో ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని విమాన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించారు. దీంతో పైలెట్ హుటాహుటిన విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి దారి మళ్లించారు. విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశాడు పైలెట్. అయితే ముందుగానే ఎయిర్‌పోర్టు సిబ్బందికి ప్రయాణికుడి గురించి సమాచారం అందించడంతో అంబులెన్స్‌తో సిద్ధంగా ఉన్నారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే హుటాహుటిన సదరు ప్యాసింజర్‌ను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఇంత చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆస్పత్రికి తరలించే లోపే ఆ ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోయాడు. అసలు ప్రయాణికుడికి ఏమైంది.. అతడి వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. కాగా.. ఈ నెలలోనే ఇండిగో విమానంలో ఓ ప్రయాణికురాలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇది మహారాష్ట్రలో చోటు చేసుకుంది. ముంబై నుంచి వారణాసి వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న సుశీలా దేవి అనే ప్రయాణికురాలు తీవ్ర అనారోగ్యానికి గురైంది. వెంటనే విమానాన్ని ల్యాండింగ్ చేసేందుకు పైలెట్ ప్రయత్నించారు. అయితే అప్పటికే విమానం గాల్లో ఉండగానే సుశీలాదేవి మృతి చెందారు. ఉత్తప్రదేశ్‌కు చెందిన సుశీలా దేవి విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో అస్వస్థతకు గురవడంతో మహారాష్ట్రలోని చికాల్తానా ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీగా ల్యాండ్ చేశారు. వైద్యులు ఆమెను పరీక్షించగా.. అప్పటికే సుశీలా దేవి మృతి చెందినట్లు నిర్ధారించారు.



## 60 ఏండ్ల వయస్సులోనూ టీనేజర్లతో పోటీ.. ఇంజినీరింగ్, ఫార్మసీ చదివేందుకు వృద్ధుల ఆసక్తి



**హైదరాబాద్-నవభూమి:** అరవై ఏండ్ల వయస్సులోనూ మాకేం తక్కువ అంటూ టీనేజర్లతో పోటీపడుతున్నారు కొందరు వృద్ధులు. అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షకు 56, 58 ఏండ్ల వయస్సు వారు దరఖాస్తు చేశారు. 56 ఏండ్ల గల పెద్దాయన ఇంజినీరింగ్‌కు, 58ఏండ్లున్న మరో పెద్దాయన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి దరఖాస్తు చేశారు. ఎప్‌సెట్ దరఖాస్తు స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. ఎప్‌సెట్‌కు 3.06 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌కు 2.20లక్షలు, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 86వేలు, రెండు పేపర్లు రాసేందుకు 254 మంది చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 29 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి మూడు సెషన్లు, ఇంజినీరింగ్‌కు మొత్తం 6 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 112, ఇంజినీరింగ్ విభాగం పరీక్షల కోసం 124 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు.

## సీతమ్మసాగర్‌కు కేంద్రం అనుమతిపై మంత్రి రియాక్షన్



**హైదరాబాద్-నవభూమి:** సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇది తెలంగాణ ఇరిగేషన్ చరిత్రలో లాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కృషి ఫలించిందన్నారు. ఇరిగేషన్ శాఖలో ఇది ముందడుగని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గోదావరి నదీ జలాలలో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో మేడిగడ్డ కూలిపోయిందని..సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందన్నారు. సీడబ్ల్యూసీకి అన్ని వివరాలు పంపితే అప్పుడు అప్రూవల్ ఇచ్చారని వెల్లడించారు.%పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. ముంపు నష్టం.. ప్రొటెక్షన్ వాల్ కోసం కేంద్రం నిధులు ఇవ్వాలని అడిగామని.. అందుకు కేంద్రం కొంత అనుకూలంగా ఉందని తెలిపారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణ రైతులకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణకు ఎక్కువ భాగం ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వర్కౌట్ చేస్తోందన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ మాట్లాడే తీరు ఖండిస్తున్నామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర తాము ప్రాజెక్ట్ మొదలుపెట్టామని.. బీఆర్ఎస్ తమకు పేరు వస్తుందని రీడిజైన్ చేసి... లక్షన్నర కోట్లకు పెంచారని అన్నారు. కాళేశ్వరం కట్టిన డబ్బు బీఆర్ఎస్ వాళ్ళ జేబులో నుంచి కట్టలేదన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్ తాకట్టు పెట్టి మరీ కట్టారని మండిపడ్డారు. వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలిందని అన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ చూస్తే ఎంత దుర్మారం చేశారో అర్థం అవుతోందన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లో విషయాలు తెలంగాణ ప్రజలు గుర్తించాలని అన్నారు.ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి షిఫ్ట్ చేసి అన్యాయం చేశారని..ద్రోహం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డనే కాదు.. సుందిళ్ళ, అన్నారం కూడా ప్రమాదంలో ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. లక్ష కోట్లు దోపిడి చేసిన వాళ్లకు ఎలాంటి శిక్ష వేయాలో ఆలోచించాలన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై సమీక్ష చేస్తామన్నారు. బీఆర్ఎస్ లాగా చిల్లర ఆలోచనలు తమకు ఉండవన్నారు. 'మీ సభ ఎప్పుడూ ఉందో ఎన్‌డీఎస్ఏకు ఏం తెలుసు. అబద్ధపు మాటలు ఆపండి. ఎన్‌డీఎస్ఏ సూచనలే మేము నమ్ముతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కేసీఆర్‌కు థ్రెట్.. ఎంపీ అరవింద్ షాకింగ్ కామెంట్స్




**హైదరాబాద్-నవభూమి:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. కేసీఆర్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే గత కొన్నేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారని అన్నారు. అందరు ఒకే దగ్గర ఉంటే తనను కుటుంబ సభ్యులే చంపే అవకాశం ఉందనే భయంతో కేసీఆర్ దూరంగా ఉంటున్నారని ఎంపీ ధర్మపురి అరవింద్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(శనివారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియాతో మాట్లాడారు.


కన్నా బిడ్డలు ఆయనను కలవాలన్న ముందుగా అపాయింట్మెంట్ ఉండాల్సిందేనని ఎంపీ ధర్మపురి అరవింద్ చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అరవింద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై టెక్నికల్ రిపోర్ట్‌ను మీడియాకు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన డబ్బుతోనే రేపు ప్లీనరీ సభ పెడుతున్నారని అరవింద్ ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం, అప్పటి ఇరిగేషన్ మంత్రిపైన సీబీఐ , ఈడీ విచారణ జరిపి జైల్లో పెట్టాలని అన్నారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి అత్యంత డేంజర్ అని విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డిని ప్రత్యామ్నాయంగా ప్రజలు ఎన్నుకుంటే పాత ఆఫీసర్లనే ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వంలో అత్యంత అవినీతి అధికారులు ఉన్నారని ఆరోపించారు. ముందు అధికారుల మీద విచారణ చేస్తే ఎవరు సమర్ధవంతమైన వారో తెలుస్తుందని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## నగరంలో సమ్మర్ నీటి కష్టాలు.. జలమండలి కీలక నిర్ణయర్



**హైదరాబాద్-నవభూమి:** వేసవి కాలం వచ్చిందంటే చాలు హైదరాబాద్ నగరంలో నీటి కష్టాలు మొదలవుతాయి. ఈ సంవత్సరం కూడా ఎండలు ముదరడంతో నీటి సరఫరా తగ్గిపోయింది. దీంతో నగరవాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సరైన పైపులైన్లు లేకపోవడం, ఉన్నా సరిగా నీరు రాకపోవడంతో ప్రజలు జీహెచ్ఎంసీ, ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ట్యాంకర్ల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించేందుకు కృష్ణా జలాల అత్యవసర ఎత్తిపోతలకు జలమండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. మే మొదటివారం నుంచి నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని పంపింగ్ ద్వారా తీసుకునేందుకు సిద్ధమైంది. సాగర్‌లో నీటి మట్టం 510 అడుగులకు చేరితే తప్పనిసరిగా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం (ఏప్రిల్ 25 నాటికి) నీటి మట్టం 514.5 అడుగులు ఉండగా.. 139.43 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నీటి మట్టం మరో నాలుగు అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజీ నుంచి పంపింగ్ అవసరం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికే మార్చిలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అదనపు పంపులను ఏర్పాటు చేశారు. సాగర్ నుంచి నగరానికి రోజుకు 270 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు. దీనికి అవసరమైన 900 క్యూసెక్కుల నీటిని రోజూ పంపింగ్ చేయాల్సి ఉంటుంది. పంపుల ఏర్పాటుకు జలమండలి సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసింది. సాగర్‌లోకి ఇన్‌ఫ్లో పెరిగి నీటి మట్టం 510 అడుగులకంటే ఎక్కువగా వచ్చేవరకు పంపింగ్ కొనసాగనుంది. ఇక ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. రాబోయే రోజుల్లో నీటి కష్టాలు తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనేపథ్యంలో వేసవిలో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా ఉపయోగించడం చాలా అవసరం.

## మరో మహిళతో ఏకాంతంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..
### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. భార్య, కూతుర్ని వదిలేసి మరో మహిళతో రెండో ఇంటిని ఓపెన్ చేశాడు. దీంతో రంగంలోకి దిగన భార్య.. భర్త బండారాన్ని బట్టబయలు చేసింది. సదరు మహిళతో ఏకాంతంగా ఉండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన శివ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో దీప్తి అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. శివ, దీప్తి దంపతులకు మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. అయితే ఇటీవల శివ తన భార్య దీప్తికి దూరంగా ఉంటూ సరైన కారణం చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అనంతరం సుష్మ అనే మహిళతో శివ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. కూకట్‌పల్లిలో ఓ గదిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న దీప్తి.. తన బంధువులతో కలిసి శివను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు స్కెచ్ వేసింది. పక్కా సమాచారం మేరకు శివ సుష్మను ఒకే బెడ్‌రూమ్‌లో ఉండగా పట్టుకుంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు అన్యాయం చేసి శివను శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాగా, ప్రస్తుత సమాజంలో అక్రమ సంబంధాలు ఆందోళనకరమైన అశంగా మారాయి. అక్రమ సంబంధాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. భార్యాభర్తల మధ్య నమ్మకం సన్నగిల్లి, అనుమానాలు పెరిగి కాపురాలు కూలిపోతున్నాయి. పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమై మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం కోసం అక్రమ సంబంధాలను నిరోధించడం అందరి బాధ్యత. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది.

# విపక్షాల అణిచివేత

(1వపేజీ తరువాయి)సంభాషణలు కొనసాగుతూ ఉండేవని, కానీ క్రమేణా పూర్తిగా నిశ్శబ్దంగా మారి ఎదుటివారు చెప్పేది మాత్రమే వినడం అలవాటైందని రాహుల్ వివరించారు. ఈ క్రమంలో ఒక మహిళ తనను కలిసి, తన భర్త తనను కొడుతున్నాడని, ఆ విషయం తాను తెలుసుకోవాలన్నదే ఆమె ఉద్దేశమని చెప్పిన సంఘటనను గుర్తు చేసుకున్నారు. ఆమె బాధను విన్న తర్వాత, ఆమెలో భయం పోయి ప్రశాంతత కనిపించిందని, కేవలం వినడం ద్వారానే ఎంతో మార్పు తీసుకురావచ్చని గ్రహించానని అన్నారు. ప్రజలు చెప్పేది వినడం అనేది ఎంతో ముఖ్యమని, తాము తీసుకోగల చర్యల కన్నా ఇది శక్తివంతమైనదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ప్రజల మాటలను వినడానికి సిద్ధంగా లేవని, వారికి అన్ని సమాధానాలు ముందే తెలుసని భావిస్తారని రాహుల్ విమర్శించారు. ఆధునిక కమ్యూనికేషన్ సాధనాలు ఎన్ని ఉన్నా, రాజకీయ నాయకులుగా ప్రజల గొంతును లోతుగా వినడంలో విఫలమవుతున్నామని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఖాళీని తాము భర్తీ చేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ప్రజల పట్ల 'ప్రేమ', 'ఆప్యాయత' వంటి పదాలను తాను ఎప్పుడూ బహిరంగంగా వ్యక్తం చేయలేదని రాహుల్ అంగీకరించారు. యాత్రలో ఈ పదాలను ఉపయోగించడం ప్రారంభించాక, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, వారు కూడా తన పట్ల ప్రేమను వ్యక్తం చేయడం మొదలుపెట్టారని అన్నారు.

విధానాలు, భవిష్యత్తు ప్రణాళికల ద్వారా కాకుండా, ప్రేమ, ఆప్యాయతల ద్వారా ప్రజలతో నేరుగా, తక్షణమే కనెక్ట్ అవ్వడం సాధ్యమని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. 'ద్వేషం బజారులో ప్రేమ దుకాణం' (నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కీ దుకాన్) అనే నినాదం వెనుక ఉన్న ఉద్దేశ్యం కూడా ఇదేనని, ఎంత ద్వేషం ప్రచారం చేసినా, దానికి ప్రేమ, ఆప్యాయతలతోనే అత్యంత శక్తివంతంగా బదులివ్వగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ మార్పు తన రాజకీయాలను, ప్రజలతో తన సంబంధాన్ని సులభతరం చేసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

(1వపేజీ తరువాయి)గతంలో ఉద్దానం ప్రాంతానికి ఎర్రన్నాయుడు నీళ్లు సాధించారని గుర్తుచేశారు. ఇప్పుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికాబోతోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు రావాలన్నారు. 9 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని..ఏడాదిలోగా షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో ఏపీ నుంచే 29% అని చెప్పుకొచ్చారు. మత్స్యకారుల పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని..అవకాశాలను ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. ఎచ్చెర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ఏం తక్కువ మన జిల్లాకు: రామ్మోహన్
'మా కంటే చిన్న వయస్సులో ఉన్నవారిలా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు. వేట నిషేధ భృతి పెంచుతానని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. జీవో 217 కూడా రద్దు చేసి మత్స్యకారుల హక్కులు కాపాడారు. వెనుకబడిన జిల్లా అంటూ విని విని విని బాధపడుతూ వచ్చా .. శ్రీకాకుళం సెట్ ఇవ్వాలంటే.. మన మైండ్ సెట్ మారాలి. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఒక్క పోర్ట్ లేకపోయింది. పోర్ట్‌తో పాటు ఎయిర్ పోర్ట్ కూడా నిర్మిస్తాం. కేంద్రంతో మాట్లాడి జెట్టీలు, హార్బర్‌లు నిర్మిస్తాం. ఏం తక్కవ మన జిల్లాకు. అన్ని వనరులు ఉన్నాయి. యువత ఉపయోగించుకోవాలి.. సహకారం అందిస్తాం' అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.

కాగా.. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిచనున్నారు. సముద్రంలో వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం కింద 1,29,178 కుటుంబాలకు రూ.258 కోట్ల లబ్ధి చేకూరనుంది.

## ఏపీకి భారీగా నిధుల విడుదల..!

(1వపేజీ తరువాయి)కేంద్రం నుంచి ఈ నిధులు విడుదల చేశారు. ఈ నెలలో రాష్ట్రంలో 16వ ఆర్థిక సంఘం పర్యటించి వెళ్లింది. రాష్ట్రం నుంచి తీసుకున్న ప్రతిపాదనల ప్రకారం కేంద్రానికి సిఫార్సులు చేస్తోంది. 15వ ఆర్థిక సంఘం ప్రణాళిక ప్రకారం ఈ నిధులలో 70 శాతం గ్రామ పంచాయతీలకు, 20 శాతం మండల పరిషత్‌లకు, మిగిలిన 10 శాతం జిల్లా పరిషత్‌లకు కేటాయించబడతాయి. జనాభా కొలమానాల ఆధారంగా ఆర్థిక శాఖ ఆమోదం పొందిన తర్వాత, పంచాయతీరాజ్ శాఖ నేరుగా గ్రామ పంచాయతీల సంబంధిత బ్యాంకు ఖాతాలలో నిధులను జమ చేస్తుంది. దీంతో ఆ మేరకు గ్రామ స్థానిక సంస్థలకు ఆర్థిక వెసులుబాటు లభించబోతోంది. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక గతంలో పెండింగ్ లో పెట్టిన పలు బకాయిలను కేంద్రం విడుదల చేస్తోంది. అలాగే పెండింగ్ ప్రాజెక్టులకూ మోక్షం కల్పిస్తోంది. తద్వారా కూటమి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మోడీ చూసుకుంటున్నారు. ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు సమర్పిస్తున్న ప్రతిపాదనల మేరకు ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఇరాన్‌లో అత్యంత భారీ పేలుడు

(1వపేజీ తరువాయి)దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. నల్లటి పొగ కొన్ని వందల మీటర్ల వరకు కప్పేసింది.

**నాలుగైదు కిలోమీటర్ల వరకు శబ్దం**

పోర్టులో సంభవించిన పేలుడు తీవ్రత ఊహించిన దాని కంటే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి. సంఘటన జరిగిన సమయంలో 400 కంటే ఎక్కువ మంది పోర్టులో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అగ్ని మాపక దళాలు రంగంలోకి దిగి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. నాలుగు అత్యవసర రెస్పాన్స్ టీములు కూడా అక్కడికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఇరాన్‌లో ఉన్న అత్యంత ఆధునికమైన పోర్టు ఇది. అలాంటి పోర్టులో ఈ సంఘటన జరగటం గమనార్హం.

## సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్



(1వపేజీ తరువాయి)సభ్యుడు విజయసాయి రెడ్డి ఇటీవలే- విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిట్ విచారణకు హాజరయ్యారు. వివరాలను అందించారు. దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు.

## కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు

(1వపేజీ తరువాయి)సోదాలు నిర్వహించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతుల, రుణాల అంశంలో కీలకంగా వ్యవహరించిన హరిరామ్, కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఎండీగా ఉన్నారు. హరీరామ్ బంధువుల ఇళ్లపై కొత్తగూడెం, హైదరాబాద్ సహా మొత్తం 15 చోట్ల ఏసీబీ దాడులు నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ లోని పుట్టపర్తి లో సైతం శనివారం ఏసీబీ దాడి జరిగింది.

## పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

(1వపేజీ తరువాయి)ఉన్నారు. రాష్ట్రపతి పర్యటన గురించి వివరిస్తూ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ (ట్విట్టర్)లో ఫోటోలను పంచుకుంటూ, "రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికాలో పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పించారు" అని రాశారు. రాష్ట్రపతి ముర్ముతో పాటు మంత్రి కిరెన్ రిజిజు, సహాయ మంత్రి జార్జ్ కురియన్ కూడా నివాళులర్పించడానికి చేరుకున్నారు. రాష్ట్రపతి ముర్ము శుక్రవారం రోమ్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలలో పాల్గొన్నారు. నివాళులర్పించిన తర్వాత, కార్డినల్ కెవిన్ ఫారెల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని ఉంచిన శవపేటికను మూసివేశారు. ఆయన ముఖాన్ని ఆయన దీర్ఘకాలపు వేడుకల నిర్వాహకుడు ఆర్చ్ బిషప్ డియెగో రావెల్లి కప్పారు. ఈ సమయంలో కార్డినల్ కెవిన్ ఫారెల్ మృతదేహంపై పవిత్ర జలం చల్లారు. పోప్ అంత్యక్రియలు నేడు (ఏప్రిల్ 26) జరుగుతాయి. ఈ అంత్యక్రియలకు ప్రపంచవ్యాప్తంగా నాయకులు, సాధారణ ప్రజలు హాజరవుతారు. ఈ ప్రముఖులు హాజరు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్, అతని భార్య మెలానియా, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, జర్మన్ అధ్యక్షుడు ఫ్రాంక్, ప్రస్తుత ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్, రష్యా సాంస్కృతిక మంత్రి ఓల్గా ల్యాబిమోవా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, అతని భార్య ఒలెనా జెలెన్స్కా వంటి ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ నాయకులు పోప్ అంత్యక్రియలకు హాజరవుతారు. పోప్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. న్యుమోనియా ఫిర్యాదుతో ఫ్రాన్సిస్ గతంలో ఆసుపత్రిలో చేరారు. అక్కడ నుండి డిశ్చార్జ్ అయిన దాదాపు ఒక నెల తర్వాత ఆయన మరణించారు.

## భారీ అగ్ని ప్రమాదం

(1వపేజీ తరువాయి)సిబ్బందిని అలర్ట్ చేసి 5 ఫైర్ ఇంజిన్లను పంపించామన్నా. సుమారుగా 300 నుంచి 400 వరకు గుడిసెలు దగ్ధమైనట్లు తెలిపారాయన. ఇప్పటి వరకు దాదాపుగా మంటలు అదుపులోకి వచ్చాయని.. మరో 2 ఫైరింజన్లు వస్తున్నాయని ఫైర్ ఆఫీసర్ కేశవులు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కుంట్లూరు రెవెన్యూ పరిధిలో రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని సమాచారం వచ్చింది. తాము కూడా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాము. ఎన్ని గుడిసెలు తగలబడ్డాయి, ఎంత ఆస్తి నష్టం జరిగిందనేది అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. ప్రమాదానికి గల కారణాలు పోలీసులను అడిగి తెలుసుకుని నివేదిక ఇస్తాము అని తెలిపారు.

ప్రత్యక్ష సాక్షి సైదులు మాట్లాడుతూ.. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఒక గుడిసెలో మొదటగా మంటలు చెలరేగాయి. దాని నుండి పక్కనున్న గుడిసెలకు కూడా వ్యాప్తి చెందాయి. సుమారుగా 400 గుడిసెలు తగలబడిపోయాయి. మొదటగా తగలబడిన గుడిసెలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గుడిసెలో దేవుడి పూజ కోసం దీపం మంటలు అంటుకోవడంతో ఘటన జరిగినట్టు అనుకుంటున్నాము. వెనకాల పక్కన ఉన్న గుడిసెలోని సిలిండర్లు పేలడంతో ప్రమాదం పెద్దదయింది.

## వైసీపీ మాజీ ఎంపీకి బిగ్‌షాక్!

(1వపేజీ తరువాయి)పెంచాలని రేణుక ప్రతిపాదించారు. అందుకు కూడా హెచ్ఎఫ్ఎల్ ఆమోదం తెలుపలేదు. ఈ నేపథ్యంలో వాయిదాల చెల్లింపు నిలిచిపోవడంతో ఎన్‌సీఎల్‌టీని హెచ్ఎఫ్ఎల్ ఆశ్రయించింది. గతంలో రెండుసార్లు వేలం.. ప్రస్తుతం ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. లోన్ నిబంధనలకు అనుగుణంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని 5 వేల గజాల ఆస్తిని రూ.145 కోట్లకు వేలం వేశారు. కానీ ఎవరూ ముందుకు వచ్చి వేలంలో పాల్గొనలేదు. అలానే మాదాపూర్‌లోని 7,205 చదరపు గజాల్లో ఉన్న బుట్టా కన్వెన్షన్ కూడా వేలం వేయగా అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురైంది. దీంతో అధికారులు మరోమారు ఆస్తులను వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## యుద్ధానికి ముగింపు?

(1వపేజీ తరువాయి)ఫ్రెంచ్ అక్షర క్రమంలో సీటింగ్ ఏర్పాటు చేశారని, అంతకు మించి వేరే కారణం లేదని వివరణ ఇచ్చారు. ఈ భేటీ ఒకవైపు కొనసాగుతుండగానే, ట్రంప్ శుక్రవారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా, క్రిమియా రష్యాతోనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఒబామా హయాంలోనే సబ్‌మెరైన్లను రష్యా అక్కడ మోహరించిందని గుర్తు చేశారు. జెలెన్‌స్కీతో సహా ప్రతి ఒక్కరూ ఈ వాస్తవాన్ని త్వరలో అర్థం చేసుకుంటారని తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చలను అడ్డుకుంటూ, జెలెన్‌స్కీ యుద్ధాన్ని పొడిగిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న భీకర దాడులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సరైన సమయం కాదని, వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ వాతావరణానికి చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

## హైదరాబాద్ విడిచి వెళ్లాల్సిందే.. పాకిస్థానీలకు నోటీసులు

**హైదరాబాద్-నవభూమి:** నగరంలో ఉన్న నలుగురు పాకిస్థానీలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. రేపటి (ఆదివారం)లోగా హైదరాబాద్‌ను విడిచి వెళ్లాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఈ నలుగురు షార్ట్ టర్మ్ వీసా (ఎస్‌టీవీ) హోల్డర్స్‌గా ఉన్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్‌లో కలిపి మొత్తం 213 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసా మినహాయిస్తే మిగతా అందరికీ లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నట్టు తెలుస్తోంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన పాకిస్తానీలకు కేంద్రం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో షార్ట్ టర్మ్ వీసా కలిగిన నలుగురు పాకిస్థానీలకు హైదరాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. తాము ఇచ్చిన గడువులోపు దేశం విడిచి వెళ్లకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో తెలంగాణ పోలీసు శాఖ స్పష్టంగా పేరింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



హైదరాబాద్
ఆదివారం
27 । ఏప్రిల్ । 2025




## ఉగ్రవాదులు భయపెట్టినా వెనక్కి తగ్గలేదు.. దాల్ సరస్సులో షికారా ప్రయాణం..


**న్యూఢిల్లీ-నవభూమి:** వేసవిలో కాశ్మీరీ అందాలను ఆస్వాదించేందుకు వెళ్లిన 26 మంది పర్యాటకులను ఘోరాతి ఘోరంగా కాల్చి చంపి రక్తపాతం సృష్టించిన ఉగ్రదాడి ఘటన ఇంకా దేశ ప్రజల గుండెల్లో మంటలు రేపుతూనే ఉంది. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లాలని సిద్ధమవుతున్న భక్తులను ఈ ఘటన నిలు వెల్లా వణికిస్తుంటే.. పర్యాటకుల్లో ధైర్యం నింపేందుకు ఓ మహిళా టూరిస్ట్ చేసిన ప్రయత్నం అందరినీ ఆకర్షిస్తోంది. మీ బెదిరింపులకు మేం బెదరం.. ఇది మా దేశం.. అని చాటి చెప్తూ.. దాల్ సరస్సులో షికారా రైడ్ చేసి అందుకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.బెంగళూరుకు చెందిన ఇంటీరియర్ డిజైనర్ వినీతా చైతన్య పహల్గాం దాడి జరిగి కొన్ని రోజులు కూడా గడవకముందే ఓ సాహసం చేసింది. అందరూ ఈ విషాదాన్ని ఇంకా తేరుకోకముందే పర్యాటకుల్లో ధైర్యం నింపేలా దాల్ సరస్సులో షికారా రైడ్ చేసింది. 'సోల్‌ఫుల్ షికారా రైడ్' అనే ట్యాగ్ తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వీడియోను షేర్ చేసింది. ఈ పోస్ట్ లో "మేము శ్రీనగర్‌లో దిగడానికి ముందే ఈ షికారా రైడ్‌ను బుక్ చేసుకున్నాము. గత రెండు రోజులుగా ఇక్కడి వాతావరణం హృదయవిదారకంగా ఉంది. ప్రజలు అశాంతి, నిరాశ నిస్పృహల్లో మునిగిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నేను షికారాను రద్దు చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. నిన్న మధ్యాహ్నం స్థానిక డ్రైవర్‌తో కలిసి డ్రైవ్‌కి వెళ్ళాము. అక్కడ కేవలం రెండు పర్యాటక పడవలు మాత్రమే ఉన్నాయి. మమ్మల్ని చూసి రకరకాల వస్తువులు అమ్మేవాళ్లు చాలామంది అక్కడికి క్యూ కట్టారు. అందమైన పూలపడవల్లో సూర్యోదయాన్ని ఆస్వాదిస్తూ పూలు,కహావా టీ, ఇలా అనేక వస్తువులు కొనుక్కున్నాం. మా వల్ల వారి ముఖాల్లో చిరునవ్వు కనిపించడం ఆనందాన్ని కలిగిస్తోంది"

## 1000 కోట్ల భూ కుంభకోణం.. ప్రాపర్టీ డాక్యుమెంట్లు సీజ్ చేసిన ఈడీ



**న్యూఢిల్లీ-నవభూమి:** గోవాలో భారీ భూ కుంభకోణం బయటపడింది. సుమారు వెయ్యి కోట్ల విలువైన ల్యాండ్ స్కామ్‌ను గుర్తించారు. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇవాళ పలు ప్రదే శాల్లో సోదాలు నిర్వహించింది. గురు, శుక్రవారాల్లో తనిఖీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా సోదాలు చేపట్టారు. రోహన్ హర్‌మాల్కర్ ఈ భూ కుంభకోణంలో కీలక సూత్రధారి అని తేలింది. వెయ్యి కోట్ల మేర విలువైన ప్రాపర్టీ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రోహన్ హర్‌మాల్కర్ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేవారు. బీజేపీ టికెట్ నిరాకరించడంతో అతను ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచాడు. భూ కుంభకోణం వెనుక అతనే మాస్టర్‌మైండ్ అన్న ఆరోపణలు వస్తున్నాయి. నిజమైన హక్కుదారులకు చెందిన భూమిని అక్రమ రీతిలో, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెవన్యూ రికార్డులను కూడా తారుమారు చేసినట్లు రోహన్‌పై కేసు బుక్కైంది. వ్యక్తిగత, ఫ్యామిలీ ఎస్టేట్‌లకు చెందిన భూముల్ని.. అక్రమ రీతిలో అమ్మేసి.. తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.అక్రమ భూ మార్పిడి కేసులను పరిష్కరించేందుకు గోవా సర్కారు 2022 జూన్ 15వ తేదీన సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో భూమి ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 100కుపైగా ఉన్న ప్రాపర్టీలకు చెందిన 44 ఎఫ్ఐఆర్‌లను సిట్ విచారించింది. పురావాస్తు శాఖకు చెందిన అధికారుల్ని ఈ కేసులో అరెస్టు చేసింది. ల్యాండ్ గ్రాబింగ్ కేసుల్ని విచారించేందుకు బాంబే హైకోర్టు మాజీ జస్టిస్ వీకే జాదవ్ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## ఆర్మీకి ఉగ్రవాదుల బాంబ్ ట్రాప్.. తృటిలో తప్పిన ప్రమాదం..



**జమ్ము కశ్మీర్:నవభూమి:** జమ్మూ కాశ్మీర్‌లోని బందీపొరా జిల్లాలో శుక్రవారం ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పులు ఎన్‌కౌంటర్‌కు దారి తీశాయి. కుల్నార్ బాజిపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ సమయంలోనే ఆ ప్రాంతంలో నక్కి ఉన్న ఉగ్రవాదులు భద్రతా దళాలను చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. దీంతో సైనికులు అంతే ధీటుగా ప్రతీకార చర్యకు దిగారు. ఇరువర్గాల నడుమ పెద్ద ఎత్తున కాల్పులు జరిగాయి. ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని భారత ఆర్మీ అధికారులు తెలిపారు.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. బిజ్‌బెహరా, త్రాల్ ప్రాంతాల్లో సైనికులు కూంబింగ్ నిర్వహించారు. బైసరన్ నరమేధంలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న ఉగ్రవాదుల జాడను కనుగొనేందుకు సోదాలు చేపట్టారు. కానీ, ఈ విషయం తమకు ముందే తెలుసన్నట్లు ఆర్మీకి రివర్స్ స్కెచ్ వేశారు టెర్రరిస్టులు. వారి ఇళ్లను వెతుక్కుంటూ వెళ్లిన సైనికులను బాంబుల ఉచ్చులో దింపేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, అనుమానస్పదంగా అనిపించి ముందే సురక్షిత ప్రాంతానికి చేరుకోవడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు మన జవాన్లు.పుల్వామా జిల్లాలోని మోంఘమా ప్రాంతంలోని ఆసిఫ్ ఇంట్లో, బిజ్‌బెహారాలోని అదిల్ థోకర్ అలియాస్ అదిల్ గురి ఇంట్లో బాంబు పేలుళ్లు సంభవించాయి . బైసరన్ లోయ మారణకాండకు వీరే సూత్రధారులని నిఘా వర్గాలు చెబుతున్నాయి. లష్కరే తోయిబా స్థానిక కమాండర్ గా ఆసిఫ్ షేక్ పనిచేస్తుండగా.. లష్కరే తోయిబాకే చెందిన ఆదిల్ థోకర్ 2018లో చట్టబద్ధంగా పాకిస్తాన్‌కు వెళ్లి ఉగ్రవాద శిక్షణ పొందాడు. గతేడాదే స్వగ్రామానికి తిరిగి వచ్చి దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. చాలాకాలం నుంచే ఆదిల్ నిఘా సంస్థల రాడార్‌లో ఉన్నాడని అధికారులు చెబుతున్నారు.

## దూకుడుగా ఆపరేషన్ కగార్.. మరో రెండు రోజుల్లో

**ఛత్తీస్‌గఢ్-నవభూమి:** తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. మావోయిస్ట్ గెరిల్లా సుప్రీం కమాండర్ హిడ్మా టార్గెట్‌గా సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. కర్రెగుట్టల్లో బంకర్‌లో సాయుధదళంతో హిడ్మా ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం. హిడ్మా వేటలో నాలుగు హెలికాప్టర్లు, 20 మానవ రహిత వైమానిక వాహనాలు, యూఏవీలు, రెండు డ్రోన్ స్క్వాడ్రన్‌లు, ఎన్‌టీఆర్‌వో శాటిలైట్ చిత్రాలు, మ్యాప్స్‌తో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాయపూర్ జగదల్‌పూర్ నుంచి ఈ ఆపరేషన్‌ను సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జీపీ సింగ్ పర్యవేక్షిస్తుండగా... వార్‌జోన్‌లో బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మానిటర్ చేస్తున్నారు.గత ఐదు రోజులుగా కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న భద్రతా బలగాలు దాదాపు ఐదారు కిలోమీటర్ల మేర లోపలకు చొచ్చుకుని వెళ్లి మరీ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపిస్తూ భద్రతాబలగాలు దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు (శనివారం) కర్రెగుట్టల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 38 మంది మావోయిస్టుల చనిపోయినట్లు సమాచారం. అయితే దీన్ని అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అధునాతమైన డ్రోన్ల ద్వారా మావోయిస్టుల కదలికలను గుర్తించారు భద్రతాబలగాలు. మావోయిస్టుల కదలికలపై ఫిబ్రవరిలో తీసిన డ్రోన్ విజువల్స్‌ను బయటకు వచ్చాయి. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఎక్కుతున్న డ్రోన్ దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు. దీంతో మావోయిస్టులు పెద్దఎత్తున కర్రెగట్టల్లో తలదాచుకున్నట్లు ఈ డ్రోన్ దృశ్యాల ద్వారా స్పష్టమవుతోంది. భారీ ఎత్తున బంకర్లను ఏర్పాటు చేసుకుని అందులోనే మావోయిస్టు రాష్ట్ర ఇన్‌చార్జ్ దామోదర్, హిడ్మా సహా తెలంగాణ క్యాడర్ అంతా కూడా కర్రెగుట్టల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది.అయితే కర్రెగుట్టలు ఆపరేషన్‌ను నిలిపివేయాలని గత పదిరోజులుగా పౌరహక్కు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా మావోయిస్టు పార్టీ నుంచి కూడా మూడు సార్లు లేఖలు విడుదలయ్యాయి. శాంతి చర్చలకు సిద్ధమంటూ లేఖలు విడుదల చేశారు. దీంతో శాంతిచర్చలకు కేంద్రం ముందుకు రావాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు. అయితే వీరి డిమాండ్లను పట్టించుకోకుండా భద్రతా బలగాలు ముందుకు దూసుకెళ్తున్నాయి. మావోయిస్టులను తుదముట్టించేందుకు పూర్తిస్థాయిలో భద్రతా బలగాలు కర్రెగట్టల్లో సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఆదివాసీ గూడాల్లో కూడా బాంబుల శబ్దాలు వినిపిస్తున్నాయంటూ అక్కడి ప్రజలు అడవులను విడిచి భయటకు వస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో ఆదివాసీలు కూడా ప్రాణాలు కోల్పోతున్నట్లు సమాచారం.

## వీసాల విషయంలో వెనక్కి తగ్గిన ట్రంప్.. అమెరికాలోని విదేశీ విద్యార్థులకు బిగ్ రిలీఫ్



**వాషింగ్టన్-నవభూమి:** ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు వెళ్లిన వందల మంది విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఫారిన్ స్టూడెంట్‌లకు వీసాలు, చట్టబద్ధ హోదాను రద్దు చేస్తూ ఇటీవల డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై తాజాగా వెనక్కి తగ్గింది. ఈ నేపథ్యంలోనే దాదాపు 1200 మంది స్టూడెంట్స్ లీగల్ స్టేటస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వ లాయర్ తాజాగా కోర్టుకు వెల్లడించారు. దీంతో ఆ 1200 మంది విద్యార్థులు బహిష్కరణ, నిర్బంధం ముప్పు నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు.

అమెరికాలో అధ్యక్ష పదవిలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్.. అంతకుముందు వివిధ కారణాలతో 187 కళాశాలలకు చెందిన 1200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసాలను, వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురైన వందల మంది విదేశీ విద్యార్థులు న్యాయపోరాటం చేశారు. కాలిఫోర్నియా, బోస్టన్‌లోని కోర్టుల్లో ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలోనే వారి పిటిషన్లను స్వీకరించి.. విచారణ జరిపిన ఆయా కోర్టులు.. విదేశీ విద్యార్థుల వీసా రద్దును నిలిపివేయాలని ట్రంప్ సర్కార్‌కు ఆదేశాలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ).. ఆ 1200 మంది విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. సాధారణంగా వీసా లేదా చట్టబద్ధ హోదా రద్దు అయినప్పుడు.. విదేశీ విద్యార్థుల వివరాలు ఉండే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (ఎస్ఈవీఐఎస్) డేటాబేస్ నుంచి ఆయా స్టూడెంట్స్ రికార్డులను తొలగిస్తారు. అయితే ఈ రికార్డుల టెర్మినేషన్‌కు సంబంధించి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కొత్త విధానం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు తొలగించిన విద్యార్థుల రికార్డులన్నింటినీ తిరిగి యాక్టివేట్ చేస్తున్నట్లు ప్రభుత్వ లాయర్ కోర్టుకు తెలిపారు.ఇక ఈ వీసాలు రద్దయిన 1200 మంది విదేశీ విద్యార్థుల్లో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారని తెలుస్తోంది. ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చిన్న కారణాలతో కూడా ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తొలగించారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ కోర్టులో ఆరోపించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ట్రంప్ తీసుకున్న తాజా పరిణామంతో అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ట్రంప్ ప్రభుత్వం కొత్తగా ఏం విధానం తీసుకు వస్తుందో వేచి చూడాలి. అయితే వీసాలు, లీగల్ స్టేటస్ రద్దు చేయడంతో డిపోర్టేషన్ లేదా నిర్బంధం ముప్పు ఉంటుందని భావించిన ఆ విద్యార్థులంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వారిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. మరికొందరు కాలేజీల్లో క్లాసులకు కూడా వెళ్లడం లేదు.

## 26 మందిని చంపింది మేము కాదు



**జమ్ము కశ్మీర్:నవభూమి:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘనటలో మొత్తంగా 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెంతో మంది గాయపడ్డారు. ఈ దాడికి కారణం పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులేనని భారత బలగాలు ఇప్పటికే గుర్తించగా.. అది నిజమేనంటూ ఉగ్రసంస్థ "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" సంచలన ప్రకటన చేసింది. పహల్గాం ఉగ్రదాడికి తామే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు వివరించింది. అయితే తాజాగా మరో పోస్ట్ చేస్తూ.. కొన్ని గంటల్లోనే మాట మార్చింది. తమకు ఈ దాడితో ఎలాంటి సంబంధమూ లేదని తేల్చి చెప్పింది. ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తులు ధరించి వచ్చిన ముష్కరులు పర్యటకులపై కాల్పులకు తెగబడ్డారు. మొత్తంగా 26 మంది ప్రాణాలు తీశారు. ఈ ఘటనలో మరెంతో మంది గాయపడగా.. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అయితే పర్యటకుల సాయంతో ఉగ్రవాదుల ఊహా చిత్రాలు గీయించిన భద్రతా బలగాలు వాటిని ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా విడుదల చేశాయి. అలాగే వీరికి లష్కరే తోయిబాతో సంబంధం ఉందని కూడా గుర్తించారు. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.ఓవైపు పాక్ ఈ దాడితో తమకు సంబంధం లేదని చెబుతూనే.. ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా అభివర్ణించింది. అమెరికా కోసమే తాము 30 ఏళ్లుగా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నామని కూడా పేర్కొంది. దీంతో ఆ దేశంపై పగ తీర్చుకునేందుకు భారత్ అనేక చర్యలు చేపట్టింది. ఇలాంటి ఉద్రిక్త సమయంలోనే పాకిస్థాన్ కేంద్రంగా పని చేసే నిషేధిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" తామే పహల్గాంలో దాడికి పాల్పడ్డామని ప్రకటించింది. అయితే ఈ పోస్టు చేసిన కొద్ది గంటల్లోనే మళ్లీ ఆర్టీఎఫ్ మాట మార్చింది. పహల్గాం దాడికి తమకు ఏ సంబంధం లేదని తేల్చి చెప్పింది.అసలు ఆ 26 మందిని చంపింది మేము కాదని తాజాగా మరో పోస్ట్ పెడుతూ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగానే భారత్‌ను బాధ్యురాలిని చేస్తూ తీవ్ర ఆరోపణలు చేసింది. భారత బలగాలే తమ వ్యవస్థల్ని హ్యాక్ చేసి.. తాము ప్రకటించిన విధంగా ఓ పోస్టు పెట్టాయని పేర్కొంది. ఇంతకు ముందు వచ్చిన ప్రకటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చింది. ఇది కచ్చితంగా భారత సైబర్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పనేనని.. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని స్పష్టం చేసింది. అంతేకాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇలా చేయడం ఇదే తొలిసారి కాదని వ్యాఖ్యానించింది.

## ఫారిన్ స్టూడెంట్‌కి చేదు అనుభవం..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో మహిళలపై అఘాయిత్యాల కట్టడికి ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా మృగాళ్లలో మార్పు రావడం లేదు. కొంచెం కూడా భయం లేకుండా.. నడిరోడ్డు మీద పట్టపగలు రెచ్చి పోతూ.. చిత్త కార్తె కుక్కల్లాగా ప్రవర్తిస్తున్నారు కొందరు కామాంధులు. పసివాళ్లు, ముసలివాళ్లు, విదేశీయులు అనే తేడా లేకుండా.. కామంతో కళ్లు మూసుకుపోయి ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఈ కోవకు చెందిన సంఘటన ఒకటి వెలుగు చూసింది. విదేశీ విద్యార్థిని ఒకరికి చేదు అనుభవం ఎదురయ్యింది. ఆటో డ్రైవర్ ఆమెను బెదిరించడమే కాక.. అత్యాచారం చేస్తానంటూ వార్నింగ్ కూడా ఇచ్చాడు. అది కూడా ఉదయం ఆరు గంటల ప్రాంతంలో.. నడి రోడ్డు మీద ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం. తనకు ఎదురైన భయానక అనుభవం గురించి సదరు విద్యార్థిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. చెన్నై సురక్షితమైన నగరం కాదని చెప్పుకొచ్చింది. ఆ వివరాలు..ఈ సంఘటన తమిళనాడు తిరువాన్మియూర్ బీచ్ వద్ద నేడు శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో.. ఉదయం పూట నడి రోడ్డు మీద ఓ ఆటోడ్రైవర్ విదేశీ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతేకాక ఆమెని నానా తిట్లు తిడుతూ.. అత్యాచారం చేస్తానంటూ బెదిరించాడు. ఈ మొత్తం తతంగాన్ని వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో ఇప్పుడిది వైరల్ అవుతోంది.సదరు విద్యార్థిని మాట్లాడుతూ.. ఇది ఫుల్ వీడియో కాదు.. ఈ సంఘటన చివర్లో తీసిన వీడియో.నేను విదేశీ విద్యార్థినిని. ఇక్కడ చదువుకుని.. కొత్త సంస్కృతిని నేర్చుకోవడం కోసం నన్ను ఇక్కడకు ఆహ్వానించారు. అంతేతప్ప నేను ఇక్కడకు అవమానాలు పొందడానికి, భయపడటానికి, నా జీవితాన్ని రోడ్డ మీద ముగించడానికి రాలేదు. కోసం రాలేదు. శనివారం ఉదయం నేను, నా స్నేహితురాలు తిరువాన్మియూర్ బీచ్ దగ్గర ఆటో ఎక్కడం కోసం వచ్చాము. ఉదయం సమయం కావడంతో.. మార్నింగ్ వాక్‌కి వచ్చిన వాళ్లతో ఆ ప్రదేశం రద్దీగా ఉంది. ఒక ఆటో అతడి దగ్గరికి వెళ్లి మేం వెళ్లాల్సిన ప్రదేశం గురించి అడిగి.. ఆటో అతడిని రమ్మని కోరాము. అయితే అతడి ఆటోకి కనీసం నంబర్ ప్లేట్ కూడా కాలేదు. పైగా అతడు మాపట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. అన్యాయాన్నిప్రశ్నించినందుకు గాను అతడు మమ్మల్ని రేప్ చేస్తానంటూ బెదిరించాడు. నా ఒంటి మీద బట్టలు చించుతానని భయపెట్టాడు. అంత అన్యాయం జరుగుతుంటే రోడ్డు మీద వెళ్తున్న వాళ్లు ఒక్కరు కూడా వచ్చి మాకు సాయం చేయలేదు. నేను చెన్నై వచ్చే ముందు ఈ నగరం గురించి చాలా గొప్పగా విన్నాను. కానీ ఇక్కడకు వచ్చాక నాకు అలా అనిపించలేదు. చెన్నై మహిళలకకు సురక్షితమైన నగరం కాదు. ఇది ఎలాంటి నగరం.. ఇక్కడ మహిళలకు అన్యాయం జరుగుతుంటే.. కళ్లు మూసుకుని వెళ్లిపోతారు.. కనీసం ఆటోలకు నంబర్ ప్లేట్ కూడా లేదు. మమ్మల్ని ఇక్కడకు ఆహ్వానించిన వాళ్లకు మా రక్షణ గురించి ఎలాంటి బాధ్యత లేదా.. నేను చాలా భయపడ్డాను.. నాకు చాలా కోపం వస్తుంది.. అంటూ తన ఆవేదనను వ్యక్తం చేసింది. సదరు ఆటో డ్రైవర్‌పై విమర్శలు చేస్తున్నారు నెటిజనులు.

## మీడియా ముందుకు ఉగ్రవాది ఆసిఫ్ ఫౌజీ సోదరి




**జమ్ము కశ్మీర్:నవభూమి:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీ రోజు ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ మారణహోమానికి పాల్పడ్డ ముష్కరుల ఊహా చిత్రాలను ఇప్పటికే భారత భద్రతా బలగాలు విడుదల చేశాయి. అయితే అందులో ఒకరైన ఉగ్రవాది ఆసిఫ్ ఫౌజీని.. అతడి సోదరి గుర్తించింది. అతడి అసలు పేరుతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించింది. దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే తాను పుట్టింటికి వెళ్లానని.. కానీ అప్పటికే తన చెల్లెల్లు, తల్లిదండ్రులు ఇళ్లు విడిచి పారిపోయారని పేర్కొంది. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులపై కాల్పులు జరిపారు. హిందువా, ముస్లిమా అని అడుగుతూ మరీ కేవలం పురుషులపైనే కాల్పులకు తెగబడ్డారు. ఆపై స్థానికంగా ఉన్న అడవుల్లోకి పారిపోయారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. అయితే పర్యటకుల సాయంతో పోలీసులు, భద్రతా బలగాలు ఉగ్రవాదుల ఊహా చిత్రాలను గీయించారు. ఆపై వాటిని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తూ.. వారి పేర్లు ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించి వివరించారు.ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు కనిపించినా తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాదండోయ్.. ఊహాచిత్రాల్లో ఉన్న ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒక్కొక్కరి తలపై రూ.20 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. అయితే తాజాగా ఆ ఊహా చిత్రాల్లో ఆసిఫ్ ఫౌజీగా పేర్కొంటున్న వ్యక్తి తన సోదరుడే అంటూ ఓ మహిళ మీడియా ముందుకు వచ్చింది. అతడి అసలు పేరు ముజాహుద్దీన్ అని తెలిపింది. దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌లో ఉన్న తమ ఇళ్లు పేల్చి వేయడంతో.. ప్రస్తుతం బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నట్లు వెల్లడించింది. పహల్గాం ఘటన జరిగినప్పుడు తాను అత్తగారింట్లో ఉన్నట్లు పేర్కొంది. అయితే ఉగ్రదాడిలో తన సోదరుడి హస్తం ఉందని తెలిసిన వెంటనే పుట్టింటికి వచ్చానని వివరించింది.కానీ అప్పటికే తన తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లు కనిపించకుండా పోయారని సదరు మహిళ వెల్లడించింది. భద్రతా దళాలే వారిని అదుపులోకి తీసుకుని ఉంటాయని అనుమానం వ్యక్తం చేసింది. తనకు ఇద్దరు సోదరులు కాగా.. ఇప్పటికే ఒకరు జైల్లో ఉన్నారని, ఇంట్లో ఉన్న సోదరుడు ఇంత దారుణానికి ఒడిగట్టాడంటే తానింకా నమ్మలేకపోతున్నానని చెప్పుకొచ్చింది. తనకు, తన కుటుంబ సభ్యులకు అసలు ఈ దాడి గురించి ఏమాత్రం తెలియదని స్పష్టం చేసింది. మరో ఇద్దరు ఉగ్రవాదుల కుటుంబాలను కూడా పోలీసులు కలిసి ప్రశ్నించగా.. ఈ దాడి గురించి తమకు ఏమాత్రం తెలియదని చెప్పినట్లు సమాచారం.

## తాజ్‌మహల్ ముందు జేడీ వాన్స్ ఫ్యామిలీ.. ఫొటోలపై ఎలాన్ మస్క్ ఆసక్తికర కామెంట్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ పర్యటనలో భాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫ్యామిలీ ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. వాన్స్ ఫ్యామిలీకి ఉత్తరప్రదేశ్ సీఎం ఆదిత్యనాథ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య జేడీ వాన్స్ తన ఫ్యామిలీతో తాజ్ మహల్ అందాలను వీక్షించి, ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ ఫొటోలను వాన్స్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ%లో షేర్ చేస్తూ.. తాజ్‌మహల్‌ను ఒక అందమైన చారిత్రాత్మక ప్రదేశంగా అభివర్ణించారు. అయితే ఈ ఫొటోలపై టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ నుంచి స్పందన వచ్చింది..

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉష, ముగ్గురు పిల్లలతో కలిసి తాజ్‌మహల్ వద్ద ఆహ్లాదంగా గడిపారు. పర్యటన అనంతరం ఆ ఫొటోలను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ.. "ఈ రోజు ఉష, పిల్లలతో కలిసి తాజ్‌మహల్ సందర్శించాను. ఇది ఒక అద్భుతమైన చారిత్రక ప్రదేశం. అక్కడ మాకు లభించిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞతలు" అంటూ వాన్స్ తన సంతోషాన్ని తెలియజేశారు. అయితే ఈ పోస్టుపై టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ స్పందించారు. "ప్రపంచంలోని అత్యంత అందమైన అద్భుతాల్లో ఇది ఒకటి".. అంటూ బదులిచ్చారు.జేడీ వాన్స్ కుటుంబం ఆగ్రా విమానాశ్రయం నుంచి తాజ్‌మహల్ వరకూ కారులో వెళ్లారు. వీరి కాన్వాయ్ వెళ్లే మార్గంలో వందలాది పిల్లలు నిలబడి అమెరికా, భారత్ జాతీయ పతాకాలను ఎగురువేస్తూ స్వాగతం పలికారు. సుమారు గంటపాటు తాజ్‌మహల్‌ను వీక్షించిన వాన్స్ కుటుంబం.. అక్కడి అందమైన ప్రదేశాల్లో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా తాజ్‌మహల్‌లోని విజిటర్స్ డైరీలో జేడీ వాన్స్ తన అభిప్రాయాన్ని రాశారు. తాజ్‌మహల్‌ను అద్భుతం అంటూ అభివర్ణించిన ఆయన.. "నిజమైన ప్రేమకు, మానవ మేధస్సుకు ఇది ఓ నిదర్శనం".. అంటూ కొనియాడారు. కాగా, ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## పెళ్లై సంవత్సరం కూడా కాలేదు.. అంతలోనే విషాదం..



**కర్ణాటక-నవభూమి:** శాస్త్ర సాంకేతికత పరంగా మనుషులు ఎంత అభివృద్ధి చెందుతున్నా.. ఆడవాళ్ల విషయంలో మాత్రం ఇంకా దారుణంగానే వ్యవహరిస్తు న్నారు. మరీ ముఖ్యంగా అత్తింట్లో అడుగుపెట్టిన అమ్మాయిలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదో ఒక విధంగా అత్తింటి వారు కోడళ్లను వేపుకుతింటున్నారు. అన్ని కుటుంబాల విషయంలో కాకపోయినా.. నూటికి 70 శాతం కేసుల్లో ఇదే జరుగుతోంది. తాజాగా, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు అత్తింటి వేధింపులు వివరిస్తూ ఓ సూసైడ్ నోట్ రాసింది. ఆ నోట్‌లో భర్త మంచి వాడని కూడా పేర్కొంది. పెళ్లై సంవత్సరం కాకుండానే ఆ యువతి జీవితం ముగిసిపోయింది.కర్ణాటకలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కర్ణాటక, కోలార్ జిల్లాలోని కడిదెనహళ్లి గ్రామానికి చెందిన దినేష్ అనే వ్యక్తి ఓ ఫినాన్స్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. అదే కంపెనీలో పని చేసే రష్మితో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. పెద్దల్ని ఒప్పించి గత సంవత్సరం పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన కొంత కాలం అత్తింటి వారు రష్మితో బాగానే ఉన్నారు. తర్వాతి నుంచి వేధింపులు మొదలయ్యాయి. ప్రతీ విషయానికి ఆమెను టార్చర్ చేసేవారు. అదనపు కట్నం తెమ్మంటూ తిట్టే వారు.. కొట్టేవారు.అత్తింటి వారి వేధింపులు భరించలేకపోయిన రష్మి ప్రాణాలు తీసుకోవాలని భావించింది. చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాసింది. ఆ నోట్‌లో.. ' మీ అమ్మ.. బామ్మ.. నన్ను ఇబ్బందిపెట్టడం ఆపటం లేదు. నేను ఇక్కడికి వచ్చినప్పటినుంచి నాకు ప్రశాంతత లేదు. నేను వారి టార్చర్ భరించలేకపోతున్నా. నువ్వు వచ్చేసరికి నేను ప్రాణాలతో ఉండను. నువ్వు మంచి వాడివే.. కానీ, మీ ఇంట్లో వాళ్లు మంచి వాళ్లు కాదు. కట్నం తేనందుకు నన్ను కొడుతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తర్వాత ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తున్నారు. మూడు నెలల క్రితం రష్మికి గర్భ స్రావం అయింది. కట్నం తేనందుకు.. బిడ్డను కననందుకు అత్తింటి వారు వేధించినట్లు విచారణలో తేలింది.

## మనిసూరత్ కాంప్లెక్స్‌లో ఎగిసిపడుతున్న మంటలు



**భీవండీ-నవభూమి:** మహారాష్ట్రలోని భీవండిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈరోజు (శనివారం) ఉదయం మనిసూరత్ కాంప్లెక్స్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మనిసూరత్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్థులో మొదలైన మంటలు క్రమంగా పై ప్రాంతానికి వ్యాపించాయి. దీంతో అగ్నికీలలు భారీగా ఎగిసిపడ్డాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నారు. రెండు అగ్నిమాపక వాహనాలు అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేస్తున్న పరిస్థితి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అగ్నిమాపక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో చుట్టుపక్కల వాసులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అలాగే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కానీ భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాల్లో భారీగా ప్రజలు గుమిగూడగా వారిని పోలీసులు అక్కడి నుంచి తరలించేశారు. మనిసూరత్ కాంప్లెక్స్ పక్కన నివాసితులు దూరంగా ఉండగాలని.. రెస్క్యూ టీంకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



## సుప్రీంకోర్టు జోలికి రాకండి!

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, బిజెపి నాయకులు సుప్రీంకోర్టు మీద విషపూరిత దాడిని ప్రారంభించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలుపకుండా అడ్డుపడుతూ తమిళనాడు గవర్నర్ అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన పోకడల గురించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ దాడులు మొదలయ్యాయి. ఆ తర్వాత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) నాయకత్వంలోని ధర్మాసనం వక్ఫ్ చట్టానికి సంబంధించి తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఉపరాష్ట్రపతి ధన్కర్ న్యాయమూర్తులు 'ఎలాంటి జవాబుదారీతనం లేని', 'సూపర్ పార్లమెంటు'గా తయారయ్యారని ఆరోపించారు. 'వారికి ఈ దేశపు చట్టాలు వర్తించవని' వాకృచ్చారు. అంతేగాక సంపూర్ణ న్యాయం జరిపించేందుకుగాను కోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న 142 అధికరణం 'ప్రజాస్వామిక శక్తులపై అణు క్షిపణి' లాగా తయారయ్యిందని కూడా సెలవిచ్చారు. బిజెపి ఎంపి నిశికాంత్ దుబే మరింత పైత్య ప్రకోపంతో సిజెఐ సంజీవ్ ఖన్నా లక్ష్యంగా దాడి చేశారు. ఆయనే "దేశంలో అన్ని అంతర్యుద్ధాలకు" కారకుడు అవుతున్నారని దాడి చేశారు. సుప్రీంకోర్టే చట్టాలు చేసేటట్లయితే పార్లమెంటును మూసుకోవాలని కూడా ఆ ఎంపి మాట్లాడారు. న్యాయ వ్యవస్థ, పార్లమెంటు తనకు లోబడి వుండాలని ధన్కర్, ఆయన బృందం కోరుకుంటోంది. ఇది రాజ్యాంగ నిర్దేశాలకు వ్యతిరేకమైన విషయం. చట్టసభలు రూపొందించిన శాసనాలను సమీక్షించేందుకు, అవి రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్నాయా లేదా అని సమీక్షించేందుకు సుప్రీంకోర్టుకు అధికారం ఉంది. రాజ్యాంగ సవరణలు కూడా దాని 'మౌలిక స్వభావం' పరిధిలో వున్నాయా అని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చు.

బిజెపి, పక్షపాతంతో దానికి వంత పాడే ఉపరాష్ట్రపతి వంటి మద్దతుదారులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారంటే ఇటీవల సుప్రీంకోర్టు ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన చారిత్రక తీర్పు కారణం. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి శాసనసభ ఆమోదించిన తీర్మానాలకు అంగీకార ముద్ర వేయకుండా తొక్కి పట్టడాన్ని, తర్వాత వాటిని రాష్ట్రపతికి పంపించడాన్ని విచారించిన కోర్టు ఈ తీర్పునిచ్చింది. గవర్నర్ అనుసరిస్తున్న ఈ తీరు చట్టరీత్యా తప్పని, చట్ట విరుద్ధమని ప్రకటించింది. ఆయన ఇలా తొక్కి పట్టిన 10 బిల్లులను ఆమోదించినట్టే పరిగణించాలని 142 అధికరణం మేరకు ప్రకటించింది. ఈ విషయం న్యాయస్థానం సరైన రీతిలో జోక్యం చేసుకుని గవర్నర్ రాజ్యాంగ విరుద్ధ చర్యను చక్కదిద్దింది. బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలున్న చోట్ల జోక్యం చేసుకుని ఆటంకాలు కల్పించేందుకు గవర్నర్లను పనిముట్లుగా వాడుతున్న బిజెపి కి ఇది కార్యనిర్వాహక వర్గం, పార్లమెంటు అధికారాల ధిక్కారంగా కనిపించింది. కేంద్రంలోని బిజెపి నేతృత్వ ప్రభుత్వం అనుసరించే ఈ నిరంకుశ ధోరణులనే ఇప్పుడు సుప్రీంకోర్టులో జయప్రదంగా సవాల్ చేయబడ్డాయి.

వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అధ్యక్షతన గల త్రిసభ్య ధర్మాసనం మొదట్లోనే ఆ చట్టంలోని కొన్ని అంశాలు, ఒక మత బృందానికి లేదా అల్ప సంఖ్యాకులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘించేవిగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. 'వినియోగంలో వక్ఫ్' అన్న భావనను పూర్తిగా లేకుండా చేసే తప్పు నిబంధనలను కోర్టు గమనంలోకి తీసుకుంది. ఈ చట్టం అమలుకు వచ్చేట్లయితే దీని ద్వారా ఒక్క పోటుతో వేలకు వేల వక్ఫ్ ఆస్తులు చెల్లకుండా పోతాయని పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను ఎలా నియమిస్తారని కోర్టు ప్రశ్నించింది. దేవాలయాల ట్రస్టులు బోర్డులలో ముస్లింలను నియమించవచ్చునా అని అడిగింది. వక్ఫ్ ఆస్తులపై వివాదాల పరిష్కారంలో కలెక్టర్ల పాత్రపై కూడా ప్రశ్నలు వేసింది. ఈ విషయంలో మధ్యంతర ఉత్తర్వు రాకుండా అడ్డుకునేందుకోసమే సొలిసిటర్ జనరల్ కోర్టు తుది నిర్ణయం చేసే వరకు కేంద్రం వినియోగంలో వక్ఫ్ అన్న అంశాన్ని మార్చబోదని అధికారికంగా చెప్పారు. కోర్టు తదుపరి విచారణ మే 5వ తేదీన జరగనుంది.

న్యాయ వ్యవస్థకు బెదిరింపులు..వక్ఫ్ చట్టంపై కోర్టు తీసుకున్న ఈ వైఖరి కరుడుగట్టిన నిశికాంత్ దుబే వంటి బిజెపి నేతలకు దురాగ్రహానికి కారణమైంది. ఉన్నత న్యాయ వ్యవస్థను బెదిరించేవిగా, ఒత్తిడి చేసేవిగా వారి వ్యాఖ్యలను చూడవలసి ఉంది. వారి మాటలను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించింది. అవి ప్రధాన న్యాయమూర్తిని అవమానించే విధంగా ఉన్నాయని పేర్కొంది. దుబేపై కోర్టు ధిక్కార చర్యల పిటిషన్‌కు అనుమతినివ్వాలని అటార్నీ జనరల్‌ను అభ్యర్థించింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను తన అదుపులోకి తెచ్చుకోవాలనే నిరంకుశ ప్రయాణంలో సుప్రీంకోర్టును కూడా వదిలిపెట్టడంలేదు. ఏమైనా ఎన్ని ప్రయత్నాలు చేసినా అది ఉన్నత న్యాయవ్యవస్థను పట్టుకోలేకపోయింది. అది పూర్తిగా లోబడేలా చేసుకోలేక పోయింది.

ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు కేంద్ర ఏజెన్సీలు లక్ష్యంగా చేసుకున్న వారి హక్కులను, బెయిల్ మంజూరును కాపాడే విధంగా తీర్పులు వెలువరించింది. దీంతోపాటు రాష్ట్రాల శాసనసభల హక్కులను కాపాడే విధంగా, గవర్నర్ల అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే విధంగా వ్యవహరించింది. ముస్లింల హక్కులను కాలరాచే చర్యలతో కోర్టు ఏకీభవించలేదనే విధంగా కూడా సంకేతాలు వెలువడ్డాయి. వీటి ఫలితంగానే ఉన్నత న్యాయస్థానంపై మరోసారి దాడి మొదలైంది. అన్ని ప్రజాస్వామ్య శక్తులు గొంతు కలిపి న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు ముందుకు రావాల్సిన సమయం. ఇది సుప్రీంకోర్టును వదిలిపెట్టండి అని నినదించాల్సిన సమయం.

# అంతర్జాతీయ కార్మిక వర్గ విప్లవ దీక్షా దినం

2025వ సంవత్సరం మనం 139 వ ""మే డే" దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పారిశ్రామిక విప్లవానంతరం ఇంగ్లాండు లోను, అమెరికాలోనూ, ఐరోపా అంతటా , ప్రపంచంలో కార్మికులు యంత్రాల వద్ద బానిసలుగా పనిచేయవలసి వచ్చింది. యజమానులు వారికి ఇష్ట మైనంతసేపు పరిశ్రమల్లో పని చేయించుకుంటూ , చాలీచాలని వేతనాలను లేదా కూలిని కార్మికులకు ఇచ్చేవారు. నిర్దిష్ట పని గంటలు ఉండేవి కావు. ప్రమాదవశాత్తు కార్మికులు పరిశ్రమల్లో చనిపోతే వారికి ఎటువంటి భద్రత ఉండేది కాదు. ఇటువంటి వేతన బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా, ప్రపంచ కార్మిక వర్గం, ప్రధానంగా ఐరోపా, అమెరికా కార్మిక వర్గం, అనేక ఆందోళనలు, తిరుగుబాట్లు సుదీర్ఘకాలం చేసారు. 19వ శతాబ్దంలో ఈ పోరాటాలు ప్రపంచవ్యాప్తంగా ఊపొందుకున్నాయి. కార్మికుల అదనపు శ్రమే పెట్టుబడి అని పెట్టుబడి దారుల పెట్టుబడి యొక్క గుట్టును కార్ల్ మార్క్స్ మహాశయుడు తన "దాస్ క్యాపిటల్" గ్రంథం ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. కారల్ మార్క్స్, ఎంగెల్స్ మహాశయులు 1848లో అంతర్జాతీయ కమ్యూనిస్టు లీగ్ ఏర్పాటుచేసి కార్మిక వర్గానికి విముక్తి కొరకు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను రూపొందించారు. కమ్యూనిస్టు లీగ్ యొక్క స్ఫూర్తితో ప్రపంచంలో అనేక దేశాల్లో దోపిడీకి వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. ప్రధానంగా 8 గంటల పని దినం కొరకు ,వేతన బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత కొరకు, శ్రమజీవులు అనేక పోరాటాలు చేశారు. అంతర్జాతీయ కార్మిక సంఘం మద్దతుతో18 86 మే నాలుగో తారీఖున అమెరికా దేశంలోని చికాగో నగరంలో హే మార్కెట్ (గడ్డి మార్కెట్) సెంటర్లో 8 గంటల పని దినం కొరకు కార్మికులు సభ జరుపుకుంటున్నారు. అప్పటికే దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో 8 గంటల పని దినం కొరకు ఆందోళనలు సాగుతున్నాయి. ఈ పోరాటానికి,ఆగస్ట్ స్పీస్,ఆల్బర్ట్ పార్సన్స్,జార్జ్




ఏంగెల్,అడాల్ఫ్ ఫిశ్చర్,లూయిస్ లింగ్,మైకేల్ స్వాబ్,ఆస్కార్ నీబె,సామ్యూల్ ఫీల్డెన్ లు నాయకత్వం వహించారు.

హే మార్కెట్ సెంటర్లో కార్మికుల సభ జరుగుతున్న ప్రాంతంలో అకస్మాత్తుగా బాంబు విస్ఫోటనం జరిగింది. ఆ విస్ఫోటనంలో ఏడుగురు పోలీసులు, అనేక మంది కార్మికులు చనిపోవడం క్షతగాతులవటం జరిగింది. అప్పుడు జరిగిన పోలీసు కాల్పుల్లో అనేక మంది కార్మికులు చనిపోయారు. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. ఆ చికాగో నగర కార్మికుల రక్తంలోనుండి ఉద్భవించినదే ఎర్ర జెండా.

ఈ ఘటనకు 8 మంది కార్మిక నాయకులను అరెస్టు చేశారు. నలుగురు నాయకులను బాధ్యులు చేసి ఉరి తీశారు. మిగతా వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

హే మార్కెట్ ఘటనను ఒక పోరాట స్ఫూర్తి చిహ్నంగా తీసుకొని, పెట్టుబడిదారులకు కార్మిక వర్గానికి జరిగినటువంటి పోరాటానికి చిహ్నంగా, 1889 లో జరిగిన రెండవ అంతర్జాతీయ సోషలిస్టు సంస్థ మే ఒకటో తేదీని ప్రపంచ కార్మిక వర్గ దీక్షా దినంగా పాటించాలని తీర్మానం చేయబడింది. నాటి నుండి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం మే ఒకటవ తేదీన ప్రపంచ కార్మిక వర్గ విప్లవ దీక్షా దినంగా సోషలిస్టు వ్యవస్థ సాధనకు ప్రతిజ్ఞ దినంగా పాటిస్తూ వస్తున్నది. మిత్రులారా! భారతదేశంలో మేడే కార్మిక జెండాను మొట్టమొదటిసారిగా 1923 లో మేడే నాడు మద్రాసు నగరంలో కార్మికుల మధ్య కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ప్రముఖుడైన కామ్రేడ్ సింగారు వేలు చెట్టియారు నాయకత్వంలో జరిగింది. నాటి నుండ బొంబాయి జౌలి పరిశ్రమల్లోనూ, బొంబాయి, కలకత్తా, మద్రాసు మొదలగు మహానగరాల్లో నావికా కార్మికుల మధ్య , ఆ విధంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో చేస్తున్న కార్మికుల మధ్య శ్రమజీవుల మధ్య ఎర్రజెండాను ఒక పండుగలాగా విప్లవ ప్రతిజ్ఞ దినోత్సవం లాగా కార్మిక వర్గం జరుపుకుంటూ ఉన్నది. 1990 సంవత్సరం తూర్పు యూరప్ పరిణామాల తర్వాత, సోవియట్ యూనియన్ రష్యాలో కమ్యూనిస్టు పార్టీ దెబ్బతిన్న తర్వాత, అమెరికా సామ్రాజ్యవాది ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంక్ సంస్థల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఏకచత్రాధిపత్యం వహించటానికి ప్రయత్నిస్తున్నాడు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్ గ్లోబలైజేషన్ ( ఎల్. పి .జి) విధానాల ద్వారా భారత పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదులకు అడుగులు మడుగులు వత్తుతున్నాయి. ఆర్.ఎస్.ఎస్ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ , అమిత్ షాల నాయకత్వంలోబీకాషాయ కార్పోరేటు ఫాసిజాన్ని భారతదేశంలో అమలు చేస్తున్నారు. అనేక కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను చట్టాల రూపంలో తీసుకొస్తున్నారు. కాశ్మీరు స్వయంప్రతిప్రత్తినిచ్చే 370 ,35 ఆర్టికల్స్ ను రద్దు చేశారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చారు. ఆ చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో మార్కెటింగ్ చట్టాన్ని మరింత పగడ్బందీగా తీసుకురాబోతున్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారు. అంబానీ, ఆదాని మొదలగు ఆశ్రిత పెట్టుబడిదారులకు లక్షలాది కోట్ల రూపాయల రుణాలను రద్దు చేశారు. భారతదేశం అమెరికా సామ్రాజ్యవాదికి జూనియర్ భాగస్వామ్యంగా ఉంటున్నది. పాలస్తీనా విషయంలో కానీ, పొరుగున ఉన్న నేపాల్ విషయంలో కానీ, భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. ఇట్టి పరిస్థితుల్లో 139 వ మేడే దినోత్సవాన్ని కార్మిక హక్కుల సాధన కొరకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్నటువంటి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమైక్య పూర్వక పోరాటానికి సిద్ధమవుతామని ప్రతిజ్ఞ తీసుకోవలసిన కర్తవ్యం కార్మిక వర్గం పైన ఉన్నది. ఈ కర్తవ్య సాధనలో దేశ వ్యాప్తంగా సిపిఐ(ఎం.ఎల్) రెడ్ స్టార్ పార్టీ, దాని ప్రజాసంఘాలు ముందు వరసలో ఉంటున్నాయి. కావున యావత్ ప్రజానీకం, కార్మిక వర్గం , తమ ఆర్థిక ,హార్ధిక సహాయ సహకారములు అందించవలసిన విజ్ఞప్తి చేస్తున్నాము.

1. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి!
2. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి!
3. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచవకగా అంబానీ, ఆదానీలకు మొదలగు ఆశ్రిత పెట్టుబడిదారులకు అమ్మటాన్ని ఆపాలి!
4. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, స్కీం వర్కర్లను క్రమబద్ధీకరణ చేయాలి!

5. జోహార్ అమరవీరులకు! జోహార్ కామ్రేడ్స్ కొల్లా వెంకయ్య, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి ,చారు ముజందార్ ,కాను సన్యాల్ .

- జోహార్లు తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు.!
- జోహార్లు శ్రీకాకుళం పోరాట అమరవీరులకు!
- ప్రపంచ కార్మికులారా మరియు అణగారిన వర్గాల్లారా ఏకంకండి!!


**-కొల్లిపర వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి,భారత కమ్యూనిస్టు పార్టీ( మార్క్సిస్టు లెనినిస్టు)**
**93923 25652.**


# శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'

కొన్ని వారాలుగా, వార్తల్లో వినవస్తున్న మాటలు: 'సుంకాలు!', 'ప్రతీకార సుంకాలు!', 'సుంకాల యుద్ధం!' 'సుంకాలు' అంటే, తేలిక మాటల్లో, చెప్పాలంటే, ప్రభుత్వాలకు చెల్లించవలిసిన 'పన్నులే!' ఒక దేశం తన సరుకుల్ని ఇంకో దేశానికి ఎగుమతి చేస్తే, దానికోసం తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది ఎగుమతి సుంకం. ఆ సరుకుల్ని దిగుమతి చేసుకున్న వేరే దేశపు వ్యాపారి కూడా తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది దిగుమతి సుంకం. ఆ ఎగుమతి సుంకమూ, ఈ దిగుమతి సుంకమూ - రెండూ కూడా, పెట్టుబడిదారీ విధానంలో, సరుకు ధరలో భాగాలే! ఇప్పుడు 'సుంకాల యుద్ధం' అనే మాట ఎందుకు మొదలైందంటే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల నించీ అమెరికాకు వచ్చే సరుకుల మీద ఇప్పటికే వున్న దిగుమతి సుంకాల్ని బాగా పెంచేశాడు%-% -అని! దానికి అతను చెప్పే కారణాలు ఏమిటంటే, 'ఇన్నాళ్ళూ ఇతర దేశాలు అమెరికా నించీ దిగుమతి చేసుకున్న సరుకుల మీద భారీ సుంకాలు విధిస్తున్నాయి. అమెరికా మాత్రం ఇన్నాళ్ళూ విదేశాల నించీ వచ్చే సరుకుల దిగుమతుల మీద భారీ సుంకాలు వెయ్యలేదు. దాని వల్ల, అమెరికాకు చాలా ఆదాయం రాకుండా పోతున్నది. పైగా ఆ ఇతర దేశాల సరుకుల దిగుమతి వల్ల, జనాలు దిగుమతుల మీదే ఆధారపడతారు. అమెరికాలో పరిశ్రమల అభివృద్ధి జరగదు. అమెరికా నించీ ఎగుమతులు తక్కువై, దిగుమతులు ఎక్కువైతే అమెరికాకు నష్టం కదా!-' ఇవీ ట్రంపు మాటలు! ఈ రకపు వాదనల్ని, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం భాషలో, 'రక్షణ వాదం' అనీ, 'రక్షణ సుంకాలు' అనీ అంటారు. స్వదేశంలోనే పరిశ్రమల్ని అభివృద్ధిపరిచి, దేశ ప్రజలకి ఆ పరిశ్రమల్లోనే ఉద్యోగాలు కల్పిస్తానని, ట్రంప్ చెప్పే మాటలు మంచివిగానే కనపడతాయి.

కానీ, ఈ 'మంచి' అనేక ఇతర విషయాల్ని బట్టి వుంటుంది. నిజానికి పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి స్వతహాగా వున్న లక్షణం ఏమిటంటే, ఒక దేశంలో



తయారయ్యే సరుకులు ఆ దేశ సరిహద్దులు దాటి, ప్రపంచమంతటా, ఎటువంటి నిబంధనలూ, అడ్డంకులూ లేకుండా అమ్మకాలు జరగాలి-అని! దీన్నే 'స్వేచ్ఛా వ్యాపారం' అంటారు. ఇందులో, సుంకాల సమస్య ఘర్షణగా వుండదు. ఏ ఖర్చు ఎంత అవసరం అయితే, అంతకు మించి చేరదు. కానీ, పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గుకు రావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే! ఇప్పుడు, పత్రికల్లోనూ, టీవీల్లోనూ చర్చలన్నీ ట్రంప్ ప్రకటించిన దిగుమతి సుంకాల పెంపుల గురించే! దిగుమతి సుంకాలు ఎక్కువైతే, ధర పెరిగి, మిగిలే లాభం తక్కువ. సుంకాలు తక్కువ అయితే, ధర తగ్గి, మిగిలే లాభం ఎక్కువ! ట్రంపు పెంచిన సుంకాలు వేరు వేరు దేశాల మీద వేరు వేరు శాతాలుగా వున్నాయి గదా? వీటి వల్ల భారతదేశానికి ఎంత నష్టం, ఎంత లాభం? భారతదేశం కంటే, చైనా వంటి ఇతర దేశాల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడం వల్ల, ఆ దేశాల్లో పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారులు, ఆ పరిశ్రమల్ని అక్కణ్ణించీ తక్కువ సుంకాలు గల భారతదేశానికి తరలించే అవకాశాలు ఏ రంగంలో ఎక్కువ వుంటాయి? ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి.

ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపుల కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధావులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు. మార్క్సు, ఎప్పుడో, 1847లో రాసిన, 'రక్షణ సుంకాలూ, స్వేచ్ఛా వ్యాపారమూ, కార్మికవర్గమూ' అనే వ్యాసంలో ఈ విషయాన్నే గ్రహించి చెప్పాడు, ఇలా: "రక్షణాత్మక సుంకాల వ్యవస్థ ఒక దేశంలో వున్న పెట్టుబడి చేతుల్లో, ఇతర దేశాల పెట్టుబడిని ప్రతిఘటించే, ఆయుధాలను ('వెపన్స్') పెడుతుందిబీ ఇది విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా స్వదేశ పెట్టుబడి శక్తిని పెంచుతుంది." అయితే, రక్షణ సుంకాల సమర్ధకుల వాదన ఎలా వుంటుందని మార్క్సు చెబుతాడంటే, 'విదేశీయుల సరుకులు కొనడం ద్వారా, వాళ్ళ చేతుల్లో దోపిడీకి గురి అవడం కంటే, స్వదేశస్తుల ('ఫెలో--కంట్రీమెన్') చేతుల్లో దోపిడీకి గురిఅవడం మేలు ('బెటర్')' -అని కార్మికులకు చెపుతారట, ఆ సమర్ధకులు! సుంకాల యుద్ధాలు వేరు వేరు దేశాల శ్రామిక ప్రజల్లో అక్కడి ప్రభుత్వాల పట్ల కొన్ని రాజకీయ భ్రమల్ని కూడా కలిగిస్తాయి. ఎలాగంటే, దిగుమతి సుంకాల్ని పెంచిన దేశాల్లో జనాలు ఇలా అనుకుంటారు: "మన ప్రభుత్వం, విదేశీ సరుకుల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడమే మంచిది. దానివల్ల ఆ సరుకులకు ధరలు పెరిగి, వాటిని జనం కొనరు. క్రమంగా, దిగుమతులు తగ్గిపోతాయి. దానివల్ల, మన దేశంలోనే సరుకులు తయారై, మన పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అంటే, మన నిరుద్యోగులకి ఎన్నో ఉద్యోగాలు వస్తాయి. కాబట్టి, మనం మన ప్రభుత్వ విధానాల్ని సమర్ధించాలి" అనే అర్థాలకు వస్తారు. ఇతర దేశాలకు సరుకుల్ని ఎగుమతి చేసే దేశాలలోని కార్మికులేమో, "మన దేశం నించీ అక్కడికి వెళ్ళే సరుకులమీద దిగుమతి చేసుకునే ఆ దేశాలు భారీ సుంకాలు వేస్తే, అక్కడ మన సరుకులు కొనేవాళ్ళు తగ్గిపోతారు. అలా జరిగితే, ఇక్కడి పరిశ్రమల యజమానులు, తమ సరుకుల ఎగుమతులు ఎక్కువగా జరగవు గనక ఉత్పత్తులు తగ్గిస్తారు. అప్పుడు, మనలో చాలా మందికి ఉద్యోగాలు పోతాయి. కాబట్టి, మన ఎగుమతుల మీద అక్కడ దిగుమతి సుంకాలు ఎక్కువగా పడకుండా ప్రయత్నించే మన ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి" అనుకుంటారు. రక్షణ సుంకాల విధానంవల్ల, ప్రపంచ దేశాలలోని కార్మికులందరూ దేశాల వారీగా విడిపోయి వేరు వేరుగా ఆలోచిస్తారు. వారిలో ఐక్యతకు ఇది పెద్ద అడ్డు. సుంకాల నిజాల్ని అర్థమే చేసుకోరు. విదేశీ వర్తకంలో రక్షణ సుంకాలకు భిన్నమైన వాదన కూడా ఒకటి వుంది. అదే, స్వేచ్ఛా వ్యాపారం! అంటే, 'వర్తకం అనేది, ఎటువంటి నిబంధనలూ లేకుండా, సుంకాల పెంపులు లేకుండా, దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా జరగాలి' అన్నదే ఈ వాదన సారాంశం. శ్రామిక జనాల దృష్టితో చూస్తే, రక్షణ సుంకాల విధానాన్ని సమర్ధించాలా, స్వేచ్ఛా వ్యాపారాన్ని సమర్ధించాలా- అన్న ప్రశ్న వచ్చినప్పుడు, రెంటినీ వ్యతిరేకించాలంటాడు ఎంగెల్సు. కాకపోతే, రెంటినీ పోల్చినప్పుడు, స్వేచ్ఛా వ్యాపార విధానం అనేది, 'జాతుల మధ్యా, దేశాల మధ్యా వున్న అడ్డంకుల్ని ('బారియర్స్'ని) బద్దలుకొట్టి, ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గానికీ -పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య వున్న వైరుధ్యాన్ని మరింతగా తీవ్రతరం ('పుషెస్ టు యాన్ ఎక్స్ట్రీమ్ పాయింట్') చేస్తుందనీ, ఆ రకంగా అది సామాజిక విప్లవాన్ని ఒక రకంగా త్వరితం చేసే అవకాశం వుంటుందనీ మార్క్సు అంటాడు. అంటే, వేరే మాటల్లో చెప్పాలంటే, అన్ని దేశాల పెట్టుబడులూ, అన్ని దేశాల కార్మికులనూ దోస్తున్నాయి అనే వర్గ చైతన్యం తీసుకురావడానికి అవకాశం వుంటుంది - అని! అసలు గ్రహించవలిసిన విషయం ఏమిటంటే, స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, వర్తకుడికి వచ్చేది సరుకు ధరలో నించి 'కమిషను'! ఆ కమిషను, ఆ వర్తకం ఏ సరుకుతో జరుగుతుందో ఆ సరుకులో వుండే కార్మికుల 'అదనపు విలువ'లో భాగమే తప్ప ఇంకెక్కడినించో రాదు. అంటే, శ్రమ దోపిడీ నించీ అన్నమాట! స్వదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, స్వదేశీ కార్మికుల అదనపు విలువ అయితే, విదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, విదేశీ కార్మికుల అదనపు విలువ. 'వర్తకం' అనేది స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనాబీ మొత్తం అన్ని దేశాల వర్తకాల్నీ కలిపి చూస్తే, 'ప్రపంచ వర్తక లాభాలన్నీ', ప్రపంచ కార్మికుల అదనపు విలువలలో భాగమే.

## భక్తి

# అద్దిన అందం



ఒక ఊర్లో ఓ విద్యావంతుడు ఉండేవాడు. అతను ఖాళీ సమయాల్లో పక్కనున్న పల్లెలకు వెళ్లి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అలా వెళ్లేటప్పుడు ఆ విద్యావంతుడు యువకుడైన ఓ శిష్యుణ్ని వెంటపెట్టుకునేవాడు. ఒక పౌర్ణమి రోజున ఆ విద్యావంతుడు శిష్యుడితోపాటు గ్రామాలకు వెళ్లి ఉపన్యాసం ఇచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. అప్పుడు శిష్యుడు చిన్నగా 'గురూజీ, నాదో చిన్న ఆలోచన. మీరు ఉపన్యాసాలకు వెళ్లేటప్పుడు అందంగా తయారవ్వండి. ఆకర్షణీయమైన దుస్తులు ధరించండి. జుట్టుకు నల్లరంగు వేయండి. భుజానికి ఖరీదైన సంచి తగిలించండి. కళ్లకు అందమైన కళ్లజోడు పెట్టండి. అప్పుడు జనం మిమ్మల్ని మరింత గొప్పగా ఆదరిస్తారు' అని చెప్పాడు. 'అలాగా' అని ఊరుకున్నాడు విద్యావంతుడు.

ఇద్దరూ కొద్దిదూరం నడిచారు. దారిలో వారికి ఒక పూల అంగడి కనిపించింది. విద్యావంతుడు, 'శిష్యుడితో కొన్ని గులాబీలు తీసుకో! మన ఇంటి ద్వారానికి అలంకరిద్దాం!' అన్నాడు. గబగబా వెళ్లి పూలు తీసుకువచ్చాడు శిష్యుడు. వెంటనే విద్యావంతుడు 'అలాగే, పక్కనే ఉన్న అంగడికి వెళ్లి సెంటు సీసా ఒకటి కొనుక్కుని రా!' అన్నాడు. 'సెంటు సీసా ఎందుకు గురూజీ?' అని ఆశ్చర్యంగా అడిగాడు శిష్యుడు. 'ఈ గులాబీలకు సెంటు కొడితే మరింతగా గుబాళిస్తాయి కదా' అన్నాడు విద్యావంతుడు. 'సహజమైన గులాబీలకు సెంటు కొట్టడం ఎందుకు గురువు గారు? వాటి సహజమైన పరిమళం వాటికి ఉంది కదా!' అన్నాడు. చిన్నగా నవ్విన విద్యావంతుడు 'నాకు తెలిసిన నాలుగు మంచి మాటలు నలుగురికి చెబుతున్నాను. నాకు సోకులు ఎందుకు శిష్యా. పైపై మెరుగులు, ఆడంబరాలు చూసి జనం ఒకరోజు మోసపోతారు, నెల రోజులు మోసపోతారు. అంతేకానీ ఎక్కువ కాలం మోసపోరు. మనలో సత్తా లేకుండా రకరకాల వ్యవహారాలు చేసి ఎదుటివారిని ఎల్లకాలం మోసం చేయలేం. అద్దిన అందం, దిద్దిన బుద్ధి ఎక్కువకాలం నిలబడవు' అని సమాధానమిచ్చాడు. 'సహజత్వం శాశ్వతం.. కృత్రిమత్వం కొన్నాళ్లే' అని తెలుసుకున్న శిష్యుడు, గులాబీలతో విద్యావంతుడిని అనుసరించాడు.



## చెమటకు చెదరకుండా

వేసవి ఉక్కపోత, చెమటలతో మస్కారా కారిపోవచ్చు. ఫౌండేషన్ చెదిరిపోవచ్చు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే చెమటకు చెదరిన మేకప్ మెలకువలు పాటించాలి.చల్లని నీళ్లతో: స్వేద రంధ్రాలు కుంచించుకుపోయి, చర్మం నిగనిగలాడాలంటే, చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచాలి. మేకప్ ముందు కొన్ని నిమిషాల పాటు గడ్డకట్టే చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచి ఉంచి, ఆ తర్వాత మేకప్ వేసుకోవడం మొదలుపెట్టుకోవాలి. అప్పుడు చెమట తగ్గుతుంది|ప్రైమర్తో: వాటర్ రెసిస్టెంట్ ప్రైమర్తో చర్మపు నూనెల ప్రభావానికి కారిపోకుండా ఉంటుంది. వేసుకున్న మేకప్ చెమటకు కారిపోకుండా నియంత్రించాలంటే, చక్కని మ్యాటిఫైయింగ్ ప్రైమర్ను ఎంచుకోవాలిఫౌండేషన్: తేలికగా ఉండే సీరమ్ ఫౌండేషన్స్ వేసవికి తగినవి. వీటిని ఉపయోగించుకుంటే మేకప్ ముద్దలుగా ఊడిపోకుండా ఉంటుంది. అలాగే ఆల్ ఇన్ వన్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయిశ్చరైజర్లలో ఏదో ఒకదాన్ని వాడుకోవాలి.చెదిరిపోకుండా: ఐషాడో, లేదా మస్కారా చెమటకు కారిపోతూ ఉంటుంది. కాబట్టి నీటితో చెక్కుచెదరి ఐ మేక్పను ఈ కాలంలో ఎంచుకోవాలి. ఖోల్, జెల్ ఐలైనర్లు, మస్కారాలు, ఐషాడోలు ఈ కోవకు చెందినవే అయి ఉండాలి. స్మడ్జ్ ప్రూఫ్ ఉత్పత్తులు చర్మపు జిడ్డుకు చెక్కుచెదరకుండా ఉంటాయి.పౌడర్ బ్లష్ వద్దు: చెక్కిళ్ల మీద గులాబీ రంగు బ్లష్ అద్దుకోనిదే మేకప్ పూర్తి కాదు. కానీ చెమటలు ఎక్కువగా పట్టే తత్వం ఉన్నవాళ్లు పౌడర్ బ్లష్కు బదులుగా క్రీమ్ బ్లష్ ఎంచుకోవాలి. దీంతో చెక్కిళ్లకు సహజసిద్ధమైన గులాబీ రంగు సమకూరడంతో పాటు, ఈ రంగు చెమటకు కారిపోకుండా కూడా ఉంటుంది.సెట్టింగ్ స్ప్రే: మేకప్ కరిగిపోకుండా ఉంచే

## పిల్లలను హాస్టల్కు పంపే ముందు



ఒక్కోసారి పిల్లలను చదువు నిమిత్తం పాఠశాల స్థాయిలోనే హాస్టల్కి పంపాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తల్లిదండ్రులు ముందుగానే పిల్లలకు కొన్ని విషయాలను నేర్పించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లలకు బాధ్యతగా వ్యవహరించడం నేర్పించాలి. చిన్న చిన్న పనులు చెప్పి చేయిస్తూ ఉంటే వాళ్లకి పనులు చేయడం అలవాటు అవుతుంది.

సమయానుసారం దినచర్య, వ్యాయామం పూర్తిచేసేలా అలవాటు చేయాలి. క్రమశిక్షణతో ఉండడం నేర్పించాలి.

పుస్తకాలు సహా దుస్తులు, ఇతర వస్తువులను భద్రపరచుకునే విధానాలు తెలియజెప్పాలి.

పిల్లలు కొత్త చోట ఉండడానికి భయపడుతూ ఉంటారు. అలాకాకుండా వారిని వెన్నంటి ప్రోత్సహిస్తే ఎప్పటికప్పుడు ఎలాంటి పరిస్థితులతోనైనా సర్దుకుపోవడాన్ని అలవాటు చేసుకుంటారు.

పిల్లలకు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎలానో నేర్పించాలి. ఏ సందర్భాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియజెప్పాలి. దీంతో వాళ్లు ఎక్కడైనా ధైర్యంగా ఉండగల్గుతారు.

అనుకోకుండా ఏదైనా పొరబాటు జరిగితే దాని నుంచి పాఠం నేర్చుకోవడం ఎలానో వివరించి చెప్పాలి.

ఇతరులను గౌరవించడం, స్నేహపూర్వకంగా మాట్లాడడం, సంయమనంతో మెలగడం లాంటివి నేర్పించాలి.

పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవడం, ఇచ్చిపుచ్చుకునే విధానాల గురించి వివరించాలి.

బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ నిర్ణీత సమయంలో హోమ్వర్క్లు పూర్తి చేయడాన్ని అలవాటు చేయాలి.

చిన్న చిన్న ఆరోగ్య సమస్యల గురించి వివరిస్తూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజెప్పాలి.

ఆహారం తీసుకోవడం, ఆటలు ఆడడం, చదువుకోవడం, వ్యక్తిగత శుభ్రత లాంటివి పాటించడంలో నిర్లక్ష్యం వహించకూడదని పిల్లలకు వివరించాలి.

## మార్పు కోరే శక్తి

**'గోడలకు ఉన్న బీటలు బలహీనతలు కావు... అవి కాంతి లోపలికి రావటానికి కారణాలు'... శక్తి దూబేకు అత్యంత ఇష్టమైన మాటలివి. ఆమె దృష్టిలో బలహీనతలనేవి పరాజయాలకు కారణాలు కావు. కొత్త కొత్త మార్గాలను అన్వేషించటానికి మార్గాలు. ఈ మాటలను గాఢంగా నమ్మిన శక్తి దూబే బుధవారం యూపీఎస్సీ విడుదల చేసిన జాబితాలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.**



సాధారణంగా యూపీఎస్పీ పరీక్షలో మొదటి ర్యాంకుల్లో నిలిచినవారు ఏళ్ల తరబడి చదువుతూనే ఉంటారని, బయట ప్రపంచాన్ని పట్టించుకోరని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ శక్తి దూబే ప్రస్థానం చూస్తే వారి అభిప్రాయం కచ్చితంగా మారుతుంది. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్యూ)లో చదువుతున్న సమయంలో హాస్టల్లో స్నేహితులతో కూర్చుని మన చుట్టూ జరిగే అనేక విషయాల గురించి చర్చించటం, అర్ధరాత్రి దూరంగా ఎక్కడో పోలీస్ సైరన్ వినిపిస్తే 'నాకు ఏం పర్వాలేదు' అనుకోవటం లాంటి రకరకాల ఘటనలు ఆమెను ముందుకు నడిపించాయి. విజేతగా నిలిచేలా చేశాయి. శక్తి స్వస్థలం ఉత్తరప్రదేశ్లోని ప్రయాగ్రాజ్. ఆమె తండ్రి పోలీస్ డిపార్ట్మెంట్లో పని చేస్తారు. తల్లి గృహిణి. ప్రయాగ్రాజ్లో స్కూలు చదువు పూర్తయిన తర్వాత శక్తి వారణాసిలోని బీహెచ్యూలో చేరారు. అక్కడ హాస్టల్ వాతావరణం తనకు అనేక పాఠాలు నేర్పిందంటారు శక్తి. 'స్టూడెంట్ డిబేటింగ్ కమిటీ'కి నేతృత్వం వహించటంవల్ల ఆమెకు అనేక కొత్త విషయాలు తెలియటం మొదలయింది. "నాకు వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలనే కోరిక ఉండేది. వాటిని ఎలా మెరుగుపరచాలనే విషయాన్ని ఆలోచించేదాన్ని" అంటారు శక్తి.



**స్ఫూర్తి అదే...**

యూపీఎస్సీ పరీక్షలు రాయాలనే స్ఫూర్తి ఇతరులను చూసి వస్తుంది. కుటుంబంలో ఎవరైనా సివిల్ సర్వెంట్స్ ఉంటే వస్తుంది. కానీ శక్తికి మాత్రం క్యాంపస్లో రాత్రిళ్లు అదనపు క్లాసులకు వెళ్లివస్తున్నప్పుడు పోలీస్ జీప్ సైరన్ విన్నప్పుడు వచ్చింది. "దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది" అంటారు శక్తి. "ఆ ఆలోచన పదేపదే రావడంతో నా కుటుంబ సభ్యులతో ఈ విషయం గురించి మాట్లాడాను. ధైర్యం కలగటం అనేది భావోద్వేగాలకు సంబంధించిన విషయం. కానీ దాని వెనక ఒక బలమైన లాజిక్ ఉంది. ఈ రెండూ కలిసి ఉన్నాయి కాబట్టే యూపీఎస్సీ పరీక్షలు రాయాలనుకున్నాను. అమ్మ, నాన్న నాకు అండగా నిలిచారు" అన్నారు శక్తి.

**ఆ కవితలు...**

శక్తికి కవితలు రాయటం ఒక అలవాటు. సాధారణంగా కవయిత్రులు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ శక్తి దానికి పూర్తి విరుద్ధం. తన అభిప్రాయాలను చాలా సూటిగా, స్పష్టంగా చెబుతారు. సామాన్య ప్రజల అవసరాలను పట్టించుకోకుండా చేసే సంస్కరణలవల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదనేది ఆమె స్పష్టమైన అభిప్రాయం. "మన దేశంలో పోలీసు వ్యవస్థ 1861 పోలీస్ చట్టం పరిధిలోనే ఇంకా పని చేస్తోంది. ఆ సమయంలో ఈ చట్టాన్ని ప్రజలను నియంత్రించడానికి ప్రవేశపెట్టారు. సేవ చేయటానికి కాదు. ప్రస్తుతం మన అవసరాలు వేరు. వాటికి తగ్గట్టుగా మారాలి. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు కానిస్టేబుల్ స్థాయి నుంచి మొదలవ్వాలి. ఉన్నతాధికారుల నుంచి కాదు" అంటారు శక్తి. యూనిఫాం సివిల్కోడ్ విషయంలో కూడా ఆమెకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. "యూపీ విషయాన్నే తీసుకుందాం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు అనేక రకాల ఇబ్బందులు పడుతూ ఉంటారు. యూనిఫాం సివిల్ కోడ్వల్ల మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి. గృహ హింస, కట్నాల కోసం వేధింపులు తగ్గుతాయి" అంటారామె. అయితే దీనిని అమలు చేయటం అంత సులభం కాదనే విషయం కూడా శక్తికి తెలుసు. "ఒకేసారి యూనిఫాం సివిల్కోడ్ను అమలు చేస్తే విమర్శలు, వ్యతిరేకత రావచ్చు. అందరి అభిప్రాయాలూ తీసుకొని నిదానంగా ప్రవేశపెడితే మంచిది" అంటారామె. యూపీఎస్సీలో ఆమె అంతర్జాతీయ సంబంధాలను ఒక సబ్జెక్ట్గా ఎంచుకున్నారు. ప్రస్తుత ప్రపంచంలో మన దేశానికి ఉన్న ప్రాధాన్యత గురించి ఆమెకు స్పష్టమైన అవగాహన ఉంది. "పర్యావరణ విషయంలో మనం ఇతరులకు మార్గదర్శకంగా ఉన్నాం. అంతర్జాతీయ సోలార్ అలయెన్స్ లాంటివాటికి నేతృత్వం వహిస్తున్నాం" అని చెబుతున్నారు శక్తి.

"దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది."

## చల్ల చల్లగా..



ఎండాకాలంలో వేడి నుండి శరీరాన్ని కాపాడుకోవాలి. లేదంటే.. తలనొప్పి, డీహైడ్రేషన్ వంటి సమస్యలు వస్తాయి. వేసవిలో నీడపట్టున ఉండటం, తగినంత నీరు తీసుకుంటే సరిపోదు. రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు తప్పనిసరి. లేకపోతే ఇంట్లో ఉన్నా వడదెబ్బ తగులుతుంది. మజ్జిగ, కొబ్బరి నీళ్ళు, గ్లూకోజ్తో పాటు సబ్జా, బార్లీ తీసుకోవాలి. వీటిలో బీటాకెరోటీన్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్-సి, పొటాషియం, విటమిన్-బి వుండటం వల్ల శరీరానికి కావాల్సిన వ్యాధి నిరోధకశక్తి సమకూరుతుంది. ఇవి డీహైడ్రేషన్ నుండి కాపాడతాయి. నీరు శాతం ఎక్కువగా ఉండే పండ్లు, చల్లని పానీయాలు వేడి నుండి రక్షణనిస్తాయి. చాలా తక్కువ పదార్థాలతో, సులభంగా ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందాం.

**జీలకర్ర మజ్జిగ:కావాల్సినవి :** పెరుగు- పావు కప్పు, నీళ్లు- కప్పు, ఉప్పు- తగినంత, వేయించిన జీలకర్ర పొడి- అర టీస్పూన్, పుదీనా, కొత్తిమీర కరివేపాకు ఆకులు- గుప్పెడు, తురిమిన అల్లం / శొంఠిపొడి- చిటికెడు.

తయారీ: పెరుగును ఒక పాత్రలో తీసుకోవాలి. దానిలో నీళ్లు పోసి కలపాలి. ఉప్పు, వేయించిన జీలకర్ర పొడి కలిపి కవ్వం / హ్యాండ్ బ్లెండర్తో బాగా చిలకాలి. ఈ మజ్జిగను గ్లాసులో పోసి కొత్తిమీర, పుదీనా, కరివేపాకుతో గార్నిష్ చేసుకోవాలి. అంతే మండే ఎండల్లో చల్లదనాన్ని పంచే సహజసిద్ధ పానీయం రెడీ!

**బార్లీ జావ:కావాల్సినవి :** బార్లీ గింజలు- ముప్పావు కప్పు, నిమ్మకాయలు- రెండు, తేనె- అరకప్పు, నీరు- ఆరు కప్పులు.

తయారీ : శుభ్రం చేసుకున్న బార్లీ గింజల్ని గిన్నెలోకి తీసుకుని, నీళ్లు పోయాలి. మీడియం మంటపై వేడి చేయాలి. వేడి అయిన తర్వాత 15 నుంచి 30 నిమిషాల వరకూ సిమ్లో పెట్టి మరిగించాలి. స్టవ్ ఆపి, చల్లారాక నిమ్మరసం, తేనె కలిపి తాగాలి.

**మరికొన్ని పద్ధతులు..**

**కావాల్సినవి :** బార్లీ గింజలు- పావు కప్పు, మజ్జిగ- కప్పు, దానిమ్మ గింజలు-గుప్పెడు, ఉప్పు-తగినంత, నీళ్లు- తగినన్ని.

తయారీ : ఒక గిన్నెలో బార్లీ గింజలు వేసి, నీళ్లు పోసి 6 నుంచి 8 గంటల పాటు నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల గింజలు త్వరగా ఉడుకుతాయి. ఈ గింజలను కుక్కర్లో వేసి 7 నుంచి 8 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. పూర్తిగా చల్లారిన తర్వాత వడబోసి పటికబెల్లం, నిమ్మరసం కలిపి తాగవచ్చు. పలుచని మజ్జిగ కలిపి దానిమ్మ గింజలను వేసి కూడా తీసుకోవచ్చు. మజ్జిగకు బదులుగా పుచ్చకాయ రసం, పైనాపిల్ రసం కలిపి తాగినా చాలా రుచిగా ఉంటుంది.


**పుచ్చకాయ జ్యూస్:కావాల్సినవి :** పుచ్చకాయ ముక్కలు-5,కొబ్బరినీళ్లు- కప్పు, పంచదార / తేనె -స్పూను, ఐస్ క్యూబ్స్-రెండు.

తయారీ : పుచ్చకాయ ముక్కలు తీసుకుని మిక్సీ జార్లో వేసుకోవాలి. ఇందులో కొబ్బరినీళ్లు పోసుకోవాలి. చక్కెర వేసి, ఐస్ క్యూబ్స్ వేసుకోవాలి. బాగా మిక్సీ పట్టుకున్న తర్వాత వడకట్టి, గ్లాసుల్లోకి తీసుకోవాలి. గ్లాసులో పోసుకున్న తర్వాత మరోసారి ఐస్ క్యూబ్స్ వేసుకుని తాగితే రుచి అద్భుతంగా ఉంటుంది. ఇందులో అరచెక్క నిమ్మరసం జోడించినా రుచి బాగుంటుంది. ఇష్టమైన వాళ్లు అలా కూడా కలిపి తీసుకోవచ్చు.

## ఇష్టముంటే చాలు ఈజీగా నేర్చుకోవొచ్చు!

ఇంగ్లీష్ అంటే ఇప్పటికీ చాలా మందికి మింగుడుపడని సబ్జెక్టు. ముఖ్యంగా తెలుగు మీడియంలో చదువుకున్న పిల్లలకు అదో జఠిల పదార్థం. అయితే అనంతపురం జిల్లాలోని సింగంపల్లి అనే పల్లెలో తెలుగు మీడియం చదువుకున్న అనిత మాత్రం 'గట్టిగా అనుకోండి చాలు.. ఇంగ్లీష్ వస్తుంది' అంటున్నారు. రోజువారి జీవితంలో జరిగే విశేషాలను 'స్మార్ట్ ఇంగ్లీష్ ట్యుటోరియల్స్' పేరుతో యూట్యూబ్ షార్ట్స్, రీల్స్లో సరళంగా ఆమె బోధిస్తున్నారు. పదిమందికీ స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ ఇంగ్లీష్ టీచర్ అనిత ఇద్దరు బిడ్డల తల్లి. ఆమె విద్యాభ్యాసమంతా తెలుగు మీడియంలోనే జరిగింది. అయినా ఇంగ్లీషుపై పట్టు సాధించారు. ఒకప్పుడు తనని చూసి నవ్వుకున్న వాళ్లే ఇప్పుడు తను చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు. సినిమా యాక్టర్ సునీల్ అనిత స్పోకెన్ ఇంగ్లీష్ వీడియోలను మెచ్చుకుంటూ గతంలో ఓ వీడియో కూడా చేశారు. అనిత చేసిన వీడియోలు వందలోపే ఉంటాయి. కానీ లక్షల్లో వీక్షకులు ఉన్నారు. ఆమె సాధించిన ఈ విజయం వెనుక ఎంతో కృషి దాగుంది.

అనిత స్వగ్రామం ఆత్మకూరు మండలం సింగంపల్లి గ్రామం. తల్లి మణి, తండ్రి శ్రీనివాసులు,




సోదరి ఉన్నారు. పీజీ వరకు చదివారు. తెలుగు మీడియంలో చదివిన అనిత ఇంగ్లీషులో పట్టు సాధించాలని ఎందుకు అనుకున్నారో ఆమె స్వయంగా చెప్పారు.

'గూగుల్, యూట్యూబ్, ఇన్స్టా, ఫేస్బుక్.. ఇలా ఎక్కడైనా ఇంగ్లీషే. ఈ భాష నేర్చుకోలేకపోతే భవిష్యత్లో ముందుకెళ్లలేం అనిపించేది. అయితే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అమ్మాయిగా ఇంగ్లీష్ అంటే మొదటి నుంచీ చాలా భయం. టెన్సెస్ బట్టీపట్టి నేర్చుకుని, ఎంత ప్రయత్నించినా ఈ భాష రాదని ఒక నిర్ణయానికి కూడా వచ్చేశాను. పెళ్లి, పిల్లలతో ఖాళీగా ఉన్న నేను ఒకరోజు మా అబ్బాయి స్కూలుకి వెళ్లా. అక్కడి టీచర్లతో పేరెంట్స్ అంతా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు. వాళ్లని చూస్తే ఇంగ్లీష్ వచ్చిన వాళ్లదే పైచేయి అనిపించింది. చాలా నామోషీగా అనిపించింది. అసలు నాకెందుకు ఇంగ్లీషు రాదు? ఇంగ్లీషు అంత కష్టమా? అనే ఆలోచనలు ఆ రోజంతా వేధించాయి. నా భర్త గంగాధర్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. 'నీకు చదువు విలువ తెలుసు నువ్వు ఏదైనా నేర్చుకోగలవు అంటూ నాకు మద్దతుగా నిలబడ్డారు. అలా 2016లో ఇంగ్లీష్ నేర్చుకోవడానికి ముందడుగేశాను.

ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఎమోషన్ ఎవరికైనా ఉంటుంది. అయితే ఎలా నేర్చుకోవాలి? నాకైతే మొదట్లో నేర్చుకోవటమే కష్టం అనిపించింది. అయినా వెనక్కి తగ్గలేదు. పుస్తకాలు చదివా. రోజువారి పనుల్ని, మన కళ్లముందు కనిపించేవన్నీ వాక్యాలుగా రాసుకున్నా. ఇంగ్లీషులో మాట్లాడుతుంటే నా చుట్టూ ఉండేవాళ్లు 'రాకున్నా బడాయిగా ఇంగ్లీష్ మాట్లాడుతోందంటూ కామెంట్స్ చేశారు. నేనేమీ పట్టించుకోలేదు. ప్రతిరోజూ నోట్స్ ప్రిపేర్ చేసుకునేదాన్ని. సందేహాలొస్తే గూగులమ్మను అడిగేదాన్ని. అమెరికాలో ఉండే బంధువులతో ఇంగ్లీషులో మాట్లాడేదాన్ని, యూట్యూబ్లో ట్యుటోరియల్స్ ఫాలో అయ్యేదాన్ని. గృహిణిగా అన్ని పనులు చేసుకుని, ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూసుకుంటూనే రోజుకు రెండు గంటలు సాధన చేసేదాన్ని."

**ఎవరైనా నేర్చుకోవచ్చు**

పెళ్లయ్యాకే డిగ్రీతో పాటు ఎంఎ ఇంగ్లీష్, ఎమ్మెస్సీ బయో కెమిస్ట్ చదివాను. ఇంగ్లీషుపై పట్టు సాధించాను. లాక్డౌన్ సమయంలో ఆన్లైన్లో రోజుకి ఆరు గంటల పాటు ఇంగ్లీషు బోధించా. నా దగ్గర నేర్చుకున్న వాళ్ళు నాకంటే పెద్దవాళ్లు. ఏదో ఒక స్పోకెన్ ఇంగ్లీషుకెళ్లి ఇక భాష రాదని నిర్ణయించుకున్న వాళ్ళే. అలాంటి వాళ్లు నా క్లాసులు విని ఎంతో నేర్చుకున్నారు. ఎవరైనా, ఎప్పుడైనా భాష నేర్చుకోవచ్చు. 'బెటర్ లేట్దాన్ నెవర్' అంటుంటా. నేర్చుకోవాలనే తపన, అవసరం, ఆసక్తి ఉండాలంతే. 'నాకేమీ వనరుల్లేవు' అని ఎప్పుడూ నిరుత్సాహపడద్దు. ఒక్క స్మార్ట్ ఫోను ఉంటే చాలు. ఇంగ్లీష్ నేర్చుకోవడం ఒన్డే మ్యాచ్ కాదు. ఇదో నిరంతర సాధన.

ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా ప్రభావం చాలా ఉంది. అయితే ఇక్కడ ఎంటర్టైన్మెంట్కి అధిక ప్రాధాన్యత ఇస్తారు. అయినా నా స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసుల కోసం 'స్మార్ట్ ఇంగ్లీష్ ట్యుటోరియల్స్' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించా. 'ఇంగ్లీష్ ఎడ్యుకేషన్' చూస్తారో లేదో అనుకున్నా. యూట్యూబ్లో చేసిన పెద్ద వీడియోల కంటే అందరికీ అర్థమయ్యేలా చేసిన కొన్ని షార్ట్స్, రీల్స్ బాగా పాపులరయ్యాయి. ఇది ఊహించలేదు.

**ఆత్మ విశ్వాసం తోడైంది**

"మాట్లాడటం, రాయటం, చదవటమే నా ప్రపంచం. నాలోని మొండితనమే భాష నేర్చుకోవటానికి కారణమైంది. బయటివాళ్లు ఏమనుకుంటారోననే భయంతో ఇంట్లో మా పిల్లలతోనే ఇంగ్లీష్ మాట్లాడేదాన్ని 'బాగా మాట్లాడుతున్నావని కొందరంటే.. ఒక ఇంగ్లీష్ ఇనిస్టిట్యూట్కి ట్రైనర్గా వెళ్లి అక్కడ డెమో ఇచ్చా. అక్కడ గృహిణులు, ఉద్యోగులు, బిటెక్ చదివిన వాళ్లు ఉన్నారు. సొంతంగా చేసుకున్న మెటీరియల్తో పాటు బోధనా తీరు అక్కడి మేనేజ్మెంట్కి నచ్చింది. ప్రశంసలందుకున్న ఆ రోజు నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అలా మూడేళ్లు అక్కడ ఉద్యోగం చేశాను.

**అదే నా కల!**:ఒకప్పుడు వెటకారంగా 'బట్లర్ ఇంగ్లీష్' అని వెక్కిరించినోళ్లు ఇపుడు నాతో మాట్లాడటానికి జంకుతున్నారు. ఇంగ్లీషు నేర్చుకుంటే ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తాయి. నేను సాఫ్ట్వేర్ కోర్సులు కూడా చేశాను. యూట్యూబ్లో నా వీడియోలు వంద కూడా ఉండవు. కొన్ని వీడియోలను లక్షల మంది చూశారు. ఇద్దరు పిల్లల తల్లి అయిన నేను ఇంగ్లీష్ నేర్చుకోవటానికి పడిన కష్టాలు ఇతరులు పడకూడదనుకున్నా. నేర్చుకున్న టెక్నిక్స్, టీచింగ్ మెథడ్స్ చెప్పాలనే సదుద్దేశంతో వీడియోలు చేస్తున్నాను. నేను సాధించిన ఈ చిన్న విజయం. కొందరికైనా స్ఫూర్తిగా మిగిలితే చాలు. నాలాంటి ఎంతోమంది, ఇంగ్లీషంటే భయపడేవారందరూ ఇంగ్లీష్ మాట్లాడేలా చేయాలన్నదే నా కల'.

## షాక్.. ప్లాస్మాలో ప్లాస్టిక్



ప్లాస్టిక్ వల్ల ఏడాదికి పది లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మనుషులు, జంతువుల శరీరాల అణువణువుల్లోకి ప్లాస్టిక్ చొచ్చుకుపోతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ జాతిని హరించే విధంగా పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా.. ప్రభుత్వాలు వుదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. పైపెచ్చు..కాలుష్యాన్ని పెంచే విధంగా చర్యలకు పూనుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా.. పిండం ఎదుగుదలకు కారణమయ్యే మాయ (ప్లాస్మా)లో సైతం ప్లాస్టిక్ చేరుతున్నదని.. వెన్నులో వణుకుపుట్టించే విషయాన్ని తాజాగా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్లాస్మాలో ప్లాస్టిక్ చేరడం వల్ల గర్భస్థ శిశువులు ఎన్నో ఇబ్బందులు పడతారని, సగటు వారాల కంటే ముందే జన్మిస్తారని, పుట్టిన తర్వాత కూడా అనేకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హ్యూస్టన్ అధ్యయనం వెల్లడించింది.కాగా, 175 ప్లాసెంటాలపై హ్యూస్టన్లో అధ్యయనం నిర్వహించారు. బిడ్డ పూర్తిగా ఎదిగి.. సరైన సమయంలో (37.2 వారాలు) ప్రసవించిన వందమంది గర్భిణీ స్త్రీలపైనా.. సగటు వారాల కంటే (34 వారాలు) ముందే ప్రసవించిన 75 మంది గర్భిణీ ప్లాస్మాలపైనా పరిశోధన చేశారు. సగటు వారాల కంటే ముందే ప్రసవించిన గర్భిణీ స్త్రీల ప్లాస్మాల్లో ప్రతి గ్రాము కణజాలానికి సుమారు 203 మైక్రోగ్రాముల ప్లాస్టిక్ను పరిశోధకులు కనుగొన్నారు. ఇది సరైన సమయానికి ప్రసవించే గర్భిణీ మహిళల ప్లాస్మాలో కంటే 50 శాతం ఎక్కువ అని పరిశోధకులు వెల్లడించారు. ఈ పరిమాణంలో మైక్రోప్లాస్టిక్స్ని చూసి తమకెంతో చాలా ఆశ్చర్యం కలిగిందని ఈ పరిశోధక బృందానికి నేతృత్వం వహిస్తున్న బేలర్ కాలేజ్ ఆఫ్ మెడిసన్ డాక్టర్ ఎన్రికో బరోజ్ అన్నారు. అసలు 2020 నుంచే మానవ శరీరంలో మైక్రోప్లాస్టిక్స్పై అధ్యయనం కొనసాగుతోంది. ఇప్పటికే వీర్యం, తల్లిపాలు, మెదడు, కాలేయం, ఎముకమజ్జలలో మైక్రోప్లాస్టిక్స్ను పరిశోధకులు కనుగొన్నారు. ప్లాస్టిక్ వినియోగం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.ప్లాస్మాలోకి.. ప్లాస్టిక్ ఎలా చేరుతుంది?

మైక్రోప్లాస్టిక్ (ప్లాస్టిక్ శకలాలు) గర్భిణీ మహిళల తీసుకునే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి ద్వారా కూడా చేరవచ్చు. చర్మ సంరక్షణ ఉత్పత్తుల ద్వారా కూడా మైక్రోప్లాస్టిక్స్ ప్లాస్మాలో చేరే అవకాశం ఉందని డాక్టర్ మిథాలీ రాథోడ్ అనే గైనకాలజిస్ట్ చెబుతున్నారు. చర్మ సంరక్షణ ఉత్పత్తుల్ని ఉపయోగించడం వల్ల.. గర్భస్థ శిశువు పెరుగుదలపై కూడా ప్రభావం పడనుంది.

- పిండం ఎదుగుదలలో సమస్యలు తలెత్తుతాయి. శిశువు తక్కువ బరువుతో పుట్టే అవకాశం ఉంది.
- హార్మోన్ల అసమతుల్యత వల్ల.. జీవక్రియలో లోపాలు వస్తాయి. ఈ శిశువులు యుక్త వయసు వచ్చేసరికి పునరుత్పత్తి సమస్యలకు దారితీస్తుంది.
- % మెదడు అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. ఆటిజం వంటి సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది.
- శ్వాసకోశ సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది.
- చిన్నారులు తరచూ అనారోగ్యాలకు, ముఖ్యంగా నరాల బలహీనతకు గురయ్యే అవకాశం ఉందని డాక్టర్ ఎన్రికో చెప్పారు.

మైక్రోప్లాస్టిక్స్ను నివారించుకోవాలంటే..

- ప్లాస్టిక్ కంటైనర్స్లో గర్భిణీ మహిళలు ఆహారాన్ని తినకూడదు.
- స్టీల్ ప్లేట్స్లోనే ఆహారాన్ని తీసుకోవాలి. స్టీల్ గ్లాస్తోనే నీటిని తాగాలి.
- గర్భిణీ మహిళలు ఆర్గానిక్ ఫుడ్ని తీసుకోవాలి. ముఖ్యంగా ప్రాసెస్ చేయని ఆహారాలు సురక్షితమని వైద్యులు సలహా ఇచ్చారు.
- వంటకాలను ప్లాస్టిక్ కంటైనర్స్లో నిల్వ ఉంచకూడదు. అలాగే మైక్రోవేవ్లో వంట చేయకూడదు. ఎందుకంటే మైక్రోవేవ్ పాత్రలు వేడి అయిన వెంటనే హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయి.
- చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఉపయోగించకూడదు.
- ఒకవేళ గాలి కాలుష్యం ద్వారా సమస్యలు ఎదుర్కొంటుంటే. ఇంట్లో ఎయిర్ప్యూరిఫైర్లను పెట్టుకోవడం మంచిదని డాక్టర్ ఎన్రికో సూచిస్తున్నారు.



# మార్కెట్లపై యుద్ధమేఘాలు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. భారత్-పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 588.90 పాయింట్లు కోల్పోయి 79,212.53 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 207.35 పాయింట్లు పతనం చెంది 24,039.35 వద్ద ముగిసింది. పహల్గాంపై తీవ్రవాదులు దాడులు చేయడంతో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీ రంగ సూచీ మినహా అన్ని రంగాల సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి.

అదానీ పోర్ట్స్ షేరు 3.61 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్ షేర్లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి.
అలాగే టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, మారుతి, ఎస్బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి.
టీసీఎస్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 2.56 శాతం, మిడ్‌క్యాప్ కూడా 2.44 శాతం కోల్పోయింది.
రంగాలవారీగా చూస్తే సర్వీసెస్ 3.11 శాతం నష్టపోగా, యుటిలిటీ 2.96 శాతం, రియల్టీ 2.87



# వెంటనే డబ్బులు కావాలా? తులం బంగారానికి బ్యాంకులు లోన్ ఎంత ఇస్తాయో తెలుసా?



**హైదరాబాద్-నవభూమి:** అత్యవసర పరిస్థితులు ఎప్పుడు వస్తాయో ఎవరూ చెప్పలేరు. ఆ సమయంలో తక్షణ ఆర్థిక సహాయం కోసం చాలామంది చూసే మొదటి ఆప్షన్ లోన్. బంధువులు, తెలిసిన వారి వద్ద వడ్డీకి తీసుకోవడం లేదా చిట్టీలు వేయడం వంటివి కొందరికి అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటి వారికి తమ వద్ద ఉన్న బంగారం ఒక ఆశాకిరణం. బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు.. మీ బంగారాన్ని తనఖా పెడితే రుణం అందిస్తాయి. అయితే, మీ బంగారం స్వచ్ఛతను బట్టి ఎంత రుణం పొందొచ్చో తెలుసుకోవడం చాలా ముఖ్యం. బంగారు రుణం ఒక సురక్షితమైన రుణం కాబట్టి చాలామంది బయట అధిక వడ్డీలకు డబ్బు తీసుకునే బదులు దీనిని ఎంచుకుంటారు. నిజానికి, బంగారు రుణాలపై వడ్డీ రేట్లు కూడా చాలా తక్కువగా ఉంటాయి. మరి ప్రస్తుతం, మీ వద్ద ఉన్న తులం (10 గ్రాముల) బంగారంపై ఎంత రుణం పొందవచ్చో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

**బంగారం విలువలో 75 శాతం వరకు రుణం..**

బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు తమ వినియోగదారులకు వారి బంగారం విలువలో 75 శాతం వరకు రుణంగా అందిస్తున్నాయి. అయితే, మీరు పొందే రుణ మొత్తం మీ బంగారం స్వచ్ఛత (క్యారెట్లు), పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఇది గరిష్ట పరిమితి అయినప్పటికీ, పోటీ కారణంగా కొన్ని సంస్థలు కొంచెం ఎక్కువ మొత్తాన్ని కూడా ఇవ్వవచ్చు. ఉదాహరణకు, మీ వద్ద రూ. 1,00,000 విలువైన బంగారం ఉంటే, మీరు దాదాపు రూ. 75,000 వరకు బంగారు రుణం పొందవచ్చు. ప్రస్తుతం బంగారు రుణాలపై వడ్డీ రేట్లు 8 శాతం నుంచి 24 శాతం వరకు ఉండొచ్చు. అంతేకాకుండా, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు ఈ లోన్లపై ప్రాసెసింగ్ ఫీజులను కూడా వసూలు చేస్తాయి.

**10 గ్రాముల బంగారానికి ఎంత రుణం వస్తుంది?**

మీరు దగ్గర ఉన్న బంగారం స్వచ్ఛతను బట్టి లోన్ మొత్తం మారుతుంది. వివిధ క్యారెట్ల బంగారంపై వచ్చే రుణాల వివరాలు ఇలా ఉన్నాయి.
24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 10 గ్రాములకు రూ. 98,240 వద్ద ఉండగా.. ఇందులో 75 శాతం అంటే రూ. 73,680 లోన్ వస్తుంది. ఇక 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర ప్రస్తుతం రూ. 90,050 గా ఉండగా.. దీంట్లో 75 శాతం రూ. 67,537 లోన్ పొందొచ్చు. అంటే ఇక్కడ 24 క్యారెట్ల బంగారంపై కాస్త ఎక్కువ మొత్తం లోన్ పొందొచ్చన్నమాట.
అయితే ఈ మొత్తం వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల విధానాల్ని బట్టి మారొచ్చు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు కొన్నిసార్లు కొంచెం ఎక్కువ మొత్తాన్ని కూడా అందించే అవకాశం ఉంది. రుణం తీసుకునే ముందు వివిధ సంస్థల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీలను తప్పకుండా తెలుసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో బంగారు రుణం ఒక మంచి ఆర్థిక సహాయకారిగా ఉపయోగపడుతుంది. అయితే, మీ బంగారం స్వచ్ఛతను నిర్ధరించుకోవడం, వివిధ రుణ సంస్థల ఆఫర్లను సరిపోల్చడం, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడం చాలా ముఖ్యం. సరైన సమాచారంతో మీరు మీ బంగారాన్ని సమర్థంగా ఉపయోగించుకొని ఆర్థిక అవసరాలను తీర్చుకోవచ్చు.

# విమాన చార్జీలకు రెక్కలు!



**న్యూఢిల్లీ-నవభూమి:** విమాన చార్జీలకు మళ్లీ రెక్కలు వచ్చాయి. పహెల్గాంపై తీవ్రవాదులు దాడుల నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో పాకిస్థాన్ ఒక అడుగుముందుకేసి ఆ దేశ గగనతలాన్ని మూసివేసింది. దీంతో పాకిస్థాన్ గగనతలం నుంచి దేశీయ విమాన సర్వీసులు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించడంతో ఆయా విమానయాన సంస్థలు ప్రయాణికులపై భారం మోపడానికి సిద్ధమవుతున్నాయి. పాక్ గగనతలం నుంచి వెళ్లే యూరప్, ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్యం వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల విమాన చార్జీలు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతిగా పాకిస్థాన్ తన గగనతలంపై నిషేధం విధించడంతోపాటు సరిహద్దును మూసివేసింది.

**పెరగనున్న ప్రయాణ సమయం**

భారత్ నుంచి ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల సమయం మరింత పెరగనున్నది. ఈ విషయాన్ని ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేశాయి. పాక్ గగనతలం మూసివేయడంతో అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లే విమాన ప్రయాణ సమయం 2 గంటల నుంచి 2.5 గంటల వరకు పెరగనున్నదని సీనియర్ పైలెట్ ఒకరు చెప్పారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులపై ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నారు. ప్రయాణ సమయం పెరగడంతో విమాన సంస్థలపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా టికెట్ చార్జీలను పెంచడానికి సమాయత్తమవుతున్నాయి. గగనతలం మూసివేయడంతో చమురు వినిమయం పెరగడం, నిర్వహణ ఖర్చులు అధికం కావడం కూడా ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు.

**ఎయిర్ ఇండియా దారిమళ్లింపు**

పాక్ గగనతలం మూసివేయడంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమాన సర్వీసులను దారి మళ్లించింది. ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్, ఇతర దేశాలకు ప్రయాణించే అంతర్జాతీయ ఫ్లైట్ సర్వీసులు కొత్త రూట్‌లో వెళ్తున్నాయి. దీంతో వీటి ప్రయాణం సమయం మరో రెండు గంటలు పెరుగుతున్నదని తెలిపింది. మరో విమానయాన దిగ్గజం ఇండిగో..అంతర్జాతీయ రూట్లలో నడిచే విమాన సర్వీసులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని, ప్రయాణికులకు తమ పరిస్థితిని వివరించనున్నట్లు తెలిపింది. ప్రయాణికులకు కలిగించే అసౌకర్యాన్ని మేము అర్థం చేసుకోగలం..మీ గమ్యాన్ని చేర్చడానికి తమవంతుగా కృషి చేయనున్నట్లు ఎక్స్‌లో పేర్కొంది. ఈ రెండు సంస్థలతోపాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు కూడా ఈ రూట్‌లో నడుస్తున్నాయి.

# ఎఎస్ఎంఇ, ఐషో ఇండియా 2025ను గెలుచుకున్న 3 భారతీయ వెంచర్లు



**హైదరాబాద్-నవభూమి:** అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఎ.ఎస్.ఎం.ఇ.) ఏప్రిల్ 25న హైదరాబాద్‌లోని టి-హబ్‌లో తన ప్రధాన సామాజిక ఆవిష్కరణ యాక్సిలరేటర్, ఐషో ఇండియా 2025ను విజయవంతంగా ముగించింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం భారతదేశం అంతటా ఉన్న అత్యంత ఆశాజనకమైన హార్డ్‌వేర్-నేతృత్వంలోని సామాజిక వ్యవస్థాపకులను ఒకచోట చేర్చింది, వీరందరూ వ్యవసాయం, శక్తి, ఆరోగ్య సంరక్షణ మరియు రవాణాలో క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించడానికి అనువైన పరిష్కారాలపై పనిచేస్తున్నారు.
ఏడు షార్ట్‌లిస్ట్ చేయబడిన వెంచర్లు - కరుణా మొబిలిటీ (పుదుచ్చేరి), డార్ట్‌ఎంఎల్ (కేరళ), ఫాస్ట్‌సెన్స్ ఇన్నోవేషన్స్ (పుణే), కిసాన్ రోవర్ (రాజస్థాన్), నీన్వా ఇన్నోవేషన్స్ (కాన్పూర్), న్యూరప్ టెక్ సొల్యూషన్స్ (భువనేశ్వర్), మరియు ఆర్ఇ4బిలియన్.ఎఐ (చెన్నై) - ఇంటెన్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నాయి. ఇంజనీరింగ్ డిజైన్ మరియు ఇంపాక్ట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ప్రముఖ ప్రపంచ నిపుణుల నుండి వారు సాంకేతిక అభిప్రాయం మరియు మార్గదర్శకత్వాన్ని పొందారు.
ఈ కార్యక్రమం ఏప్రిల్ 25న అధిక శక్తితో కూడిన ఉత్పత్తి ప్రదర్శన మరియు అవార్డుల ప్రదానోత్సవంతో ముగిసింది, ఇక్కడ ప్రతిష్టాత్మకమైన ఎ.ఎస్.ఎం.ఇ., ఐషో ) గ్లోబల్ కోహార్ట్‌లో చేరడానికి మూడు విజేత వెంచర్లను ఎంపిక చేశారు. విజేత వెంచర్లు ఇలా ఉన్నాయి:చులివ్ (న్యూరప్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్) సెప్-స్కాన్ (ఫాస్ట్‌సెన్స్ ఇన్నోవేషన్స్)
సోలార్-పవర్డ్ అగ్రికల్చరల్ రోబోటిక్ బుల్ (కిసాన్ రోవర్)అవార్డు గ్రహీతలు గ్రాంట్ ఫండింగ్‌లో 30,000 అమెరికన్ డాలర్ల వాటాను పొందుతారు, డిజైన్ మరియు ఇంజనీరింగ్ మద్దతు మరియు ఎ.ఎస్.ఎం.ఇ. వారి గ్లోబల్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌కు ప్రాప్యతతో పాటు. ఈ వనరులు వారి ప్రోటోటైప్‌లను దీర్ఘకాలిక సామాజిక మరియు పర్యావరణ ప్రభావాన్ని అందించగల మార్కెట్-సిద్ధంగా ఉన్న పరిష్కారాలుగా స్కేల్ చేయడంలో వారికి సహాయపడతాయి.
పరిశ్రమ నాయకులు మరియు సీనియర్ ఎ.ఎస్.ఎం.ఇ. నాయకత్వం సమక్షంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఎ.ఎస్.ఎం.ఇ., ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు సిఇఒ, టామ్ కోస్టాబైల్ ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు: "ఈ ప్రతిభావంతులైన వ్యవస్థాపకుల దృష్టి మరియు సృజనాత్మకత మరియు నిపుణులైన మార్గదర్శకుల మార్గదర్శకత్వం ద్వారా, ఎ.ఎస్.ఎం.ఇ., ఐషో జీవితాలను మెరుగుపరిచే మార్కెట్-సిద్ధమైన ఉత్పత్తులుగా సంచలనాత్మక ఆలోచనలను మారుస్తోంది. ఈ కార్యక్రమం శక్తి యొక్క భవిష్యత్తుకు ఎ.ఎస్.ఎం.ఇ. మద్దతులో కీలకమైన భాగం మరియు యు.ఎన్. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది." "అత్యవసర సామాజిక మరియు పర్యావరణ సవాళ్లను పరిష్కరించే హార్డ్-టెక్ ఆవిష్కర్తలు గణనీయమైన అడ్డంకులను అధిగమించడానికి బాగా సన్నద్ధమవ్వాలి మరియు సామాజిక సంస్థలు అందరికీ మెరుగైన ప్రపంచం కోసం వారి దృష్టిని సాకారం చేసుకునేలా చూసుకోవడానికి మేము దశాబ్దపు అనుభవాన్ని నిర్మించడానికి అంకితభావంతో ఉన్నాము" అని ఎ.ఎస్.ఎం.ఇ. సస్టైనబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఇయానా అరండా, పేర్కొన్నారు.
గెలిచిన జట్లు ఇప్పుడు అంతర్జాతీయ ఐషో బూట్‌క్యాంప్‌కు చేరుకుంటాయి, అక్కడ వారు తమ పరిష్కారాలను మెరుగుపరచడంలో మరియు వారి కార్యకలాపాలను స్కేల్ చేయడంలో మరింత మార్గదర్శకత్వం పొందుతారు. వారు ఎ.ఎస్.ఎం.ఇ. వారి విస్తరిస్తున్న సామాజిక వ్యవస్థాపకుల ప్రపంచ పర్యావరణ వ్యవస్థలో భాగమవుతారు, అంతర్జాతీయ సహకారాలు, సాంకేతిక భాగస్వామ్యాలు మరియు గొప్ప నిధుల అవకాశాలకు తలుపులు తెరుస్తారు.
ఐషోఇండియా 2025 ముగింపు సమావేశం, భారతదేశం యొక్క శక్తివంతమైన హార్డ్‌వేర్ ఆవిష్కరణ చిత్రాన్ని పెంపొందించడానికి ఎ.ఎస్.ఎం.ఇ. నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఇంజనీర్లు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు మరియు విధాన రూపకర్తలను ఒకచోట చేర్చడం ద్వారా, మన కమ్యూనిటీలు ఎదుర్కొంటున్న కొన్ని అత్యవసర సవాళ్లను పరిష్కరించడానికి స్పష్టమైన పరిష్కారాలను ఎలా అభివృద్ధి చేయవచ్చు మరియు అమలు చేయవచ్చు అనే విషయాన్ని ఈ కార్యక్రమం ప్రదర్శించింది. ఈ సంవత్సరం ఎడిషన్‌కు తెర పడడంతో, ఇప్పుడు, భారతదేశంలోని అత్యంత తెలివైన హార్డ్‌వేర్ ఆవిష్కర్తల దార్శనికత మరియు చాతుర్యం ద్వారా నడిచే ఆశాజనకమైన నమూనాలను అనుకూల ప్రభావంగా మార్చడం అనే దార్శనికత, తదుపరి దశకు మళ్లింది.

## అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 2025 ఐపిఇ ఫలితాల్లో

# అద్భుత విజయాన్ని గర్వంతో ప్రకటన

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 2025 ఐ.పి.ఇ ఫలితాల్లో తన అద్భుత విజ యాన్ని గర్వంతో ప్రకటించింది. వాణిజ్య విద్య లో అత్యుత్తమతకు సంస్థ చూపుతున్న అంకితభావం మరోసారి రుజువైంది. వివిధ బ్రాంచ్‌ల నుండి అద్భుత ఫలితాలు సాధించి విద్యార్థులు ప్రతిభను చాటారు. సికింద్రాబాద్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ బ్రాంచ్‌లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, సంస్థ ఛైర్మన్ డా. అవినాష్ బ్రహ్మదేవర మరియు 11బ్రాంచ్‌ల ప్రిన్సిపల్స్ ఉత్సాహంగా ఈ గర్వకారణ క్షణాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా, డి. నిషికా రెడ్డి, కె. సాయి చరణ్ తేజ్, పి. అక్షయలు MEC 1st Year% ఫలితాల్లో 496/5000 మార్కులతో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించారు. ఐ.పి.ఇ ఫలితాల చరిత్రలో తొలిసారిగా మా ఇద్దరు విద్యార్థులు టి. పూజిత నాయుడుమరియు పి. నిత్య సంతోషిని లు MEC 2nd Yearలో 990/1000 మార్కులు సాధించగా, కెవిన్ జోసెఫ్ గారు CEC 2nd Yearలో 988/1000 మార్కులతో అద్భుత ప్రదర్శన చూపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ డా. అవినాష్ బ్రహ్మదేవర మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో టాప్ 5 ర్యాంకులు సాధించిన 850 మంది విద్యార్థుల ప్రతిభపై గర్వంగా ఉంది అన్నారు.
ఈ గొప్ప విజయానికి గుర్తింపుగా కాలేజ్ మొత్తం రూ. 25లక్షల స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. రాష్ట్ర టాపర్లు ప్రతి ఒక్కరూ రూ.10,000 నుండి రూ.50,000 వరకు స్కాలర్‌షిప్ చెక్కులను ఆనందంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డా. అవినాష్ బ్రహ్మదేవర, విజయాన్ని సాధించేందుకు వ్యూహాత్మక ప్రణాళిక మరియు పట్టుదల ఎంత ముఖ్యమో తెలియజేశారు. విద్యార్థుల విజయానికి శుభాకాంక్షలు తెలి యజేసి, వారి తల్లిదండ్రులకు తమ మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు.
అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 25ం వాణిజ్య రంగాల్లో కెరీర్ అవ కాశాలను అంది స్తూ, వాణిజ్య విద్యలో తన కంటూ ఓ గుర్తిం పును సొంతం చేసుకుంది. 10 ఏళ్ల విద్యా ప్రతిభతో, 750ం మంది అధ్యాపకులు, 11 బ్రాంచ్‌లతో 20,000 పైగా విద్యార్థులతో తెలంగాణాలో వాణిజ్య విద్యకు ప్రథమ గమ్యస్థా నంగా అవినాష్ కాలేజ్ నిలిచింది. ప్రపంచంలో వాణిజ్య రంగంలో విజయం సాధించేందుకు విద్యార్థులను సమగ్రంగా సిద్ధం చేయడమే అవినాష్ కాలేజ్ మిషన్. భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో ఇదే మార్గంగా కొనసాగుతుంది.

# చాలా తక్కువ వడ్డీకే హెూం లోన్లు..



**హైదరాబాద్-నవభూమి:** సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్త! రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెపో రేటును తగ్గిస్తుండటంతో, బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీ రేట్లను క్రమంగా తగ్గిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తక్కువ వడ్డీ రేట్లతో మీ ఇంటి కలను నెరవేర్చుకోవడానికి ఇది సరైన సమయం. అయితే, మీ క్రెడిట్ స్కోరు ఆధారంగా బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లలో వ్యత్యాసాలుంటాయని గుర్తుంచుకోండి. గృహ రుణాలు సాధారణంగా బ్యాంకులు అందించే అతి తక్కువ వడ్డీ రేటు లోన్లలో ఒకటి. అయితే, ఈ రుణాలు అధిక మొత్తంతో పాటు.. ఎక్కువ కాలవ్యవధిని కలిగి ఉంటాయి కాబట్టి, వడ్డీ రేటులో స్వల్ప వ్యత్యాసం కూడా మీ ఆర్థిక ప్రణాళికపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. అందుకే.. హెూం లోన్ కోసం దరఖాస్తు చేసే ముందు, వివిధ బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లను పోల్చుకోవాలి.
ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బ్యాంకులు అందిస్తున్న గృహ రుణ వడ్డీ రేట్ల గురించి తెలుసుకుందాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వార్షిక వడ్డీ రేటు 8 శాతం నుంచి 9.15 శాతంగా ఉంది. అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 8.70 శాతం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంకులో 8.75 శాతం నుంచి ప్రారంభం అవుతున్నాయి. యాక్సిస్ బ్యాంకులో 8.75% - 12.80% వరకుబీ పంజాబ్ నేషనల్ బ్యాంకులో 8 శాతం నుంచి 9.85 శాతం వరకుబీ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 7.85% - 10.65% వరకు, యూనియన్ బ్యాంకు: 7.85% - 10.40% వరకు, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ బ్యాంకు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో 8.25 శాతం నుంచి ప్రారంభం అవుతున్నాయి. గమనిక: పైన పేర్కొన్న వడ్డీ రేట్లు మీ క్రెడిట్ స్కోరు, వృత్తి, వయస్సు, రుణ మొత్తంపై ఆధారపడి మారవచ్చు. అంతేకాకుండా, బ్యాంకులు రుణంపై ప్రాసెసింగ్ ఛార్జీలు, ఇతర ఫీజులు కూడా వసూలు చేస్తాయి. ఆర్బీఐ రెపో రేటును తగ్గించడం వల్ల బ్యాంకుల నిధుల వ్యయం తగ్గుతుంది. ఈ కారణంగా, బ్యాంకులు తమ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. గృహ రుణాలు సాధారణంగా రెపో రేటుతో అనుసంధానమై ఉంటాయి, కాబట్టి రెపో రేటు తగ్గితే, మీ ఈఎంఐ భారం కూడా తగ్గుతుంది. అందుకే.. సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది మంచి సమయం. వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పోల్చి, మీ అవసరాలకు తగిన రుణాన్ని ఎంచుకోండి. మీ కలను సాకారం చేసుకోండి!

# అక్షయ తృతీయ ధమాకా.. గోల్డ్ జువెల్లరీపై తనిష్క్, మలబార్, రిలయన్స్ అదిరిపోయే డిస్కౌంట్లు!

**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడి కొనాలనుకునే వారికి ఇది నిజంగా పండగ సమయం! అక్షయ తృతీయ (ఏప్రిల్ 30, 2025) సందర్భంగా ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్‌లు తమ వినియోగదారులను ఆకర్షించడానికి భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. తనిష్క్ నుంచి మొదలుకొని రిలయన్స్ జ్యువెల్లర్స్ వరకు, ప్రతి ఒక్కటీ.. ప్రత్యేక డిస్కౌంట్లు, ప్రయోజనాలతో కొనుగోలుదారులను ఉత్సాహ పరుస్తున్నాయి. మరి ఆలస్యం చేయకుండా, ఏ బ్రాండ్ ఎలాంటి ఆఫర్లతో వచ్చిందో చూద్దాం.

**తనిష్క్‌లో మేకింగ్ ఛార్జీలపై భారీ తగ్గింపు..**

తనిష్క్ తన వినియోగదారుల కోసం ఏప్రిల్ 19, 2025 నుంచి ఏప్రిల్ 30, 2025 వరకు ప్రత్యేక ఆఫర్‌ను అందిస్తోంది. ఈ ఆఫర్ కింద బంగారం, వజ్రాల ఆభరణాల తయారీ ఛార్జీలపై ఏకంగా 20 శాతం వరకు డిస్కౌంట్ పొందొచ్చు. ధరల రేంజ్ బట్టి డిస్కౌంట్ శాతం మారుతుంది. రూ. 50,000 వరకు కొనుగోలుపై 5 శాతం తగ్గింపు ఉండగా, రూ. 8 లక్షలు అంతకంటే ఎక్కువ కొనుగోలుపై గరిష్టంగా 20 శాతం తగ్గింపు లభిస్తుంది.
రిలయన్స్ జ్యువెల్లర్స్ ఏప్రిల్ 24, 2025 నాటి ప్రకటన ప్రకారం, మే 5, 2025 వరకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తోంది. బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపుతో పాటు, వజ్రాల ఆభరణాలపై (వజ్రం విలువ ం తయారీ ఛార్జీలు) 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. అంతేకాదు, మీ పాత బంగారాన్ని 100 శాతం ఎక్స్ఛేంజ్ విలువతో కొత్త ఆభరణాలుగా మార్చుకునే అవకాశం కూడా ఉంది.

**మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్..**

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఏప్రిల్ 15, 2025 నాటి ప్రకటన ప్రకారం, బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. విలువైన రాళ్లు, కట్ చేయని వజ్రాల ఆభరణాల తయారీ ఛార్జీలపై కూడా ఫ్లాట్ 25 శాతం తగ్గింపు లభిస్తుంది. వజ్రాల విలువపై కూడా 25 శాతం వరకు డిస్కౌంట్ ఉంది. ఈ ఆఫర్లతో పాటు, ముందస్తు బుకింగ్‌లపై ఉచిత వెండి నాణేన్ని కూడా పొందవచ్చు. అంతేకాకుండా, కేవలం 10 శాతం చెల్లించి ఆభరణాలను బుక్ చేసుకుంటే, కొనుగోలు సమయంలో బంగారం ధర పెరిగినా దాని ప్రభావం మీపై ఉండదని మలబార్ గోల్డ్ హామీ ఇస్తోంది.

**కల్యాణ్ జ్యువెల్లర్స్‌లో మేకింగ్ ఛార్జీలపై 50% వరకు తగ్గింపు..**

కళ్యాణ్ జ్యువెల్లర్స్ ఈ అక్షయ తృతీయ సందర్భంగా బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై ఏకంగా 50 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. అంతేకాకుండా, కేవలం పావు వంతు మొత్తం చెల్లించి ప్రస్తుత బంగారం ధరను లాక్ చేసుకునే అవకాశం కూడా ఉంది. పాత బంగారు ఆభరణాలను తీసుకొచ్చి, వాటి పూర్తి విలువను కొత్త కొనుగోళ్లలో సర్దుబాటు చేసుకోవచ్చు.

**క్యారట్‌లేన్‌లో ఉచిత బంగారు లేదా వెండి నాణేలు..**

క్యారట్‌లేన్ ఏప్రిల్ 21, 2025 ప్రకటన ప్రకారం, కొనుగోలు మొత్తం ఆధారంగా ఉచిత బంగారు లేదా వెండి నాణేలను అందిస్తోంది. రూ. 15,000 నుంచి రూ. 30,000 వరకు కొనుగోలుపై 10 గ్రాముల వెండి నాణెం, రూ. 30,000 నుంచి రూ. 60,000 వరకు కొనుగోలుపై 0.5 గ్రాముల 22 క్యారెట్ల బంగారు నాణెం లభిస్తుంది. కొనుగోలు మొత్తం పెరిగే కొద్దీ ఉచిత బంగారు నాణేల సంఖ్య కూడా పెరుగుతుంది. క్యారట్‌లేన్ %జజుూ% మాట్లాడుతూ, అక్షయ తృతీయ చాలా పవిత్రమైన సమయమని, ఈ పండుగ సీజన్‌లో ప్రతి రూ. 30,000 కొనుగోలుపై 0.5 గ్రాముల బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

# ఏమి కొనేటట్టు లేదు.. సామాన్యుడికి అందని ద్రాక్షగా పుత్తడి

## కొనడానికి వెనుకంజవేస్తున్న మహిళలు



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకు పోతు న్నాయి. పదిగ్రాముల పుత్తడి ధర లక్ష రూపాయల మార్క్‌ను అధిగమించి సామా న్యుడికి అందని స్థాయికి చేరుకున్నది. దీంతో సామా న్యుడితోపాటు మహిళలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. అక్షయ తృతీయ, వివాహం సందర్భంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు, కానీ ప్రస్తుతం ధర లక్ష స్థాయిలో ఉండటంతో మధ్యస్థాయి కుటుంభాలు వీటికి దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే ఇతర ఖర్చులు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై బంగారం పిడుగు పడ్డట్టు అయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశ రాజధానిలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టినప్పటికీ లక్ష రూపాయల దారిదాపుల్లోనే కొనసాగుతున్నది. పండుగ సీజన్‌తోపాటు కుటుంబ ఫంక్షన్లలో మహిళలు బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు..ప్రస్తుతం దీని ధర రికార్డు స్థాయిలో పలకడంతో మహిళలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధరలు 29 శాతం లేదా రూ.22,650 పెరిగింది. ఈక్విటీ మార్కెట్లు, బాండ్ల కంటే పసిడి అత్యధిక రిటర్నులను పంచింది. దేశవ్యాప్తంగా ఉన్న మహిళ వద్ద 24 వేల టన్నుల బంగారం ఉన్నదని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా అంచనాను విడుదల చేసింది.

# రిలయన్స్ ఆదాయం రూ.10 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం రూ.19,407 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.14.34) చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.18,951 కోట్ల (ఒక్కో షేరుకు రూ.14) లాభంతో పోలిస్తే 2.4 శాతం పెరిగింది. 2024-25లోనే డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఆర్జించిన రూ.18,540 కోట్ల లాభంతో పోల్చినా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. ఆయిల్ అండ్ కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనంగానే ఉన్నప్పటికీ రిలయన్స్ జియో, రిటైల్ వ్యాపారాల్లో జోరు లాభం వృద్ధికి దోహదపడింది. కాగా, క్యూ4లో ఆర్ఐఎల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన దాదాపు 10 శాతం వృద్ధి చెంది రూ.2,64,573 కోట్లకు పెరిగింది. ఎబిటా 3.6 శాతం పెరుగుదలతో రూ.48,737 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి ఆర్ఐఎల్ లాభం 2.9 శాతం పెరిగి రూ.81,309 కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.1 శాతం వృద్ధి చెంది రూ.10.71 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.10 లక్షలకు పైగా నెట్‌వర్త్ సాధించిన తొలి కంపెనీ రిలయన్సే. గత ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్‌ను ప్రకటించింది. అలాగే, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.25,000 కోట్ల సమీకరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వెల్లడించింది.
జియో ప్లాట్‌ఫామ్స్: టెలికాం సంస్థ రిలయన్స్ జియోతో పాటు ఇతర డిజిటల్ వ్యాపారాలను ఒకే గొడుగు కిందికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ క్యూ4 లాభం 26 శాతం వృద్ధితో రూ.7,022 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.26,120 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ మార్చి 31 నాటికి రిలయన్స్ జియో కస్టమర్లు 48.82 కోట్లకు చేరగా.. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) రూ.206.2కు పెరిగింది. రిలయన్స్ రిటైల్: ఈ మార్చి త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ లాభం 29 శాతం పెరిగి రూ.3,545 కోట్లకు చేరింది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా 238 స్టోర్లను ప్రారంభించినట్లు, మొత్తం స్టోర్ల సంఖ్య 19,340కి చేరినట్లు కంపెనీ వెల్లడించింది. ఓ2సీ: క్యూ4లో ఓ2సీ విభాగ ఆదాయం 15.4 శాతం వృద్ధితో రూ.1,64,613 కోట్లకు పెరిగినప్పటికీ, ఎబిటా మాత్రం 10 శాతం తగ్గి రూ.15,080 కోట్లకు పడిపోయింది. ముడి చమురు శుద్ధి, పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడం ఇందుకు కారణమైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఓ2సీ ఆదాయం 11 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు స్థాయి రూ.6,26,921 కోట్లకు చేరింది.



## పెళ్లికి వెళ్లి తిరిగొస్తున్న మహిళ, బాలికలను అడ్డుకుని.. అత్యాచారానికి పాల్పడిన ఏడుగురు



**భోపాల్-నవభూమి:** పెళ్లికి వెళ్లి గ్రామానికి తిరిగి వస్తున్న మహిళ, ముగ్గురు బాలికలను కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. వారి వెంట ఉన్న వ్యక్తిని బెదిరించి వెళ్లగొట్టారు. మహిళ, బాలికలను అడవిలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆరుగురు వ్యక్తులతో పాటు ఒక మైనర్ బాలుడ్ని అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 21 ఏళ్ల మహిళ, 15,16, 17 ఏళ్ల వయస్సున్న బాలికలు ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. శుక్రవారం రాత్రివేళ ఒక వ్యక్తితో కలిసి తమ గ్రామానికి తిరిగి వెళ్తున్నారు.కాగా, బైక్‌లపై వచ్చిన ఆరుగురు మగవారు, ఒక బాలుడు కలిసి గిరిజనులైన ఆడవాళ్లను అడ్డుకున్నారు. వారి వెంట ఉన్న వ్యక్తిని భయపెట్టి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. మహిళ, ఆ బాలికలను అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. బాధిత యువతులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితులైన ఆరుగురు వ్యక్తులు, ఒక మైనర్ బాలుడ్ని ఆరు గంటల్లో అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. బీఎన్ఎస్, పోక్సో చట్టం, ఎస్సీఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బిర్యానీ రెస్టారెంట్ వర్కర్ కాల్చివేత.. 'పహల్గామ్ దాడి'కి ప్రతీకారమన్న వ్యక్తి



**లక్నో-నవభూమి:** బిర్యానీ రెస్టారెంట్‌లో పని చేసే వ్యక్తి కాల్పుల్లో మరణించాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. అయితే 'పహల్గామ్ దాడి'కి ఇది ప్రతీకారమంటూ ఒక వ్యక్తి పేర్కొన్నాడు. 26 మంది మరణానికిగాను 2600 మందిని చంపుతామని అన్నాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదశ్‌లోని ఆగ్రాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత స్కూటర్‌పై వచ్చిన కొందరు వ్యక్తులు బిర్యానీ రెస్టారెంట్‌లో పని చేసే గుల్పామ్ అలీ, సైఫ్ అలీపై కాల్పులు జరిపి పారిపోయారు. గుల్పామ్ మరణించగా సైఫ్ గాయపడ్డాడు. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


%కాగా, ఈ కాల్పుల సంఘటన తర్వాత ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'పహల్గామ్ ఉగ్రదాడి'కి ప్రతీకార చర్య అని ఒక వ్యక్తి తెలిపాడు. నడుముకు కత్తి, తుపాకీ కలిగిన అతడు మనోజ్ చౌదరిగా పరిచయం చేసుకున్నాడు. ఇద్దరు వ్యక్తులను చంపామని, క్షత్రియ గో రక్షా దళ్ దీనికి బాధ్యత వహిస్తుందని చెప్పాడు. '26 మందిని చంపినందుకు 2,600 మందితో ప్రతీకారం తీర్చుకోకపోతే, నేను భారత మాత కుమారుడ్ని కాదు. భారత్ మాత పేరుతో ప్రతిజ్ఞ చేస్తున్నా' అని అన్నాడు.మరోవైపు వైరల్ అయిన ఈ వీడియో క్లిప్‌పై పోలీసులు స్పందించారు. గుల్పామ్ అలీ హత్యకు ఈ వీడియోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రెస్టారెంట్‌లో గొడవ వల్ల అతడు హత్యకు గురైనట్లుగా తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు. 'క్షత్రియ గో రక్షా దళ్' పేరుతో ఏ సంస్థ కూడా ఆగ్రాలో లేదన్నారు. సోషల్ మీడియాలో ప్రచార స్టంట్‌గా కనిపిస్తోందని అన్నారు. ఈ వీడియోలోని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## మిషన్ రెడీ.. పాక్‌కు భారత ఆర్మీ స్ట్రాంగ్ మెసేజ్



**శ్రీనగర్--నవభూమి:** పెహల్‌గామ్ ఉగ్రదాడి)తో భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు భారత ఆర్మీ బలమైన సందేశాన్ని పంపింది. 'సిద్ధంగా.. అప్రమత్తంగా ఉన్నాం' అంటూ వీడియోను ఎక్స్‌లో పంచుకుంది. 'మిషన్ రెడీ.. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా. దేనికీ భయపడం. ఏదీ మమ్మల్ని ఆపదు. ఎల్లప్పుడూ సిద్ధంగానే..' అంటూ జవాన్ల విన్యాసాలకు సంబంధించిన వీడియోను పంచుకుంది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ వీడియో చూస్తుంటే పాక్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.కాగా, మంగళవారం మధ్యాహ్నం జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్‌లో ఆర్మీ దుస్తుల్లో అడవిలో నుంచి వచ్చిన ఉగ్రమూక పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. ఈ నరమేధంలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై భారత్ ఆగ్రహంతో ఉంది. పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఈ ఘటనకు పాల్పడిన వారికి కలలో కూడా ఊహించని రీతిలో శిక్ష ఉంటుందంటూ ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే.దీనికి తోడు.. ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వద్ద దాయాదిదేశం కవ్వింపులకు పాల్పడుతోంది. భారత సైనికులపై కాల్పులు జరుపుతోంది. అయితే వాటిని భారత ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్ %-% పాక్ మధ్య యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయంటూ అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, భారత్ మాత్రం ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతో దాయాది దేశంపై భారత్ ఏ రకంగా ప్రతీకారం తీర్చుకోబోతోందన్న ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు భారత ఆర్మీ పెట్టిన పోస్ట్ ఈ ఆసక్తిని మరింత పెంచినట్లైంది.

## జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలో భారీగా ఆయుధాలు స్వాధీనం



**శ్రీనగర్--నవభూమి:** ఉగ్రవాదుల కదలికల నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌ను భారత బలగాలు జల్లెడ పడుతున్నాయి. నిఘా వర్గాలు కూడా ఉగ్రవాదుల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల కదలికలను నిఘా వర్గాలు పసిగట్టాయి. నిఘా వర్గాల ఆదేశాలతో స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఆర్మీ బలగాలు కలిసి సంయుక్తంగా మాచిల్ జిల్లాలో కూంబింగ్ నిర్వహించాయి. ఈ కూంబింగ్‌లో భాగంగా ఉగ్రవాదులు భారీ స్థాయిలో దాచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏకే 47 తుపాకులు, మేగజైన్లు, పిస్టళ్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.ఐదు ఏకే-47 రైఫిల్స్, ఎనిమిది ఏకే-47 మేగజైన్లు, ఒక పిస్తోల్, మరో పిస్తోల్ మేగజైన్, 660 రౌండ్ల బుల్లెట్లతో పాటు ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కుప్వారా జిల్లాలో నెలకొన్న శాంతియుత వాతావరణాన్ని విధ్వంసం చేసేందుకు ఉగ్రవాదులు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. నిఘా వర్గాల అప్రమత్తం కావడంతో.. ఉగ్రవాదుల ఆయుధాలను స్వాధీనం చేసుకుని, అల్లర్లకు అడ్డుకట్ట వేశారు. పహెల్గాం ఉగ్రదాడి అనంతరం భారత ఆర్మీ జమ్మూకశ్మీర్‌లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న పహెల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టుకున్న విషయం విదితమే.


# విద్యార్థిగా వెళ్లి ఉగ్రవాదిగా



**శ్రీనగర్--నవభూమి:** అతడో కిరాతకుడు.. తల్లి పాలు తాగిన రొమ్మును గుద్దే నీచుడు. మన దేశంలో పుట్టి పెరిగి.. శత్రుదేశంతో చేతులు కలిపాడు. అక్కడికి విద్యార్థిగా వెళ్లి ఉగ్రవాదిగా మారొచ్చాడు. అతడే పహల్గాం కీలక నిందితుడు.. ఉగ్రవాది ఆదిల్ హుస్సేన్ థోకర్. పహల్గాంలో పర్యాటకులకు మరణ శాసనం రాసింది కూడా ఇతడే కాగా.. పుట్టింది జమ్మూకశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలో. ఈ ఉగ్రవాది అసలు కథ ఏంటంటే..?20 ఏళ్ల ఆదిల్ థోకర్ అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాకు సమీపంలోని గురీ అనే చిన్న గ్రామంలో జన్మించాడు. టీనేజ్‌లో ఉండగానే పలు నిషేధిక ఉగ్ర సంస్థలకు చెందిన ఉగ్రవాదులకు దగ్గరయ్యాడు. 2018లో దక్షిణ కశ్మీర్‌లో జరిగిన ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడు. అదే ఏడాది పాక్ విద్యార్థి వీసా సాధించి వాఘా సరిహద్దు నుంచి పాక్‌లోకి అడుగుపెట్టాడు. ముందు నుండే ఉగ్రవాద భావజాలం కలిగిన ఆదిల్.. పాక్‌కు వెళ్లాక ఎవరితో టచ్‌లో లేకుండా పోయాడు. దాదాపు 8 నెలల పాటు కుటుంబంతోనూ మాట్లాడలేదు.

ఇలాంటి వారిపై నిఘా పెట్టే ఏజెన్సీలు కూడా ఆదిల్ సమాచారాన్ని సేకరించలేకపోయాయి. కనిపించకుండా పోయిన ఆదిల్.. లష్కరే తోయిబా ఉగ్రసంస్థలో చేరినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌లో శిక్షణ తీసుకుని టాప్ కమాండర్లతో కలిసి పని చేసినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. శిక్షణ పూర్తై, కొన్ని నెలలు పని చేశాక.. 2024 చివర్లో భారత్‌కు తిరిగి వచ్చాడు. కానీ ఈసారి అధికారిక మార్గాల్లో కాకుండా.. పూంఛ్-రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణ రేఖను దాటి అక్రమంగా చొరబడ్డాడు. గుట్టలు, దట్టమైన అటవీ ఉన్న ఆ ప్రాంతం నుంచి ఆదిల్ తనతో పాటు కొత మంది పాకిస్థానీలను కూడా తీసుకువచ్చినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. అలా తీసుకువచ్చిన వారిలో పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న సులేమాన్ కూడా ఒకడు.సరిహద్దు నుంచి తన స్వస్థలానికి చేరుకున్న ఆదిల్.. నిఘా ఏజెన్సీలకు చిక్కకుండా జాగ్రత్త పడ్డాడు. అనంత్‌నాగ్‌లో అతడు అండర్‌గ్రౌండ్‌లో దాక్కున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. కొన్ని వారాల పాటు స్థానిక టెర్రరిస్ట్ సెల్స్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపి పహల్గాం ఉగ్రదాడికి పథకం రచించినట్లు తెలిసింది. భారత్‌లో చేపట్టబోయే ఉగ్రదాడి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా భారీ కుట్ర పన్నినట్లు అధికారులు భావిస్తున్నారు. అనువైన ప్రదేశం కోసం స్థానిక ఉగ్రవాద విభాగాలతో నిరంతరం సంప్రదింపులు జరిపాడు. రద్దీగా ఉండే టూరిస్ట్ ప్రదేశాలను ఎంచుకోవాలని భావించినా.. భద్రతా బలగాలలకు సవాలుగా ఉండే బైసరన్ లోయ అయితే తప్పించుకునేందుకు వీలు ఎక్కువగా ఉంటుందని దాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.ఏప్రిల్ 22న, పగలు 2 గంటల ప్రాంతంలో ఆదిల్ సహా ఇంకొంత మంది ఉగ్రవాదులు దట్టమైన పైన్ అడవుల గుడా బైసరన్ లోయలోకి చేరుకున్నారు. పర్యాటకులను చుట్టుముట్టి, ముస్లింలా, హిందువులా అని అడిగి, మగవారి ప్యాంట్‌లు విప్పి తనిఖీ చేసి ముస్లింలు అయితే వదిలేశారు. హిందువులు అయితే అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపి హతమార్చారు.

# పాక్ గగనతలం మూసివేత



**శ్రీనగర్--నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుతం భారత్-పాకిస్థాన్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించే దశలో ఉన్నాయి. ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తే.. అందుకు ప్రతీగా పాక్ కూడా చర్యలు ప్రారంభించింది. భారత్ నుంచి వచ్చే విమానాలను తమ గగనతలంలోకి రాకుండా నిషేధిస్తూ ఆంక్షలు జారీ చేసింది. పాక్ నిర్ణయం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేసింది.పాక్ గగనతలం మూసివేత కారణంగా భారత్ ఎయిర్‌లైన్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని డీజీసీఏ పేర్కొంది. దాయాది దేశం తీసుకున్న నిర్ణయం కారణంగా.. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు సంబంధించి ప్రయాణ సమయం మరింత పెరగనున్నట్లు డీజీసీఏ తెలిపింది. ఈనేపథ్యంలో విమానయాన సంస్థలకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని డీజీసీఏసూచించింది.ప్రయాణ గంటలు పెరిగినందున.. అందుకు తగ్గట్టుగా విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో పాటు ఇతర సదుపాయాలను కూడా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని డీజీసీఏ ఆదేశాలు జారీ చేసింది. ప్రయాణికుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని విమానయాన సంస్థలకు సూచించింది.నాలుగు రోజుల క్రితం అనగా.. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు.. పర్యాటకులపై జరిపిన కాల్పుల్లో.. 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఇక ఈ ఘటన తర్వాత భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. దాయాది దేశంతో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది.భారత్ తీసుకున్న నిర్ణయాలతో.. దాయాది దేశం తన అక్కసును వెళ్లగక్కుతుంది. తాము కూడా సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు పాకిస్థాన్ ఇప్పటికే ప్రకటించింది. అంతేకాక భారత్‌కు చెందిన విమానాలు ఏవి కూడా తమ గగనతలంలో రాకూడదని చెబుతూ నిషేధాంక్షలు విధించింది.

## కైలాస్ మానస సరోవర్ యాత్ర..

### కీలక అప్‌డేట్ ఇచ్చిన విదేశాంగ మంత్రిత్వశాఖ..!




**న్యూఢిల్లీ-నవభూమి:** కైలాస మానససరోవర్ యాత్ర ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు కొనసాగుతుందని విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఏడాది 50 మంది యాత్రికుల ఐదు బ్యాచులు ఉత్తరాఖండ్ నుంచి లిపులేఖ్ పాస్ మీదుగా యాత్రకు వెళ్తాయని పేర్కొంది. మరో 50 మంది పర్యాటకుల పది బ్యాచులు సిక్కిం నుంచి నాథు లా పాస్ మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొంది. ఆసక్తి ఉన్న వారు యాత్ర కోసం దరఖాస్తు చేసుకునేందుకు %ఎిఎ.స్త్రశీజ.అఅ% వెబ్‌సైట్‌ని ప్రారంభించింది. దరఖాస్తులను కంప్యూటర్ జనరేటెడ్, ర్యాండమైజ్, జండర్ బేస్డ్ విధానంలో ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించనున్నారు.కొవిడ్ మహమ్మారి కారణంగా 2020 నుంచి కైలాస మానస సరోవర యాత్ర నిర్వహించని విషయం తెలిసిందే. ఈ సారి నిర్వహించనున్న యాత్రపై ద్రవ్యోల్బణం ప్రభావం పడే అవకాశం ఉన్నది. కైలాస మానస సరోవర్ యాత్ర కోసం పర్యాటకులు కుమావున్ మండల్ వికాస్ నిగమ్‌కి రూ.35వేలకు బదులుగా రూ.56 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ప్రయాణం, వసతి, ఆహారం తదితరాల కోసం వికాస్ నిగమ్ వెచ్చిస్తుంది. దాంతో పాటు వైద్య పరీక్షలు, చైనా వీసా, పోర్టర్, టిబెట్ అటానమస్ రీజియన్, చైనా బోర్డర్ ఫీజులను ప్రత్యేకంగా చెల్లించాల్సి ఉంటుంది. కుమావున్ మండల్ వికాస్ నిగమ్ లిపులేఖ్ పాస్ ద్వారా కైలాస్ మానస సరోవర్ యాత్ర కోసం ఏర్పాట్లు చేస్తుంది.ఈ సారి రిజిస్ట్రేషన్‌తో పాటు, యాత్రికులు ఆహారం, ప్రయాణం, వసతి కోసం కేఎంవీఎన్ కోసం రూ.56వేలు చెల్లించాలి. కుమావున్ మండల్ వికాస్ నిగమ్ ఉత్తరాఖండ్ నుంచి కైలాస్ మానస సరోవర్ యాత్రను నిర్వహిస్తుంది. ఈ యాత్ర ఢిల్లీ నుంచి ప్రారంభమై ఫితోర్‌గఢ్‌లోని లిపులేఖ్ పాస్ ద్వారా యాత్ర సాగుతుంది. యాత్ర తొలి బృందం జూలై 10న లిపులేఖ్ పాస్ ద్వారా చైనాలోకి ప్రవేశిస్తుంది. చివరి బృందం ఆగస్టు 22న చైనా నుంచి భారత్‌కు బయలుదేరుతుంది. ప్రతి బృందం ఢిల్లీ నుంచి బయలుదేరి తనక్‌పూర్, ధార్చులా ఒక రోజు చొప్పున.. గుం, జినభిదాంగ్‌లో రెండురాత్రులు బస చేసిన తర్వాత చైనాలోకి ప్రవేశిస్తుంది. కైలాస దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో ఈ బృందం చైనా నుంచి బయలుదేరి బుండి, చౌకోడి, అల్మోరాలో ఒక రాత్రి బస చేసిన తర్వాత ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రతి బృందం 22 రోజుల పాటు ప్రయాణిస్తుంది.

## సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు పోప్ ఫ్రాన్సిస్ శవపేటిక..

**రోమ్-నవభూమి:** పోప్ ఫ్రాన్సిస్ శవపేటికను సెయింట్ పీటర్స్ బాలిసికా నుంచి సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు తీసుకువచ్చారు. అక్కడ ఫ్రాన్సిస్ పార్థివదేహానికి ప్రపంచ దేశాధినేతలతో పాటు లక్షలాది మంది అభిమానులు, క్రైస్తవులు తుది నివాళి(%ూశీజూవ ఖీతీఋఅఎఅం ఖీబఅవతీఋశ్రీ%) కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే సాధారణ రీతిలో ఫ్రాన్సిస్ ఖననం జరగనున్నది. మామూలు చెక్కతో తయారైన శవపేటికలో ఫ్రాన్సిస్‌ను ఖననం చేయనున్నారు. ఫ్రాన్సిస్ చివరిచూపు కోసం ప్రపంచ దేశాధినేతలతో పాటు లక్షల సంఖ్యలో జనం హాజరయ్యారు. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ సోమవారం వాటికన్ సిటీలో కన్నుమూసిన విషయం తెలిసిందే.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో పాటు సుమారు రెండు లక్షల మంది నివాళి అర్పించారు. అంత్యక్రియలు నిర్వహించడానికి పూర్వం.. సెయింట్ పీటర్స్ బాసిలికాలో ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. ఆ మీటింగ్ చాలా ఫలవంతమైందని వైట్‌హౌజ్ వర్గాలు వెల్లడించాయి. సామూహిక నివాళి కార్యక్రమంలో ట్రంప్ ముందు వరుసలో ఉన్నారు. ఫిన్‌ల్యాండ్, ఈస్టోనియా దేశాధ్యక్షులు ఆయన పక్కన నిలుచున్నారు. ఆ ఇద్దరు నేతలు కూడా ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్నారు.

### నటి రన్యారావుకు ఏడాది పాటు నో బెయిల్

# అసలేమిటీ కాఫిఫోసా చట్టం?



**బెంగళూరు-నవభూమి:** దుబాయి నుంచి అక్రమంగా బంగారం రవాణా చేస్తూ విమానాశ్రయం లోనే పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన నటి రన్యారావు కేసు కేసు గురించి అందరికీ తెలిసిందే. అయితే గత నెలలోనే ఈమె పట్టుబడగా.. ఇప్పటికీ డీఆర్ఐ అధికారుల కస్టడీలోనే ఉంటోంది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు కూడా చేస్తోంది. ముఖ్యంగా అధికారులు వేధిస్తున్నారంటూ ఆరోపిస్తూనే.. బెయిల్ మంజూరు చేయాలంటే పదే పదే పలు కోర్టులను ఆశ్రయిస్తోంది. దీంతో డీఆర్ఐ అధికారులు షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఆమెకు ఏడాది పాటు బెయిల్ రాకుండా.. కాఫిఫోసా చట్టం కింద ఆమెపై కేసు నమోదు చేశారు. దీంతో ఆమె ఏడాది పాటు జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.మార్చి నెలలో దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం రవాణా చేస్తుండగా బెంగళూరు విమానాశ్రయంలో నటి రన్యారావును అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 14.7 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తరచూ దుబాయి వెళ్లడం, ఎప్పుడూ ఒకేరకమన దుస్తులు ధరిస్తుండటంతో అధికారులకు అనుమానం వచ్చి నిఘా పెట్టారు. ఈక్రమంలోనే ఆమె మరోసారి దుబాయి వెళ్లినట్లు గుర్తించి ఆమెపై ఓ కన్నేశారు. ముఖ్యంగా ఈసారి రన్యారావు భారీ బంగారంతో వస్తుందని నిఘా వర్గాలు అధికారులకు సమాచారం ఇవ్వగా.. విమానాశ్రయం వద్దే ఆమెను తనిఖీ చేశారు. ఈక్రమంలోనే ఆమె బండారం అంతా బయట పడింది.రన్యారావు అరెస్టు తర్వాత ఆమె ఇంట్లోనూ సోదాలు చేయగా.. 14.2 కిలోల బంగారు బిస్కెట్లు, మరో రూ.2.67 కోట్ల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కోర్టు ముందు హాజరుపరిచారు. అయితే కోర్టు ముందు ఏడుస్తూ.. ఎలాంటి సమాధానాలు చెప్పని రన్యారావును.. అధికారులు తమదైన శైలిలో విచారించగా ఒక్కొక్కటిగా నిజాలు చెప్పడం మొదలు పెట్టారు. మొదట తనను ఎవరో కావాలనే ఈ కేసులో ఇరికించారని, తనకేమీ సంబంధం లేదని బుకాయించిన రన్యారావు.. ఆ తర్వాత నిజం ఒప్పుకున్నారు. చాలా ఏళ్లుగా బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఆభరణాల వ్యాపారి సాహిల్ జైన్ ఏ3గా కస్టడీలోకి తీసుకున్నారు. అతడిని ఏప్రిల్ 7 వరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. దీంతో బెయిల్ కోసం రన్యారావు ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు, 64వ సెషన్స్ కోర్టుకు వెళ్లగా.. ఇప్పటికే ఆమెకు చుక్కెదురైంది.దీంతో ఈసారి బెయిల్ కోసం రన్యారావు కర్ణాటక హైకోర్టుకు వెళ్లారు. నేడు విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. రన్యారావుతో పాటు మరో నిందితుడు తరుణ్ కొండూరు రాజు తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ వేయగా.. దానిపై తీర్పును రిజర్వ్ చేసిన కర్ణాటక హైకోర్టు తాజాగా దానిని కొట్టివేసింది. దీంతో కాఫిఫోసా చట్టం కింద వారికి ఏడాది పాటు బెయిల్ లభించదని అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో రన్యారావుకు బెయిల్ ఇవ్వకూడదని డీఆర్ఐ అధికారులు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ ఎస్.విశ్వనాథ్ శెట్టి నిందితుల పిటిషన్‌ను తోసిపుచ్చారు.

**అసలేమిటీ కాఫిఫోసా చట్టం..**

బంగారం స్మగ్లింగ్ కేసులో ప్రధాన నిందితురాలు అయిన రన్యారావు డీఆర్ఐ అధికారుల విచారణకు ఏమాత్రం సహకరించట్లేదు. పదే పదే ఆరోపణలు చేస్తూ బెయిల్ కోసం పలు కోర్టుల్లో పిటిషన్లు వేస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు కాఫిఫోసా చట్టం కింద కేసు నమోదు చేశారు. విదేశీ మారక ద్రవ్యాల పరిరక్షణ మరియు స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం 1974కింద ఈ కేసు పెట్టారు. అయితే ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నోడల్ ఏజెన్సీ అయిన సెంట్రల్ ఎకనామిక్ ఇంటిజెన్స్ బ్యూరో.. ఏడాది పాటు బెయిల్ రాకుండా ఉండాలంటే ఈ చట్టాన్ని ఉపయోగించాలని డీఆర్ఐ అధికారులకు సూచించింది. ఇలా దీన్ని వాడుకున్న అధికారులు రన్యారావుకు ఏడాది పాటు బెయిల్ రాకుండా చేశారు.

## ఈ అక్కాచెల్లెళ్లు రియల్ హీరోలు.. ఉగ్రవాదులకు భయపడక, బాధితులకు అండగా



**శ్రీనగర్--నవభూమి:** పహల్గాం.. ఉగ్రదాడిలో సుమారు 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో అసువులు బాశారు. ఉగ్రదాడి జరుగుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల భద్రతా దళాలు లేవు. తుపాకుల శబ్దం వినపించగానే.. పర్యాటకులు భయంతో ఒణికిపోయారు. తమను ఏం చేయవద్దని వేడుకున్నారు. కొందరు ధైర్యవంతులు ఓ అడుగు ముందుకు వేసి.. తమ ప్రాణాలను పణంగా పెట్టి.. ఇతరులను కాపాడేందుకు ప్రయత్నించారు. ఇక కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పరిస్థితి ఏంటో చూసి.. సాయం చేయడానికి ముందుకు వచ్చారు.

అలా పర్యాటకులకు సాయం చేసిన వారిలో ఇద్దరు చిన్నారిఅక్కాచెల్లెల్లు ఉన్నారు. పట్టుమని 15 ఏళ్లు కూడా లేని ఆ బాలికలు.. ఉగ్రవాదులకు భయపడక.. ధైర్యంగా ముందుకు వచ్చి.. పర్యాటకులకు సాయం చేశారు. వారికి మంచి నీరు ఇచ్చి.. బయటపడే మార్గం చూపారు. ఈ ఇద్దరు బాలికలు చేసిన సాహసం గురించి స్థానిక మీడియాలో రావడంతో.. జనాలు ప్రశంసలు కురిపిస్తున్నారు. రియల్ హీరోలంటూ పొగుడుతున్నారు.జమ్మూ కశ్మీర్‌లోని గుజ్జర్ బకేర్వాల్ సామాజిక వర్గానికి చెందిన రుబీనా(14), ముంతాజ్(16) అక్కాచెల్లెళ్లిద్దరూ.. పహల్గాం ఉగ్రదాడి వేళ మొక్కవోని ధైర్యసాహసాలు చూపారు. దాడిలో గాయపడి.. సాయం కోసం చూస్తున్న వారికి ఆపన్న హస్తం అందించారు. వీరిలో ముంతాజ్ కాలికి గాయం అయినా సరే.. ఏమాత్రం లెక్కచేయకుండా.. ఓ పర్యాటకుడి బిడ్డను సురక్షితంగా కాపాడగా.. చెన్నైకి చెందిన ఓ జంటను కూడా రక్షించారు. అక్కడ నుంచి బయటపడటానికి పర్యాటకులకు దారిచూపారు. కొందరిని తమ ఇంటికి తీసుకెళ్లి వారికి తాగడానికి మంచి నీరు.. తలదాచుకోవడానికి కాస్త చోటు ఇచ్చి.. జీవితంపై నమ్మకం కలిగించారు.ఈ సందర్భంగా రుబీనా మాట్లాడుతూ.. "ఆ సమయంలో మేం మా గురించి ఆలోచించుకోలేదు. మా ఎదురుగా భయంతో బిక్కచచ్చిపోయి.. సాయం కోసం ఎదురు చూస్తున్నవారు మాత్రమే కనిపించారు. వారు కనీసం మాట్లాడలేకపోతున్నారు. మాకు తోచిన సాయం వారికి చేయాలని నిర్ణయించుకున్నాం. అదే చేశాం" అని చెప్పుకొచ్చింది. ఈ చిన్నారి తన వద్ద ఉన్న కుందేలుని పర్యటాకులు ఫొటోలు దిగడం కోసం అద్దెకు ఇస్తూ.. జీవనం సాగిస్తుంటుంది. అందుకే ఆ ప్రాంతంలో అందరు తనను ర్యాబిట్ గర్ల్ ఆఫ్ కశ్మీర్ అంటుంటారు.రుబీనా మాట్లాడుతూ.. మేం మొత్తం మూడు సార్లు తిరిగాం.. ప్రతిసారి భయంతో పరిగెత్తుతున్న జనాలను చూశాం. వారిలో నాకు చెన్నైకి చెందిన ఓ జంట కనిపించింది. నేను వారిని కాపాడాను అని చెప్పుకొచ్చింది. ఇకపోతే రుబీనా.. బైసరన్ ఎకో పార్క్‌లో గైడ్, హెల్పర్‌గా పని చేస్తుంటుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ ఆదివారం 27 । ఏప్రిల్ । 2025

## బన్నీపై తెగ ప్రేమ చూపించిన విజయ్ దేవరకొండ.. ఆ గిఫ్ట్‌కి ఫిదా అయిపోయాడుగా..!



చేసింది తక్కువ సినిమాలే అయిన మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు విజయ్ దేవరకొండ. రౌడీ హీరో కెరియర్‌లో హిట్స్ తక్కువే అయిన ఆయన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. విజయ్‌కి అల్లు ఫ్యామిలీతో మంచి బాండింగ్ ఉంది. గీతా ఆర్ట్స్‌లో విజయ్ గీతగోవిందం సినిమా చేశాక.. టాక్సీవాలా అంటూ ఎస్ కే ఎన్‌తో పని చేశాడు. అలా బన్నీ ఫ్యామిలీకి దగ్గరయ్యాడు. పలు సందర్భాల్లో ఇద్దరు హీరోలు కూడా ఒకరిపై మరొకరు తమ అభిమానాన్ని చూపించుకోవడం మనం చూశాం. రౌడీ బ్రాండ్ దుస్తుల్ని బన్నీకి ఎప్పటికప్పుడు పంపిస్తూనే ఉంటాడు విజయ్ దేవరకొండ. తాజాగా అలానే తన కొత్త డిజైన్లను బన్నీకి పంపిం చేశాడు.రౌడీ బ్రాండ్‌కు టాలీవుడ్‌లో ఎంత క్రేజ్ ఉందో, రౌడీ వేర్స్‌కు యూత్‌లోనూ మంచి క్రేజ్ ఉంటుంది. రౌడీ బ్రాండ్స్‌కి సంబంధించిన ఏదైన కొత్త డిజైన్స్ వస్తే వెంటనే వాటిని అల్లు అర్జున్‌కి పంపిస్తారు విజయ్ దేవరకొండ. ఈ క్రమంలోనే తాజాగా విజయ్ దేవరకొండ..అల్లు అర్జున్‌కు రౌడీ బ్రాండ్‌కు చెందిన ప్రత్యేకమైన డ్రెస్సులు పంపించారు. అలానే బన్నీ పిల్లల కోసం బర్గర్లు కూడా గిఫ్ట్‌గా పంపించారు. విజయ్ గిఫ్ట్‌లు చూసి బన్నీ తెగ ఫిదా అయ్యాడు. లవ్ యూ బ్రదర్.. నీ ప్రేమకు థాంక్యూ అంటూ బన్నీ రిప్లై ఇచ్చాడు. దీనికి విజయ్ కూడా స్పందిస్తూ.. 'లవ్ యూ అన్నా.. మన రిలేషన్ ఇలానే కొనసాగుతాయంటూ ప్రేమపూర్వకంగా స్పందించారు.మరి ఈ దుస్తుల్ని బన్నీ ఎప్పుడు ధరిస్తాడో చూడాలి. ఇక సినిమాల విషయానికి వస్తే బన్నీ ప్రస్తుతం అట్లీ మూవీతో బిజీగా ఉన్నాడు. రీసెంట్‌గానే బన్నీ అట్లీ మూవీ ప్రకటన రాగా, ఈ చిత్రం ఎప్పుడెప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## నల్ల చీరలో వింక్ గాళ్

ప్రియా ప్రకాష్ వారియర్ పరిచయం అవసరం లేదు. ఇటీవలే విడుదలైన గుడ్ బ్యాడ్ అగ్లీ- సినిమాలో ఈ మలయాళ బ్యూటీ నటనకు మంచి పేరొచ్చింది. అయితే తాజాగా దళపతి విజయ్ తన నటనను ప్రశంసిస్తున్న ఏఐ వీడియో విడుదల కాగా, ప్రియా ప్రకాష్ వారియర్ దాదాపుగా ఫిదా అయిపోయింది. ఆ వీడియోలో అంతు దరీ లేని ఆనందం కనబరిచింది ప్రియా. ఇంతకీ ఇందులో ఏం ఉంది? అంటే.. గుడ్ బ్యాడ్ అగ్లీలో సిమ్రాన్ కదలికలను రీక్రియేట్ చేసినందుకు దళపతి విజయ్ ప్రియా ప్రకాష్ ను ప్రశంసిస్తున్న వీడియోను ప్లే చేస్తారు. షాక్‌కు గురైన ప్రియా ఉలిక్కిపడి కన్నీళ్లు పెట్టుకుని, ఆ వీడియోను తన కోసం రీప్లే చేయమని అడిగారు. %ూశ్రీంశీ =ఋఎం% - మీడియాపై కాదు.. కంటెంట్ పై ఫోకస్ చేస్తేనే సక్సెస్! అయితే వీడియో ఏఐలో సృష్టించినది అని హోస్ట్ స్పష్టం చేసారు. -క్షమించండి, ఇది నిజం కాదు.. ఏఐ సృష్టి- అని చెప్పగానే ప్రియా చాలా నిరాశ చెందింది. దాదాపు కన్నీళ్లు పెట్టుకున్న వీడియో ఇంటర్నె ట్ లో వైరల్ అయింది. ఇదిలా ఉంటే మరోవైపు ప్రియా వారియర్ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో గుబులు రేపుతున్నాయి. తాజాగా బ్లాక్ కలర్ డిజైనర్ శారీలో ప్రియా ప్రకాష్ వారియర్ ఫోజులివ్వగా అవి వైరల్ గా మారాయి. ఈ ఫోటోగ్రాఫ్స్ లో మునుపటి కంటే ప్రియా ఎంతో అందంగా ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది.
చీరలో ప్రియా కాన్ఫిడెన్స్ తన అందాన్ని పదింతలు చేసింది. నల్ల చీరలో మెడ సొగసును, నాభి అందాలను అందంగా ప్రదర్శిస్తోంది ఈ బ్యూటీ. ఒరు ఆధార్ లవ్ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన ఈ బ్యూటీ చాలా కాలంగా టాలీవుడ్ బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తోంది. ఇతర పరిశ్రమలలోను తనవైపు వచ్చిన అవకాశాల్ని ఒడిసిపడుతోంది.



## సాయి పల్లవి తర్వాత ధనశ్రీకే ఆ ఛాన్స్

క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ - కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ విడాకుల వ్యవహారం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. ట్రైనింగ్ క్లాస్‌లో ప్రేమలో పడిన ఈ జంట పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. కానీ ఏడాదిలోనే పెళ్లి బ్రేకప్ అవ్వడంతో అభిమానులు ఆందోళన చెందారు.
అయితే గతం గతః. ప్రస్తుతం విడాకుల తర్వాత ఎవరి దారిలో వారు ఉన్నారు. కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయ్యారు. ధనశ్రీవర్మ తమిళ ఇండస్ట్రీలో ట్యాలెంటెడ్ కొరియోగ్రాఫర్‌గా రాణిస్తున్న సంగతి తెలిసిందే. ఎట్టకేటకు ఈ ప్రతిభావని నటనలో అడుగుపెడుతూ తన తొలి తెలుగు చిత్రానికి సంతకం చేసింది. అది కూడా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు నిర్మించే చిత్రంలో క్రేజీగా అవకాశం అందుకుంది. డ్యాన్స్ బేస్డ్ కాన్సెప్ట్ తో రూపొందనున్న ఈ చిత్రానికి ఆకాశం దాటి వస్తావాఅనే క్లాసిక్ టైటిల్ ని ఎంపిక చేసుకున్నారు. సాయిపల్లవి లాంటి కొరియోగ్రాఫర్ కి అవకాశాలు కల్పించిన దిల్ రాజు ఆ తర్వాత నటిగాను పలు చిత్రాలతో ఎంకరేజ్ చేసారు. ఇప్పుడు ధనశ్రీకి అలాంటి అవకాశం కల్పిస్తున్నారు.శ్రీ శశి కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ నృత్య ప్రధాన చిత్రంలో కొత్త నటీనటులకు అవకాశం కల్పిస్తున్నారు. సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ధనశ్రీ వర్మ వృత్తి రీత్యా డెంటిస్ట్ అయినా కానీ, సినీరంగంలో కొరియోగ్రాఫర్‌గా ఎదిగారు. ఇప్పుడు నటిగా మారుతున్నారు.



## యానిమల్ బ్యూటీ అప్పుడే బోర్ కొట్టేసిందా..?



ఏడెనిమిది ఏళ్ల క్రితం మామ్, పోస్టర్ బోయ్స్ సినిమాలతో తెరంగేట్రం చేసింది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రి. కెరీర్ లో తనకు వచ్చిన అవకాశాలు చేస్తూ వచ్చింది. ఐతే ఎప్పుడైతే యానిమల్ సినిమా వచ్చిందో ఆ సినిమాతో అమ్మడి ఫేట్ మారిపోయింది. అంతకుముందు త్రిప్తిని గుర్తు పట్టని వారు కూడా త్రిప్తి కనిపిస్తే చాలు ఫోటోల కోసం ఎగబడుతున్నారు. యానిమల్ సినిమా ఇచ్చిన ఐడెంటిటీ అంతా ఇంతా కాదు అంటూ త్రిప్తి చాలా ఇంటర్వ్యూస్ లో చెప్పుకొచ్చింది. యానిమల్ క్రేజ్ తో త్రిప్తికి బాలీవుడ్ లో మరికొన్ని ఛాన్స్ లు వచ్చాయి. ఈ రెడేళ్లలో అమ్మడు హిందీలో నాలుగైదు సినిమాలు చేసింది. యానిమల్ సినిమాలో జోయా పాత్రలో త్రిప్తి ఆడియన్స్ ని మంత్రి ముగ్ధుల్ని చేసింది. ఆ క్రేజ్ తో కొన్నేళ్ల పాటు బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుందని అనుకున్నారు కానీ మూడు నాలుగు సినిమాలకే అమ్మడి పని అయిపోయింది. లాస్ట్ ఇయర్ త్రిప్తి బ్యాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో, భూల్ భూలియా 3 సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో కూడా త్రిప్తి గ్లామర్ ట్రీట్ తో అదరగొట్టింది. కానీ యానిమల్ లో వచ్చిన క్రేజ్ మాత్రం రాబట్టలేకపోయింది. ప్రస్తుతం అమ్మడు ధఢక్ 2 తో పాటు మరో సినిమా చేస్తుంది. ఈ సినిమాల మీదే తన హోప్స్ అన్నీ పెట్టుకుంది త్రిప్తి డిమ్రి. యానిమల్ టైం లో సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి త్రిప్తికి ఆఫర్లు రావడం ఖాయమని అనుకున్నారు. ఒకటి రెండు సినిమాల్లో హీరోయిన్ గా డిస్కషన్స్ కూడా జరిగాయని టాక్. ఐతే త్రిప్తి తెలుగు ఎంట్రీ ఇవ్వకముందే మళ్లీ కెరీర్ డౌన్ ఫాల్ అవుతుంది. లాస్ట్ ఇయర్ 3 సినిమాల్లో నటించినా అమ్మడు ఎలాంటి ప్రభావం చూపించకపోయే సరికి త్రిప్తి అప్పుడే బోర్ కొట్టేసిందా అని అనుకుంటున్నారు. ఏది ఏమైనా అందాల భామకి మళ్లీ యానిమల్ లాంటి సినిమా పడితే మాత్రం తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. త్రిప్తి టాలీవుడ్ ఎంట్రీ ఇస్తే మాత్రం అమ్మడికి ఇక్కడ మంచి పాపులారిటీ వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఆమధ్య విజయ్ దేవరకొండ సినిమాలో త్రిప్తి నటిస్తుందని మీడియాలో వార్తలు వచ్చాయి కానీ వాటిలో వాస్తవం లేదని తెలుస్తుంది.
ఉగ్రదాడి విషాదం.. కన్సర్ట్‌ను క్యాన్సిల్ చేసిన శ్రేయాఘోషల్ %ూప్రతీవఝ +ప్రశీంఘ్ఝశ్రీ% ఎ జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాం (%ఖఝఘ్ఝశ్రీఝఎ ాఖఎఎ%) ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మరణించారు.

## ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్‌లో శృతి హాసన్.!

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. రానున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్ లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించా



రు. మరోవైపు మేలో తారక్ కూడా ఈ సినిమా షూటింగ్‌లో పాల్గోనబోతున్నాడు. మేకర్స్ తారక్‌తో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఈ సీక్వెన్స్ సినిమాకు చాలా ముఖ్యమైనవని సమాచారం.%ఇదిలావుంటే ఈ మూవీకి సంబంధించి ఒక వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో శ్రుతి హాసన్ కూడా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిత్ర బృందం ఇప్పటికే ఆమెను సంప్రదించారని, ఆమె కూడా అంగీకరించారని టాక్ వినిపిస్తోంది. సినిమాలో ఒక ప్రత్యేక గీతంలో శ్రుతి హాసన్ నర్తించ నుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఆమె కథకు కీలకమైన పాత్రలో కూడా కనిపించవచ్చని తెలుస్తోంది. తారక్ పాత్రఆమె పాత్రల మధ్య ముఖ్యమైన సన్నివేశాలు ఉంటాయని సమాచారం. శ్రుతి హాసన్ గతంలో ఎన్టీఆర్‌తో రామయ్య వస్తావయ్య అనే సినిమాలో చేసింది.

## ప్రభాస్ ఒక నార్మల్ యాక్టర్: మంచు విష్ణు




ఇండియన్ సినిమాలో బిగ్గెస్ట్ స్టార్స్ లో ప్రభాస్ ఒకరు. హయ్యెస్ట్ రెమ్యునరేషన్ తీసుకుంటున్న యాక్టర్స్ లో ముందు వరుసలో ఉంటారు. 'బాహుబలి' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా మారిన డార్లింగ్.. సినిమా సినిమాకి తన రేంజ్‌ను, మార్కెట్‌ను పెంచుకుంటూ వెళ్తున్నారు. ఇప్పుడు దేశ విదేశాల్లోనూ ఆయనకు ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా కోటాను కోట్లు వసూళ్లు రాబడుతున్నాయి. ఫ్లాప్ సినిమాతోనూ బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేయడం ఆయనకే సాధ్యం. అందుకే బాలీవుడ్ ప్రొడ్యూసర్స్ అందరూ రెబల్ స్టార్ తో సినిమాలు చేయడానికి క్యూలు కడుతున్నారు. అలాంటి ప్రభాస్ పై హీరో మంచు విష్ణు ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది."యాక్టింగ్ వైజ్ నా దృష్టిలో ప్రభాస్ ఒక నార్మల్ యాక్టర్. ప్రభాస్ ఒక లెజెండ్‌గా మారాడడానికి టైం పడుతుంది. మోహన్ లాల్ ఒక లెజెండ్. ఎందుకంటే టైం ఫ్రేమ్ ఆయన్ని అలా మార్చింది. ప్రభాస్ కూడా రాబోయే రోజుల్లో లెజెండ్ గా మారతాడు. ఆ విషయంలో నాకు చాలా కాన్ఫిడెంట్ ఉంది" అని మంచు విష్ణు అన్నారు. డార్లింగ్ పై విష్ణు చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయంలో కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తుంటే, మరికొందరు మాత్రం మద్దతుగా నిలుస్తున్నారు.
ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ ని విష్ణు తక్కువ చేసి మాట్లాడారని ఓ వర్గం ఫ్యాన్స్ అంటుంటే.. ఆయన మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదని మరో వర్గం అభిప్రాయ పడుతున్నారు. వాస్తవానికి ప్రభాస్ గురించి మంచు విష్ణు మాట్లాడిన వీడియో ఇప్పటిది కాదు. ఒక నెల రోజుల క్రితం 'కన్నప్ప' ప్రమోషన్స్ లో భాగంగా ఓ ప్రెస్ మీట్ లో విష్ణు చెప్పిన మాటలు అవి. కానీ ఇన్ని రోజుల తర్వాత కావాలనే దాన్ని బయటకు తీసుకొచ్చి వైరల్ చేస్తున్నారు. ప్రభాస్ పై విష్ణు షాకింగ్ కామెంట్స్ చేశారని ప్రచారం చేస్తున్నారు.మంచు ఫ్యామిలీతో ప్రభాస్ కి మంచి సాన్నిహిత్యం ఉందనే సంగతి తెలిసిందే. ముఖ్యంగా మోహన్ బాబుతో ఆయనకు మంచి బాండింగ్ ఉంది. అందుకే అడిగిన వెంటనే 'కన్నప్ప' సినిమాలో నటించడానికి ఒప్పుకున్నారు. అందులో రుద్ర అనే స్పెషల్ రోల్ లో ప్రభాస్ కనిపించనున్నారు. దీంతో పాన్ ఇండియా వైడ్ గా ఈ ప్రాజెక్ట్ కు క్రేజ్ ఏర్పడింది. విష్ణు సైతం ఎక్కడికి వెళ్లినా ప్రభాస్ ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. సినిమాలో నటించినందుకు డార్లింగ్ ఒక్క రూపాయి కూడా రెమ్యునరేషన్ తీసుకోలేదని తెలిపారు.విష్ణు డ్రీం ప్రాజెక్ట్ గా తెరకెక్కుతున్న 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ తో పాటుగా మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, శరత్ కుమార్, మధుబాల, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషించారు. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి విష్ణు స్వయంగా కథ అందించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే నిన్ననే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. కానీ వీఎఫ్ఎక్స్ వర్క్స్ పెండింగ్ ఉండటంతో వాయిదా వేశారు. జూన్ 27న పలు ప్రధాన భారతీయ భాషల్లో ఈ మూవీ రిలీజ్ కానుంది.

## ఉగ్రదాడి విషాదం.. కన్సర్ట్‌ను క్యాన్సిల్ చేసిన శ్రేయాఘోషల్



జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మరణించారు. ఇక ఉగ్రదాడి అనంతరం దేశంలో పరిస్థితులు ఉత్కంఠగా మారిన విషయం తెలిసిందే. పలు నగరాల్లో ఇప్పటికే భద్రతను కట్టుదిట్టం చేశారు. అయితే దేశవ్యాప్తంగా ప్రస్తుతం హై అలర్ట్ ఉండడంతో పలువురు సినీ ప్రముఖులు తమ షోలను క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇప్పటికే సింగర్ అర్జిత్ సింగ్ ఏప్రిల్ 27న చెన్నైలో జరగాల్సిన తన షో రద్దు చేసుకోగా.. తాజాగా సింగర్ శ్రేయాఘోషల్ కూడా తన కన్సర్ట్‌ను రద్దుచేసుకుంది. నేడు గుజరాత్‌లోని సూరత్ వేదికగా శ్రేయాఘోషల్ మ్యూజిక్ కన్సర్ట్ ఉండగా.. తాజాగా ఈ క్యాన్సిల్ చేసుకున్నామని ప్రకటించింది శ్రేయా. ఇప్పటికే షో కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారికి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని వెల్లడించారు.'ఆల్ హార్ట్స్ టూర్ అనే పేరుతో శ్రేయాఘోషల్ దేశ విదేశాల్లో సంగీత ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆమె చెన్నై, కోయంబత్తూరులో ఇప్పటికే ప్రదర్శనలు ఇచ్చారు. ఈరోజు సూరత్‌లో జరగాల్సిన కార్యక్రమం రద్దయింది. మళ్లీ ముంబైలో మే 10న ఆమె షో ఉంటుంది. మరోవైపు, అనిరుధ్ కూడా 'హుకుమ్' పేరుతో ప్రపంచ టూర్ చేస్తున్నారు. మే 31న బెంగళూరులో జరగనున్న ఆయన కాన్సర్ట్ టికెట్లు గంటలోనే అమ్ముడయ్యాయి. ప్రేక్షకుల ఆదరణతో జూన్ 1న కూడా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయితే, ఉగ్రదాడి కారణంగా రెండో రోజు టికెట్ల అమ్మకాలు వాయిదా పడ్డాయి. కొత్త తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

## సమష్టిగా రాణించిన రైజర్స్.. చెన్నైది అదే కథ



**చెన్నై-నవభూమి** వరుసగా రెండు ఓటముల తర్వాత ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తిరిగి విజయాల బాట పట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంతితో పాటు బ్యాట్‌తోనూ సమిష్టిగా రాణించిన సన్‌రైజర్స్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదుచేసింది. చెపాక్‌లో చెన్నైపై సన్‌రైజర్స్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం. లో స్కోరింగ్ మ్యాచ్‌లో సీఎస్‌కే నిర్దేశించిన 155 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 44, 5 ఫోర్లు, 1 సిక్స్), కమిందు మెండిస్ (22 బంతుల్లో 32 నాటౌట్, 3 ఫోర్లు) రాణించారు. మొదట హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో చెన్నై.. 19.5 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌట్ అయింది. హర్షల్ పటేల్ (4/28), పాట్ కమిన్స్ (2/21), జయదేవ్ ఉనద్కత్ (2/21) ఆతిథ్య జట్టును భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 42, 1 ఫోర్, 4 సిక్సర్లు), అయుశ్ మాత్రె (19 బంతుల్లో 30, 6 ఫోర్లు) సీఎస్‌కేను ఆదుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది ఆడిన 9 మ్యాచ్‌లకు గాను ఏడో ఓటమి. ఈ ఫలితంతో ప్లేఆఫ్ రేసు నుంచి ఆ జట్టు అధికారికంగా నిష్క్రమించినట్టే.ఈ సీజన్‌లో బ్యాటిం గ్ వైఫల్యాలతో తేలిపోతున్న సీఎస్‌కే.. హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ దానినే కొనసాగించింది. ఇన్నింగ్స్ తొలి బంతికి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. పడుతూ లేస్తూ నామమాత్రపు స్కోరు సాధించింది. చెన్నైకి ఆడుతున్న అరంగేట్ర ఆటగాడు బ్రెవిస్, ఇటీవలే ఆ జట్టుకు ఎంట్రీ ఇచ్చిన అయుశ్ ఇద్దరే ఫర్వాలేదనిపించారు. ఈ మ్యాచ్‌తో మళ్లీ ఎస్ఆర్‌హెచ్ తుది జట్టులోకి వచ్చిన షమీ.. తొలి బంతికే షేక్ రషీద్‌ను డకౌట్ చేసి సీఎస్‌కేను ఆరంభంలోనే దెబ్బకొట్టాడు. మూడో స్థానంలో సామ్ కరన్ (9)ను ఆడించినా అతడూ విఫలమయ్యాడు. హర్షల్ ఐదో ఓవర్లో కరన్.. అనికేత్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అయుశ్ మాత్రం ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. బౌండరీతో పరుగుల వేటను ప్రారంభించిన ఈ మహారాష్ట్ర కుర్రాడు.. కమిన్స్, ఉనద్కత్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు రాబట్టాడు.

## జోక్ కాదు.. పాక్‌తో క్రికెట్ మ్యాచ్‌లే వద్దు : సౌరవ్ గంగూలీ



**కోల్‌కతా-నవభూమి**ఃపహల్గామ్ ఉగ్రదాడి ఘటన పట్ల భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో అన్ని క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోల్‌కతాలో ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో క్రికెట్ బంధాన్ని వంద శాతం నిలిపివేయాలని, చాలా కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇలాంటి ఘటనలు జరగడం జోక్‌గా తీసుకోవద్దు అని, ఉగ్రవాదాన్ని సహించలేమని గంగూలీ తెలిపారు. వాస్తవానికి చాన్నాళ్ల నుంచి పాక్, ఇండియా మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరగడం లేదు. ఇటీవల కేవలం ఐసీసీ నిర్వహించే ఈవెంట్లలో మాత్రమే ఆ రెండు దేశాలు పోటీపడుతున్నాయి.రెండు దేశాల మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2008 నుంచి పాక్‌లో ఇండియా పర్యటించలేదు. చివరిసారి ఆసియాకప్‌లో ఆ జట్లు తలపడ్డాయి. 2012-13లో చివరిసారి ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొన్నాయి. ఇటీవల నిర్వహించిన ఐసీసీ టోర్నీలో పాల్గొన్నా.. పాకిస్థాన్‌లో ఆడేందుకు మాత్రం ఇండియా నిరాకరించింది. దుబాయ్‌లోనే ఆ దేశంతో మ్యాచ్‌లు ఆడింది. ఇండియా, పాకిస్థాన్ మధ్య హైబ్రిడ్ మోడల్ క్రికెట్ జరగాలని ఇటీవల ఐసీసీ నిర్ణయించిన విషయం తెలిసిందే. తటస్థ వేదికలపై ఆడేందుకు నిర్ణయించారు. కానీ ఇప్పుడు ఆ వేదికల్లోనూ ఆడరాదు అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## అర్షద్‌ను తోటి అథ్లెట్‌గానే ఆహ్వానించా.. నీరజ్ చోప్రా వివరణ



**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే నెలలో బెంగళూరు వేదికగా జరుగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ (ఎన్‌సీ క్లాసిక్-2025) ఈవెంట్‌కు పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై భారత గోల్డెన్ బాయ్ స్పందించాడు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎన్‌సీ క్లాసిక్‌కు పాక్ అథ్లెట్‌ను పిలవడాన్ని నిరసిస్తూ చాలామంది నెటిజన్లు నీరజ్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. తాజాగా నీరజ్.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సుదీర్ఘమైన లేఖలో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ వివరణ ఇచ్చాడు. 'ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.అందులో ఎక్కువ భాగం ద్వేషం, అసభ్యకరమైనవే ఉన్నాయి. వాళు నా కుటుంబాన్నీ విడిచిపెట్టలేదు. ఈ ఈవెంట్‌లో పాల్గొనబోయే క్రీడాకారులకు సోమవారమే (పహల్గాం ఉగ్రదాడికి ముందు) ఆహ్వానం పంపాం. అగ్రశ్రేణి అథ్లెట్లను భారత్‌కు రప్పించి ప్రపంచస్థాయిలో నిర్వహించగలమని చాటిచెప్పడమే ఎన్‌సీ క్లాసిక్ ఉద్దేశం. కానీ ఈ 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఈ ఈవెంట్‌కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. నాకు నా దేశ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**